తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

గురువారం 20.11.2025 | సంపుటి : 12 సంచిక : 120 | పేజీలు : 12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






## నేడు పదోసారి సీఎంగా నితీష్ ప్రమాణం

- ఎన్డీఏ నేతగా ఏకగ్రీవంగా ఎంపిక..
- నేటి ప్రమాణోత్సవానికి మోడీ, అమిత్ షా హాజరు

పాట్నా (జనంసాక్షి):బిహార్‌లో నితీశ్ కుమార్ సారథ్యంలో ఎన్డీయే కొత్త ప్రభుత్వం గురువారం కొలువు తీరనుంది. బిహార్ ప్రస్తుత అసెంబ్లీ గడువు ముగియనుండటంతో ముఖ్యమంత్రి పదవికి నితీశ్ కుమార్ బుధవారం సాయంత్రం రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌ను సమర్పించారు. ఎన్డీయే సభ్యుల మద్దతు లేఖను గవర్నర్‌కు అందజేశారు. ప్రభుత్వ ఏర్పాటుకు తమను ఆహ్వానించాలని గవర్నర్‌ను కోరారు. ఇందుకు గవర్నర్ సానుకూలంగా స్పందించారు. నితీశ్ రాజీనామాను వెంటనే ఆమోదించారు. నితీశ్ వెంట గవర్నర్‌ను కలిసి వారిలో ఎల్‌జేపీఆర్‌వీ చీఫ్ చిరాగ్ పాశ్వాన్, ఆర్‌ఎల్‌ఎం చీఫ్ ఉపేంద్ర కుష్వాహ తదితరులు ఉన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు దిశగా బుధవారం మిగతా 2లో..

## దేశం కోసం ప్రాణాలర్పించిన మహోన్నత శక్తి ఇందిరమ్మ



"శిల్పారామంలో 3 ఎకరాల్లో ఇందిరా మహిళా శక్తి బజార్ ఏర్పాటు చేశాం. మహిళలకు ఇందిరమ్మ క్యాంటీన్లు కేటాయించాం. ఆన్‌లైన్ మార్కెట్ కోసం అమెజాన్‌తో సంప్రదింపులు చేస్తున్నాం. మహిళల ఉత్పత్తులకు గుర్తింపు తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం. కోటి మంది హిళలలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం"
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- మహిళా ఉత్పత్తులకు ఆమెజాన్‌తో ఒప్పందానికి సంప్రదింపులు
- మహిళాసంఘాలకు పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్లు
- ఇందిరకు ఘనంగా నివాళి అర్పించిన సీఎం రేవంత్ రెడ్డి

- కోటి మంది మహిళలకు చీరలు అందిస్తాం
- గ్రామీణ ప్రాంతాల్లో 65లక్షల మందికి, మున్సిపాలిటీల్లో 35 లక్షల మందికి..
- ఇందిరా గాంధీ జయంతి వేడుకల సందర్భంగా మహిళలకు చీరల పంపిణీ

హైదరాబాద్(జనంసాక్షి): పరిపాలనలో ఇందిరా గాంధీ ఒక రోల్ మోడల్ అని సిఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. బలహీన వర్గాలకు ఇందిరమ్మ పాలన సువర్ణ అధ్యాయమని సీఎం రేవంత్ చెప్పారు. భూ సంస్కరణలతో పేదలకు భూ పంపిణీ చేశారని గుర్తుచేశారు. పాకిస్తాన్‌ను విడగొట్టి బంగ్లాదేశ్‌ను ఏర్పాటు చేశారని, ప్రపంచ దేశాల బెదిరింపులకు ఇందిరమ్మ భయపడలేదని సీఎం రేవంత్ తెలిపారు. మాజీ ప్రధాని, దివంగత ఇందిరా గాంధీ జయంతి మిగతా 2లో..

## ఆంధ్రప్రదేశ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్

మారేడిమిల్లిలో ఎదురుకాల్పులు • ఏడుగురు మావోయిస్టుల మృతి

ఏలూరులో అరెస్టయిన 15 మంది మావోయిస్టులకు రిమాండ్

విశాఖపట్టణం(జనంసాక్షి): మారేడిమిల్లిలో బుధవారం జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావో యిస్టు కీలక నేతలు హతమయ్యారు. వీరంతా హిడ్మా ఎన్‌కౌంటర్‌లో తప్పించుకున్న వారేనని పోలీసులు అనుమానిస్తున్నారు. సౌత్ జోనల్ కమిటీ సభ్యుడు, ఆంధ్రా ఒరిస్సా బోర్డర్ ఇన్చార్జి జోగారావు అలియాస్ టెక్ శంకర్ ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. అలాగే పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు నంబాల కేశవరావు ప్రొటెక్షన్ టీం కమాండర్, డివిజనల్ కమిటీ సభ్యురాలు జ్యోతి కూడా ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. మావోయిస్టు పార్టీ కమ్యూనికేషన్ టీం ఛీఫ్, సౌత్ జోనల్ కమిటీ మెంబర్ సురేష్ అలియాస్ రమేష్, ఏరియా కమిటీ సభ్యులు జాగరగొండ ఏరియా మిలిషియా కమాండర్ లోకేష్ అలియాస్ గణెలిష్ కూడా హతమయ్యారు. వీరితో పాటు జాగరగొండ డిప్యూటీ కమాండర్, ఏరియా కమిటీ సభ్యుడు శ్రీను అలియాస్ వాసు.. జాగరగొండ డివిజనల్ కమిటీ, ఏరియా కమిటీ సభ్యురాలు అనిత, ఇదే కమిటీలో సభ్యురాలు షమ్మి ఎన్‌కౌంటర్‌లో మరణించారు. మొత్తం ఏడుగురు మావోయిస్టులు మరణించినట్టు అధికారులు ధృవీకరించారు. వీరి తలలపై లక్షల రివార్డు ఉందని స్పెషల్ ఇంటలిజెన్స్ బ్యూరో చెబుతోంది. మారేడుమిల్లిలో ఎన్‌కౌంటర్, ఏపీలోని ఐదు జిల్లాల్లో పట్టుబడిన మావోయిస్టులకు సంబంధించిన వివరాలను అడిషనల్ డీజీ మహేష్ చంద్ర లడ్డా మీడియాకు వివరించారు. మారేడుమిల్లిలో ఎన్‌కౌంటర్, ఏపీలో ఐదు జిల్లాలో పట్టుబడిన మావోయిస్టులకు సంబంధించిన వివరాలను అడిషనల్ డీజీ మహేష్ చంద్ర లడ్డా మీడియాకు వివరించారు. అంతేకాకుండా మిగతా 2లో..






## పంచాయతీ ఎన్నికలకు ఈసీ కసరత్తు

ఓటర్ల జాబితా సవరణకు ఆదేశాలు

- రేపటి నుంచి ఈ నెల 23 వరకు పంచాయతీలు, వార్డుల మిస్‌మ్యాపింగ్‌ల సవరణ
- జిల్లా పంచాయతీ అధికారులకు కమిషనర్ రాణి కుముదిని ఆదేశాలు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా పంచాయతీల్లో ఓటరు జాబితా మరోసారి సవరణకు ఎస్ఈసీ షెడ్యూలు ప్రకటించింది. రేపటి నుంచి ఈనెల 23 వరకు గ్రామాల్లో ఓటర్ల జాబితాలను సవరించాలని నిర్ణయించింది. 20న ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాల స్వీకరణ, తప్పుల సవరణ, 21న ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాల పరిష్కారం, 23న తుది ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రచురణ ఉంటుందని ఎన్నికల సంఘం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈమేరకు జిల్లా పంచాయతీ అధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశాలు జారీ చేశారు.రాష్ట్రంలో డిసెంబరు రెండో వారంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు షెడ్యూలు వెలువడే అవకాశం ఉంది. మిగతా 2లో..

## ఐ బొమ్మ రవికి పోలీస్ కస్టడీ

ఐదురోజుల కస్టడీకి కోర్టు అనుమతి



హైదరాబాద్(జనంసాక్షి): పైరసీ సైట్ 'ఐబొమ్మ' నిర్వాహకుడు ఇమంది రవి అరెస్టైన తరవాత పోలీసులు కస్టడీ కోరారు. ఈ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రధాన నిందితుడు రవి కస్టడీకి అనుమతిస్తూ హైదరాబాద్ నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఐదు రోజుల కస్టడీకి అనుమతిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. రేపటి నుంచి ఐబొమ్మ రవిని కస్టడీలోకి తీసుకుని పోలీసులు ప్రశ్నించనున్నారు. పైరసీ మాఫియాకు సంబంధించిన వివరాలు రాబట్టే పనిలో పోలీసులు ఉన్నారు.వారం రోజుల పాటు ఇమంది రవిని కస్టడీకి ఇవ్వాలని నాంపల్లి కోర్టులో సైబర్ క్రైమ్ పోలీసులు మిగతా 2లో..


## ఎన్ఐఏ కస్టడీకి అన్మోల్ బిష్ణోయ్

9లో..

## రెండు ఎన్‌కౌంటర్లూ బూటకమే

అదుపులోకి తీసుకుని దారుణంగా కాల్చివేశారు

- కోర్టులో హాజరు పర్చకుండా చంపేస్తున్నారు
- తక్షణమే ఈ దారుణాన్ని ఆపేయాలి
- ఎన్‌కౌంటర్లపై న్యాయవిచారణకు సీపీఎం డిమాండ్



### హిడ్మాను పట్టుకుని కాల్చిచంపారు

మాజీ మావోయిస్ట్ జంపన్న కీలక వ్యాఖ్యలు

12లో..

విజయవాడ(జనంసాక్షి):అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి ఏజెన్సీలో జరిగిన వరుస ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. మావోయిస్టులను ముందుగానే నిర్బంధించి, అరెస్టు చేసి కోర్టు ముందు ఉంచే అవకాశం ఉన్నప్పటికీ పోలీసులు అన్యాయంగా బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని వార్తలు వచ్చాయన్నారు. చట్ట విరుద్ధమైన బూటకపు ఎన్‌కౌంటర్లను సీపీఎం ఖండిస్తుందని తెలిపారు. విజయవాడ, ఏలూరు, కాకినాడ వంటి నగరాల్లో పోలీసులు దాడులు చేసి 50 మందికి పైగా మావోయిస్టులు, వారి అనుయాయులను నిర్బంధించారన్నారు. వివిధ చోట్ల నిర్బంధించబడిన వీరిని వెంటనే సంబంధిత న్యాయస్థానాల ముందుంచాలని కోరారు. అమాయక గిరిజనులను మావోయిస్టులకు మిగతా 2లో..

## భారత్, రష్యాలది దశాబ్దాల స్నేహం

- వ్యవసాయం, విద్యుత్తు, డిఫెన్స్, సహకార బ్యాంకు రంగాల్లో పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాం
- రష్యా బృందంతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటి

హైదరాబాద్(జనంసాక్షి): భారత్, రష్యా దేశాల మధ్య దశాబ్దాలుగా స్నేహ బంధం కొనసాగుతుందని, తెలంగాణ రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు రష్యా బృందం ఆసక్తి చూపడాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానిస్తుందని, ఆసక్తిని కనబరుస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం సాయంత్రం ప్రజాభవన్లో ఆయన గ్లోబల్ ట్రేడ్ మరియు టెక్నాలజీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, వీటీబీ రష్యన్ బ్యాంక్ ప్రతినిధులతో చర్చించారు. వ్యవసాయం, విద్యుత్తు, టెక్నాలజీ రంగాల్లో దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందని డిప్యూటీ సీఎం రష్యా ప్రతినిధి బృందానికి సూచించారు. ఒక సీజన్ లో 1.40 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి చేసి దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందని వివరించారు. ఫార్మా, ఐటీ రంగాలకు హబ్ గా తెలంగాణ రాష్ట్రం నిలిచిన విషయాన్ని లెక్కలతో డిప్యూటీ సీఎం వివరించారు. మైనింగ్ రంగంలోనూ తెలంగాణ రాష్ట్రం ముందంజలో ఉందని 100 సంవత్సరాల పైబడిన చరిత్ర కలిగిన ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి, 45 వేల మంది ఉద్యోగులతో కొనసాగుతున్న విషయాన్ని వివరించారు. సింగరేణి సంస్థ విస్తరణ లో భాగంగా క్రిటికల్ మినరల్ మైనింగ్ దిశగా ముందుకు పోతున్న విషయాన్ని వివరించారు. డిఫెన్స్ రంగంలోనూ హైదరాబాద్ దేశంలోనే ముందంజలో ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు స్వర్గధామం లాంటిది ఇక్కడ మంచి వాతావరణం, పరిశ్రమలు నెలకొల్పడానికి అవసరమైన భూమి, ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్, పెద్ద సంఖ్యలో ఇంజనీరింగ్ కళాశాలలు, మంచి నైపుణ్యం ఉన్న తక్కువ ధరకు లభించే మానవ వనరులు అందుబాటులో ఉన్నాయని డిప్యూటీ సీఎం రష్యా బృందానికి తెలిపారు. మిగతా 2లో..






## ఓడిన చోటే గెలిచి చూపిద్దాం

- జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కండి
- జూబ్లీహిల్స్ సమీక్ష సమావేశంలో కేటీఆర్ పిలుపు
- దొంగ ఓట్లు, అక్రమాలతోనే కాంగ్రెస్ గెలుపు
- కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా

హైదరాబాద్(జనంసాక్షి): జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు, పార్టీ బలోపేతంపై చర్చించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన తెలంగాణ భవన్లో కీలక సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మాజీ మంత్రులు హరీష్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఇతర ఎమ్మెల్యేలు, జూబ్లీహిల్స్ నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. దివంగత గోపీనాథ్ మరణం తర్వాత పార్టీ ఆయన కుటుంబానికి అండగా నిలిచిందని గుర్తు చేశారు. గోపీనాథ్ సతీమణి సునీతమ్మ గెలుపు కోసం కేసీఆర్ నుంచి బూత్ స్థాయి కార్యకర్త వరకు ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యుల్లా పనిచేశారని ప్రశంసించారు. రేపు రాబోయే కార్పొరేటర్ ఎన్నికల్లో కార్యకర్తల గెలుపు కోసం, ఎమ్మెల్యే ఎన్నికల్లో వారు పడ్డ కష్టానికి మించి తాము పని చేస్తామని, "కాలికి బలపం కట్టుకొని తిరుగుతాం" అని కేటీఆర్ కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఇటీవలి ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలు అక్రమాలకు పాల్పడ్డాయని కేటీఆర్ ఆరోపించారు. కర్ణాటక నుంచి మనుషులను తెచ్చి దొంగ ఓట్లు వేయించుకున్నారని, షేక్ పేట, ఎర్రగడ్డ వంటి ప్రాంతాల్లో రిగ్గింగ్ చేశారని మండిపడ్డారు. పోలీసులను అడ్డం పెట్టుకుని, డబ్బు, మద్యం పంచి గెలిచారని, ఇది నైతిక గెలుపు కాదని విమర్శించారు. వ్యక్తిగత మిగతా 2లో..



## రైతులు ప్రకృతి వ్యవసాయంవైపు మళ్లండి

- ఈ రంగంలో గ్లోబల్ హబ్‌గా భారత్
- కోయంబత్తూర్ సభలో మోదీ
- 21వ విడుత పీఎం కిసాన్ నిధులను విడుదల చేసిన ప్రధాని

కోయంబత్తూర్ (జనంసాక్షి):ప్రకృతి వ్యవసాయంలో భారత్ ప్రపంచానికి హబ్‌గా మారుతుందని ప్రధాని నరేంద్ర మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఇది స్వదేశీ విధానమని, సంప్రదాయంగా వస్తోందని మోదీ వివరించారు. రైతులు ఏడాదికి ఒక ఎకరం చొప్పున క్రమంగా ప్రకృతి వ్యవసాయం వైపు మారాలని పిలుపునిచ్చారు. అలాగే రైతులు చేతులెత్తి తమ టవల్?ను ఊపుడం చూస్తే బిహార్ గాలులు తన కంటే ముందే తమిళనాడులో వీచినట్లుగా ఉందని అన్నారు. తమిళనాడులోని కోయంబత్తూర్‌లో పర్యటించిన ప్రధాని మోదీ, పీఎం- కిసాన్ 21వ విడత నిధులను విడుదల చేశారు. దీంతో దేశవ్యాప్తంగా రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ నిధులు జమకానున్నాయి.'వాతావరణ మార్పులు, నేల సారం సమస్యలకు ప్రకృతి వ్యవసాయం, పంటల మార్పిడే పరిష్కారం. అధిక రసాయనాలు, పురుగుమందుల వాడకంతో నేలసారం బాగా దెబ్బతింటోంది. మిగతా 2లో..



## స్వల్ప మార్పులు మినహా అంతా పాతవే..

చిన్నచిన్న మార్పులతో కేంద్రం వాటిని మళ్లీ ప్రవేశపెట్టింది

ట్రైబ్యునళ్ల చట్టంపై సుప్రీం కోర్టు కీలక తీర్పు

న్యూఢిల్లీ(జనంసాక్షి): ట్రైబ్యునళ్ల సంస్కరణల (హేతుబద్ధీకరణ, సర్వీసు నిబంధనల) చట్టం-2021ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం కీలక తీర్పు వెలువరించింది. ఈ చట్టంలో నియామకాలు, మిగతా 2లో..

## తెలంగాణ గజ..గజ..

- రాష్ట్రంలో పెరుగుతున్న చలితీవ్రత
- ఏజెన్సీలో మరింత పడిపోతున్న ఉష్ణోగ్రతలు

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలో చలిగాలుల తీవ్ర పెరుగుతోంది. దీనికితోడు రాత్రపూట చలి పెరిగింది. ఏజెన్సీ జిల్లాల్లో చలి పంజావిసురుతోంది. కొన్ని జిల్లాలలో వచ్చే రెండు రోజులు తీవ్రమైన చలి గాలులు వీస్తాయని వాతావరణశాఖ ఒక ప్రకటనలో హెచ్చరించింది. సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్‌లో ఎల్లో అలర్ట్ జారీ చేసినట్టు పేర్కొన్నది. ఆదిలాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, ఆసిఫాబాద్, కుమ్రంభీం, నిర్మల్ జిల్లాలతోపాటు మరో ఐదు జిల్లాలలో తీవ్రమైన చలిగాలులు మిగతా 2లో..



# నేడు పదోసారి సీఎంగా నితీష్ ప్రమాణం

ఉదయం నుంచి పాట్నాలో వేగంగా పరిణామాలు చోటుచేసుకున్నాయి. జేడీయూ ఎమ్మెల్యేలు సమావేశమై పార్టీ శాసనసభా పక్ష నేతగా నితీశ్‌ను ఎన్నుకున్నారు. బీజేపీ లెజిస్లేచర్ పార్టీ నేతలు సైతం సమావేశమై పార్టీ నేతలు సామ్రాట్ చౌదరి, విజయ్ సిన్హా ఉప ముఖ్యమంత్రులుగా తిరిగి కొనసాగించాలని నిర్ణయించారు. అనంతరం ఎన్డీయే సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దిలీప్ జైశ్వాల్, సామ్రాట్ చౌదరి, చిరాగ్ పాశ్వాన్, కేశవ్ ప్రసాద్ మౌర్య, విజయ్ కుమార్ సిన్హా, రాజు తివారి సహా ఎన్డీయేకు చెందిన 202 మంది ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఎన్డీయే లెజిస్లేచర్ పార్టీ నేతగా నితీశ్ కుమార్ పేరును సామ్రాట్ చౌదరి ప్రతిపాదించగా, ఎమ్మెల్యేలంతా బలపరిచారు. దీంతో నితీశ్ 10వ సారి ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. ఈ సమావేశానంతరం నితీశ్ సారథ్యంలోని పలువురు నేతలు గవర్నర్‌ను కలుసుకున్నారు. మరోవైపు, నితీశ్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి భారీ ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. పాట్నాలోని గాంధీ మైదానంలో 20వ తేదీ మధ్యాహ్నం 11.30 గంటలకు ప్రమాణస్వీకారం ఉంటుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు ఈ ప్రమాణస్వీకారోత్సవానికి హాజరవుతున్నారు. దీంతో బీహార్‌లో నూతన ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. తదుపరి ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్ ఖరారయ్యారు. ఈ మేరకు ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు.. తమ కూటమి నేతగా నితీశ్‌ను ఎన్నుకున్నారు. జేడీయూ సుప్రీం నితీశ్ కుమార్ ఎన్డీయే (బీజేపీ) నేతగా బుధవారంనాడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో ఆయన బీహార్ ముఖ్యమంత్రిగా 10వ సారి ప్రమాణస్వీకారానికి మార్గం సుగమమైంది.కొత్త మంత్రివర్గంలో బీజేపీ నేతలు సామ్రాట్ చౌదరి, విజయ్ సిన్హా తిరిగి ఉప ముఖ్యమంత్రులుగా కొనసాగనున్నారు. ఈ మేరకు బీజేపీ ఎల్పీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల వెలువడిన అసెంబ్లీ ఫలితాల్లో ఎన్డీయే 243 స్థానాల్లో 202 స్థానాలు గెలుచుకుని అఖండ విజయం సొంతం చేసుకుంది. ఎన్డీయే ప్రధాన భాగస్వామ్య పార్టీ అయిన బీజేపీ 89 సీట్లు గెలుచుకుని బీహార్‌లో ఏకైక పెద్ద పార్టీగా నిలిచింది. ఆ తర్వాత స్థానంలో 85 సీట్లతో జేడీయే నిలిచింది. ఎన్డీయే కూటమిలోని ఎల్‌జేపీఆర్‌వీ 19 సీట్లు, హెచ్ఏఎం 5, ఆర్ఎల్ఎం 4 సీట్లు గెలుచుకున్నాయి.

## భర్త సహోద్యోగే హంతకుడు..

**ఎనిమిదన్నరేళ్ల క్రితం తల్లీ కుమారుడి హత్య కేసు ఛేదించిన అమెరికా పోలీసులు**



**న్యూజెర్సీ(జనంసాక్షి):** అమెరికా న్యూజెర్సీలోని మాపుల్‌షేడ్‌లో ఎనిమిదిన్నరేళ్ల క్రితం కుమారుడితో సహా దారుణ హత్యకు గురైన శశికళ నర్రా మర్డర్ కేసును పోలీసులు ఛేదించారు. 2017లో జరిగిన ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన అధికారులు అసలు నిందితున్ని పట్టుకున్నారు. నిందితుడికి చెందిన ల్యాప్‌టాప్‌ అతన్ని పట్టించడంలో కీలక ఆధారంగా పనిచేసింది. ఈ కేసులో భర్త స్నేహితుడే హంతకుడిగా గుర్తించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హనుమంతరావు నర్రా అనే వ్యక్తి.. అమెరికా న్యూజెర్సీలోని మాపుల్‌షేడ్ ప్రాంతంలో నివాసముండేవాడు. ఈయనకు భార్య శశికళ నర్రా(40), కుమారుడు అనీష్ సాయి నర్రా(7) ఉండేవారు. 2017 మార్చి 23న హనుమంతరావు విధులు ముగించుకుని ఇంటికి వచ్చేసరికి.. వారి అపార్ట్‌మెంట్‌లో భార్య సహా కొడుకు రక్తపు మడుగులో విగతజీవులుగా పడి ఉండటం చూసి షాక్ అయ్యాడు. తల్లీకొడుకులు ఇద్దరిపై కత్తితో దారుణంగా కత్తిపోట్లు ఉండటాన్ని గమనించి.. వెంటనే పోలీసులు సమాచారమిచ్చాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. తొలుత భర్త హనుమంతరావుపై అనుమానం వ్యక్తంచేశారు. దీనికి తోడు.. అతడికి కేరళకు చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధాలున్నాయని, అతడే భార్యాబిడ్డల హత్యకు కారణమని మృతురాలి బంధువులు ఆరోపించడంతో అతడిపై విచారణ చేపట్టారు. అయితే.. ఘటనా స్థలంలో లభించిన డీఎన్ఏ నమూనాలు అతడితో సరిపోలక పోవడంతో వదిలేశారు. చివరకు ఆ నమూనాలు హమీద్‌వేనని ఫోరెన్సిక్ నిపుణులు వెల్లడించారు. నిందితుడు నజీర్ అహ్మద్‌కు హనుమంతరావుకు సహోద్యోగి. హమీద్ సమీపంలోని అపార్ట్‌మెంట్‌లో నివసించేవాడు. హనుమంతరావు, హమీద్‌ల మధ్య విభేదాలున్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఈ దిశగా విచారణ చేపట్టారు. అయితే.. హత్య జరిగిన సుమారు 6 నెలలకే హమీద్ భారత్‌కు తిరిగి వెళ్లినట్లు తెలుసుకున్నారు. దీంతో భారత్‌లోని సంబంధిత అధికారుల ద్వారా సంప్రదింపులు జరిపి హమీద్ డీఎన్ఏ నమూనా కావాలని పలుమార్లు కోరారు. అయితే నిందితుడు వాటిని పట్టించుకోకుండా మొహం చాటేశాడు. దీంతో అక్కడి అధికారులు.. న్యాయస్థానం సహకారంతో అతడు పనిచేసే కాగ్నిజెంట్ సంస్థతో మాట్లాడి ఇండియాలో అతడు వినియోగించిన ల్యాప్‌టాప్‌ను తెప్పించుకున్నారు. దానిపై అతడి డీఎన్ఏ నమూనాలు సేకరించి, ఘటనా స్థలంలో లభించిన డీఎన్ఏ నమూనాలతో పోల్చిచూశారు. అతడి నమూనాలు సరిపోలడంతో గుట్టు రట్టయింది. దీంతో హమీద్‌ను నిందితుడిగా పేర్కొంటూ అమెరికా పోలీసులు. నిందితుడు హమీద్‌ను తమకు అప్పగించాలని భారత విదేశాంగ శాఖను కోరారు. ఈ దారుణమైన హత్యల వెనకున్న అసలు ఉద్దేశం ఏంటనే విషయమై ఇంకా స్పష్టత రాకపోయినా.. హనుమంతరావుకు, హమీద్‌కు మధ్య ఉన్న వ్యక్తిగత కక్షలే హత్యకు ప్రేరేపించినట్లు తెలుస్తోంది.

## స్వల్ప మార్పులు మినహా అంతా పాతవే..

సర్వీసు కండిషన్లు, పదవీకాలాలకు సంబంధించిన కొన్ని నిబంధనలను సర్వోన్నత న్యాయస్థానం రద్దు చేసింది. అవన్నీ పాతవేనని, చిన్నచిన్న మార్పులతో కేంద్రం వాటిని మళ్లీ ప్రవేశపెట్టిందని ధర్మాసనం వెల్లడించింది. ఈ చట్టంలో కేంద్రం తీసుకొచ్చిన కొత్త నిబంధనలు న్యాయవ్యవస్థ స్వాతంత్య్రాన్ని, అధికార విభజన సూత్రాలను ఉల్లంఘిస్తున్నాయని, అలాంటి వాటిని తిరిగి ప్రవేశపెట్టేంత అవసరం లేదని సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ ధర్మాసనం వ్యాఖ్యానించింది. "దీనికి సంబంధించి ఆర్డినెన్స్, 2021 చట్టాన్ని మేం సరిచూశాం. గతంలో కోర్టు రద్దు చేసిన నిబంధనలను స్వల్ప మార్పులతో మళ్లీ అమల్లోకి తెచ్చారు. ఇది రాజ్యాంగ విరుద్ధమే అవుతుంది" అని ధర్మాసనం స్పష్టం చేసింది.ఈ సందర్భంగా ట్రైబ్యునళ్ల సభ్యుల పదవీకాలాలకు సంబంధించి గతంలో ఇచ్చిన న్యాయపరమైన ఆదేశాలను కోర్టు పునరుద్ఘాటించింది. ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రైబ్యునల్, కస్టమ్స్, ఎక్సైజ్, సర్వీస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రైబ్యునల్ సభ్యులు 62 ఏళ్ల వచ్చేవరకు పదవిలో కొనసాగొచ్చని తెలిపింది. ఇక, ట్రైబ్యునళ్ల ఛైర్‌పర్సన్లు/ అధ్యక్షుల రిటైర్మెంట్ వయసు 65 ఏళ్ల వరకు ఉంటుందని వెల్లడించింది. 2021లో తీసుకొచ్చిన ట్రైబ్యునళ్ల సంస్కరణల(హేతుబద్ధీకరణ, సర్వీసు నిబంధనల) చట్టంతో ఫిల్మ్ సర్టిఫికేషన్ అప్పిలేట్ ట్రైబ్యునల్‌తో సహా కొన్ని అప్పిలేట్ ట్రైబ్యునళ్లు రద్దయ్యాయి. వీటితోపాటు పలు ట్రైబ్యునళ్ల జుడీషియల్, ఇతర సభ్యుల నియామక నిబంధనల్లో పలు సవరణలు జరిగాయి.

# దేశం కోసం ప్రాణాలర్పించిన మహోన్నత శక్తి ఇందిరమ్మ



సందర్భంగా.. నెక్లెస్ రోడ్డులోని ఇందిరా గాంధీ విగ్రహానికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరా గాంధీ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజా పాలన చేస్తున్నామని, మహిళలకు స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం ఇస్తున్నామని సీఎం చెప్పారు. వెయ్యి ఆర్టీసీ బస్సులకు మహిళలను ఓనర్లను చేశామని గుర్తుచేశారు. ఇందిరాగాంధీ పాలన దేశానికి దిక్సూచి అని సీఎం రేవంత్ కొనియాడారు. వైఎస్ఆర్ హయంలో 25 లక్షల ఇందిరమ్మ ఇండ్లు కట్టించారని, డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని చెప్పి బీఆర్ఎస్ మోసం చేసిందని సీఎం విమర్శించారు. రాష్ట్రంలో 4 లక్షల ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తున్నామని, ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో మహిళలను భాగస్వామ్యులను చేస్తున్నామని సీఎం రేవంత్ చెప్పారు. 65 లక్షల చీరలను గ్రామీణ ప్రాంతాల ప్రజలకు పంపిణీ చేస్తామని, డిసెంబర్ 9 వరకూ ఇంటింటికీ చీరల పంపిణీ కొనసాగిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కోటి మంది మహిళలకు కోటి చీరలు పంపిణీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. మార్చి ఫస్ట్ నుంచి 8 వరకూ రెండో విడతలో చీరల పంపిణీ ఉంటుందని, రెండో విడతలో 35 లక్షల చీరలను పట్టణాల్లో పంపిణీ చేస్తామని సీఎం రేవంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ చీరల పంపిణీని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. పలువురు మహిళలకు చీరలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, కొండా సురేఖ, సీతక్క పాల్గొన్నారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయనున్నారు. నేటి నుంచి తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం డిసెంబరు 9 నాటికి గ్రామీణ ప్రాంతాల్లో చీరల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. రెండో దశలో మార్చి 1 నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8 వరకు పట్టణ ప్రాంతాల్లో అందజేయనున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా చీరల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పంపిణీని మండల కేంద్రాల్లో ఘనంగా నిర్వహించాలని చెప్పారు. ఇందుకు నియోజకవర్గానికో ప్రత్యేక అధికారిని నియమించనున్నట్లు తెలిపారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. మహిళలకు చీరలు పంపిణీ చేసి.. వారి వివరాలు సేకరించాలని ఆదేశించారు. దీని ద్వారా భవిష్యత్తులో సంక్షేమ పథకాలు వర్తిస్తాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల మంది మహిళలకు, మున్సిపాలిటీల్లో 35 లక్షల మంది మహిళలకు చీరల పంపిణీ చేస్తామని వివరించారు.ఇందిరమ్మ స్ఫూర్తితో మా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. మహిళలు పెట్రోల్ బంకులు నిర్వహించుకునేలా ప్రోత్సహించాం. ఆర్టీసీలో వెయ్యి బస్సులకు మహిళలను యజమానులను చేశాం. మహిళల సంక్షేమంతో పాటు ఆర్థిక ఉన్నతి కలిగించే కార్యక్రమాలు చేపట్టాం. ఆడబిడ్డల పేరుతోనే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తున్నాం. రాజకీయాల్లోనూ మహిళలకు తగిన ప్రాధాన్యత కల్పించాం. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం పనిచేస్తోంది. తెలంగాణ ఆడబిడ్డలకు ప్రభుత్వం తరఫున సారె పెట్టి గౌరవించాలని భావించాం. అందుకే కోటి మంది ఆడబిడ్డలకు కోటి చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించాం. మహిళా మంత్రులు, మహిళా ఎమ్మెల్యేలు, మహిళా అధికారులు ఇందిరమ్మ చీర కట్టుకోవాలి. మీరే బ్రాండ్ అంబాసిడర్‌గా మారి ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని చాటాలని సీఎం అన్నారు.

## భారత్, రష్యాలది దశాబ్దాల స్నేహం

1940 నుంచి ప్రభుత్వ రంగ సంస్థలకు హైదరాబాద్ కేంద్రంగా కొనసాగుతుందని, వ్యూహాత్మకంగా హైదరాబాద్ సురక్షిత ప్రాంతమని తెలిపారు. దృఢమైన సహకార బ్యాంకు వ్యవస్థలో టెక్నాలజీ, పెట్టుబడులకు సాదరంగా ఆహ్వానిస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. మా శాఖల అధికారులతో కూర్చుని చర్చించి మెరుగైన ఒప్పందాలు జరిగేలా ముందుకు వెళ్లాలని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని వివరించారు. 2047 విజన్ డాక్యుమెంట్, మూడు ట్రిలియం డాలర్ల ఎకానమీ లక్ష్యసాధన, రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం, మూసి పునర్జీవనం వంటి ప్రణాళికలను రష్యా బృందానికి డిప్యూటీ సీఎం వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రష్యా బృందానికి శుభాకాంక్షలు తెలియజేయాలని వివరించినట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ స్పెషల్ సిఎస్ సంజయ్ కుమార్, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్కో సీఎండీ కృష్ణ భాస్కర్, ప్రతినిధి బృందంలో వోల్గా భాష, రష్మీ సలూజ, సంజయ్ కౌశిక్, మోనికా తదితరులు పాల్గొన్నారు.

## ఐ బొమ్మ రవికి పోలీస్ కస్టడీ

పిటిషన్ దాఖలు చేశారు. ఇరు పక్షాల వాదనలు విన్న జడ్జి.. రవిని ఐదు రోజుల పాటు పోలీసు కస్టడీకి అనుమతించారు. కస్టడీ విచారణ లో మరిన్ని కీలక అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే ఈ కేసుపై ఈడీ దృష్టి సారించింది. తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన పైరసీ మూవీ రాకెట్ ఐబొమ్మ కీలక సూత్రధారి రవిని సైబర్ క్రైమ్ పోలీసులు గత శనివారం కూకట్‌పల్లిలో అరెస్టు చేశారు. ఓటీటీ వేదికల్లోని కంటెంట్ సహా కొత్తగా రిలీజ్ అయిన సినిమాలు పైరసీ చేస్తూ సినీ పరిశ్రమకు తీవ్ర నష్టం కలిగించాడు. గత ఏడేళ్లుగా ఐ బొమ్మ, బప్పం, ఐవిన్, ఐరాధ టీవీ పేర్లతో వెబ్‌సైట్‌లు నిర్వహించాడు.

## తెలంగాణ గజ..గజ..

వీచే అవకాశం ఉన్నదని తెలిపింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్–యూలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 6.8 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 7.8 డిగ్రీలు, రాజన్నసిరిసిల్ల జిల్లా రుద్రంగిలో 8.0 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైనట్టు వెల్లడించింది. రాష్ట్ర వ్యాప్తంగా 14 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని, చలిగాలుల తీవ్రత నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరించారు. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల 19నాటికి దక్షిణ అండమాన్ సముద్రం మీదుగా ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉన్నదని ప్రకటించింది. దీని ప్రభా వంతో 22న ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని వెల్లడించింది.

## పంచాయతీ ఎన్నికలకు ఈసీ కసరత్తు

అదే నెలాఖరులోపు పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తిచేసే వీలుంది. డిసెంబరు 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాల తర్వాత పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు మంత్రిమండలి నిర్ణయం నేపథ్యంలో ఈ ప్రక్రియపై రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ, రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టి సారించాయి. సోమవారం మంత్రిమండలి భేటీలో 'స్థానిక' ఎన్నికలపై విస్తృతంగా చర్చ జరిగింది. రిజర్వేషన్ల అమలు, రాష్ట్ర హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలు, న్యాయనిపుణుల సలహాలపై పంచాయతీరాజ్‌శాఖ నివేదిక ఇవ్వగా దానిపై మంత్రులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈనెల 24న హైకోర్టులో విచారణ గురించి చెప్పారు. మార్చి 31లోపు పంచాయతీ ఎన్నికలను పూర్తి చేస్తేనే కేంద్ర ఆర్థిక సంఘం నుంచి నిధులు విడుదలయ్యే అవకాశం ఉందన్నారు.

## రైతులు ప్రకృతి వ్యవసాయంవైపు మళ్లండి

మిల్లెట్స్ సూపర్ ఫుడ్. వాటిని రైతులు సాగు చేయాలి. గత 11 ఏళ్లలో వ్యవసాయ రంగంలో భారీగా మార్పులు జరిగాయి. వ్యవసాయ ఎగుమతులు దాదాపు రెండింతలయ్యాయి. వ్యవసాయాన్ని ఆధునికత దిశగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. రైతులకు సహాయం చేయడానికి అన్ని మార్గాలను విస్తృతంగా ప్రారంభించింది. రాబోవు సంవత్సరాల్లో భారత వ్యవసాయ రంగంలో అనేక భారీ మార్పులను చూడనున్నాం. ప్రకృతి వ్యవసాయానికి అంతర్జాతీయ హబ్‌గా మారే దిశలో భారత్ పయనిస్తోంది. మన జీవవైవిధ్యం కొత్త రూపు సంతరించుకుంటోంది. దేశ యువత వ్యవసాయాన్ని ఆధునికమైన, విస్తృతి కలిగిన అవకాశంగా చూస్తున్నారు. దీనివల్ల దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింతగా బలపడుతుంది.' అని ప్రధాని మోదీ అన్నారు.దక్షిణ భారత సహజ వ్యవసాయ సమ్మిట్‌ను అద్భుతంగా నిర్వహించినందుకు తమిళనాడు రైతులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు ప్రధాని మోదీ. 'ప్రదర్శనను చూశా. అనేక మంది రైతులతో మాట్లాడే అవకాశం వచ్చింది. మెకానికల్ ఇంజినీరింగ్, పిహెచ్‌డీ పూర్తి చేసి వ్యవసాయం చేస్తున్నవారు, నాసా నుంచి బయటకు వచ్చి వ్యవసాయం చేస్తున్నవార. అందరూ యువతను శిక్షణ ఇస్తున్నారు.ఈ కార్యక్రమానికి రాలేకపోయి ఉంటే నా జీవితంలో చాలా విషయాలు కోల్పోయే ఉంటాను. ఇక్కడికివచ్చి ఎంతో నేర్చుకున్నాను. తమిళనాడు రైతుల ధైర్యానికి, మార్పును స్వీకరించే శక్తికి సెల్యూట్ చేస్తున్నా' అని ప్రధాని మోదీ అన్నారు.అంతకుముందు కోయంబత్తూర్‌లో పర్యటించిన ప్రధాని మోదీ తొలుత రోడ్ షో నిర్వహించారు. అనంతరం దక్షిణ భారతదేశ ప్రకృతి వ్యవసాయ సదస్సును ఆయన ప్రారంభించారు. సదస్సులో స్టాళ్లను పరిశీలించిన మోదీ, రైతులు తయారు చేసిన వివిధ ఉత్పత్తులు, పండించిన పంటలను పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడిన ఆయన ప్రకృతి వ్యవసాయం గురించి ఆరా తీశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో పీఎం కిసాన్ 21వ ఇన్‌స్టాల్‌మెంట్ నిధులను ప్రధాని విడుదల చేశారు.

## ఆపరేషన్ సిందూర్ దుష్ప్రచారం చేసింది చైనానే..

**అమెరికా సంచలన రిపోర్ట్!**

**వాషింగ్టన్(జనంసాక్షి):** భారత్–చైనా సంబంధాలు గాడినపడుతున్న వేళ అమెరికా నుంచి ఒక సంచలన నివేదిక వెలువడింది. భారత వైమానిక దళం పాక్‌పై ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత భారత్‌ను లక్ష్యంగా చేసుకొని కృత్రిమ మేధ సాయంతో చైనా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసిందని అమెరికా కాంగ్రెస్ నిపుణుల సంఘం ఆరోపించింది. అమెరికా–చైనా ఆర్థిక, భద్రతా సమీక్ష కమిషన్ తన వార్షిక నివేదికలో ఈ అంశాలను ప్రస్తావించింది.ఏఐను ఉపయోగించి తయారు చేసిన నకిలీ చిత్రాలను ఫేక్ సోషల్ మీడియా అకౌంట్ల ద్వారా చైనా ప్రచారం చేసినట్లు నివేదిక వెల్లడించింది. వాటిలో రఫేల్ యుద్ధ విమానాల శకలాలను చూపించినట్లు తెలిపింది. తమ క్షిపణులతో భారత్, ఫ్రాన్స్ యుద్ధ విమానాలను కూల్చేశామని చైనా ప్రచారం చేసుకున్నట్లు అభిప్రాయ పడింది. రఫేల్ విమానాలపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న నమ్మకాన్ని దెబ్బతీయడమే ఈ ప్రచారం వెనక ముఖ్య ఉద్దేశమని తెలిపింది. తద్వారా తమ సొంత జే–35 విమానాలకు డిమాండ్ పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆరోపించింది.చైనా అనుసరిస్తున్న గ్రే జోన్ స్ట్రాటజీలో ఈ అసత్య ప్రచారం ఒక భాగం అని రిపోర్ట్ తెలిపింది. ప్రత్యక్ష సైనిక ఘర్షణ లేకుండానే భౌగోళిక రాజకీయాలపై ప్రభావం చూపడానికి చైనా ఇలాంటి వ్యూహాలను ఉపయోగిస్తుందని పేర్కొంది. మే నెలలో భారత్–పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలను ఆసరాగా చేసుకొని చైనా తమ ఆయుధ సంపత్తిని గొప్పగా చూపించే ప్రయత్నం చేసినట్లు వివరించింది.ఈ ఏడాది ఏప్రిల్‌లో పహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది పౌరులు చనిపోయిన విషయం తెలిసిందే. దానికి ప్రతీకారంగా భారత్ మే నెలలో ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయి. ఐదు పాకిస్థాన్ యుద్ధ విమానాలు, ఒక భారీ నిఘా విమానాన్ని భారత వాయుసేన ధ్వంసం చేసింది. ఈ విజయం భారత సైనిక సామర్థ్యాన్ని పెంచింది. దీనివల్లే భారత్‌పై చైనా డిజిటల్ దాడికి దిగిందని నివేదిక పేర్కొంది. భారత్–చైనా సరిహద్దు వివాదాల పరిష్కారంలో అనేక ఆటుపోట్లు ఉన్నట్లు నివేదిక పేర్కొంది. దౌత్య చర్చల ద్వారా కొన్ని పాక్షిక పరిష్కారాలను మాత్రమే అంగీకరించి సరిహద్దు అంశాన్ని పక్కన పెట్టాలని చైనా చూస్తున్నట్లు తెలిపింది. వాణిజ్యం, పెట్టుబడుల విషయంలో సహకారం కొనసాగిస్తూనే తమ భౌగోళిక డిమాండ్లను వదులుకోవద్దని భావిస్తున్నట్లు తెలిపింది.

# ఆంధ్రప్రదేశ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్

ఈరోజు కూడా ఏజెన్సీలో నక్సల్స్, పోలీసులకు మధ్య కాల్పులు జరిగినట్లు తెలిపారు. ఉదయం ఏడు గంటల సమయంలో ఏజెన్సీలో కాల్పులు జరిగాయని.. ఏడుగురు నక్సలైట్స్ చనిపోయారని తెలిపారు. వీరిలో నలుగురు పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నారన్నారు. వారిని పూర్తిగా గుర్తించాల్సి ఉందని చెప్పారు. మారేడుమిల్లిలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్ ప్రాంతానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఈఎన్‌కౌంటర్ జరిగినట్లు వెల్లడించారు. చనిపోయిన వారిలో జ్యోగారావు అలియాస్ టెక్ శంకర్ ఒక్కరినే గుర్తించామని తెలిపారు. శ్రీకాకుళానికి చెందిన జ్యోగారావు పదేళ్లుగా మావోగా ఉన్నారని.. ఇతర సమాచారాన్ని త్వరలోనే వెల్లడిస్తామని ఏడీజీ తెలిపారు. డీజీ ఇంకా మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్ నుంచి ఏపీకి రావాలని మావోయిస్టులు ప్రయత్నం చేస్తున్నారన్నారు. నిఘా వర్గాలు వారి కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు. నవంబరు 17న కీలకమైన ఆపరేషన్ చేపట్టామని.. నిన్న మారేడుమిల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత హిడ్మా, మరో ఐదుగురు ఎన్ కౌంటర్‌లో చనిపోయినట్లు చెప్పారు. వాళ్ల నుంచి సేకరించిన సమాచారంతో ఎక్కడెక్కడ మావోయిస్టులు ఉన్నారని దృష్టి పెట్టామని అడిషనల్ డీజీ వెల్లడించారు. ఎన్టీఆర్, కృష్ణా, కాకినాడ, కోనసీమ, ఏలూరు జిల్లాల నుంచి యాభై మంది మావోయిస్టులను పట్టుకున్నట్లు తెలిపారు. ఎక్కడా ఎవరికీ ప్రమాదం జరగకుండా ఆపరేషన్ పూర్తి చేశామన్నారు. ఊప్త చరిత్రలో ఇంతమంది కీలక వ్యక్తులను పట్టుకోవడం ఇదే ప్రథమమన్నారు. కేంద్ర, రాష్ట్ర, ఏరియా, కమిటీ సభ్యులు, ప్లాటూన్ టీంలను పట్టుకున్నట్లు తెలిపారు. వారిని నుంచి వెపన్స్ 45, 272 రౌండ్స్, రెండు మ్యాగజైన్, 750 గ్రాముల వైర్, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. తమ ఫీల్డ్ సిబ్బంది ప్రణాళిక ప్రకారం ఆపరేషన్ పూర్తి చేశారన్నారని.. ఇందులో పాల్గొన్న వారందరికీ అభినందనలు తెలియజేశారు. ఇంటిలిజెన్స్ విభాగం ఈ విషయంలో బాగా పని చేసిందని కొనియాడారు. ముందే సమాచారం వచ్చినప్పటికీ వారిపై నిఘా పెట్టామని.. వారి ఆలోచనలు, కార్యకలాపాలను గమనించినట్లు వివరించారు. అన్నీ సెట్ చేసుకున్నాక ఒకేసారి వారందరినీ పట్టుకున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కొంతమంది ఇటీవల సరెండర్ అయ్యారని.. వాళ్ల ద్వారా సమాచారం వెళితే ఇబ్బందులు ఉంటాయని మావోలు భావించారన్నారు. అందుకే కొన్ని రోజులు షెల్టర్ తీసుకునేందుకు ఏపీలో పలు ప్రాంతాలను ఎంచుకున్నారనట్లు చెప్పుకొచ్చారు. మళ్లీ సమయం చూసి వాళ్ల ప్రాంతాలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారని.. మావోల మూవ్‌మెంట్, ప్లాన్లపై ఇతర సమాచారం లేదన్నారు. హిడ్మాను పట్టుకున్నాక చంపామనే ప్రచారంలో నిజం లేదని అడిషనల్ డీజీ మహేష్ చంద్ర లడ్డా స్పష్టం చేశారు. మరోవైపు పట్టుబడ్డ 50 మంది మావోయిస్టులను కమాండ్ కంట్రోల్ రూమ్‌కు తరలించారు. భారీ భద్రత నడుమ మావోయిస్టులను ఏలూరు , కాకినాడ, కోనసీమ, కృష్ణ, ఎన్టీఆర్ జిల్లాల నుంచి కమాండ్ కంట్రోల్ రూమ్‌కు పోలీసులు తరలించారు. అలాగే ఆ పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసులను మోహరించారు. ఇప్పటికే 5 జిల్లాల ఎస్పీలు ,రేంజ్ ఐజీలు కమాండ్ రూమ్‌కు చేరుకున్నారు. మావోయిస్టుల నుంచి స్వాధీనం చేసుకున్న రైఫిల్స్, పిస్టల్స్, డిటోనేటర్లు,,మొబైల్స్, సిమ్ కార్డులు,పెన్ డ్రైవ్‌లు, విప్లవ సాహిత్యం, హిడ్మా ఫొటోలను స్వాధీనం చేసుకుని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు పోలీసులు తరలించారు. మరోవైపు మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాల కూంబింగ్ కొనసాగుతోంది. మృతదేహాలను రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మిగిలిన మావోయిస్టులు లొంగిపోవడం మంచిదన్నారు. జర్నలిస్టులకు హిడ్మా లేఖ రాయడం గురించి తెలియదు. హిడ్మా ఎదురుకాల్పుల్లోనే చనిపోయారు. ఆయన్ను పట్టుకున్నాక చంపారనే విషయంలో వాస్తవం లేదు. మావోయిస్టు రహిత ఆంధ్రప్రదేశ్ కోసం కృషి చేస్తున్నాం. మావోయిస్టుల ప్లాన్ ఏంటో, కానూరులో ఎందుకున్నారో దర్యాప్తు చేస్తున్నాం. త్వరలో చాలా మంది లొంగిపోతారు. అరెస్టుల వల్ల భయపడాల్సిన



ఏలూరులో అరెస్టు చేసిన మావోయిస్టులను జైలుకు తరలిస్తున్న పోలీసులు

అవసరం లేదు. ఛత్తీస్‌గఢ్‌లో చాలా చోట్ల దాడులు జరుగుతున్నాయి. దీంతో అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు మావోయిస్టులు వెళ్తున్నారు. ఈక్రమంలో వారు పట్టుబడుతున్నారని ఏడీజీ తెలిపారు.

**ఎదురుకాల్పుల్లోనే హిడ్మా మృతి**

జర్నలిస్టులకు హిడ్మా లేఖ రాయడం గురించి తెలియదు. హిడ్మా ఎదురుకాల్పుల్లోనే చనిపోయారు. ఆయన్ను పట్టుకున్నాక చంపారనే విషయంలో వాస్తవం లేదు. మావోయిస్టు రహిత ఆంధ్రప్రదేశ్ కోసం కృషి చేస్తున్నాం. మావోయిస్టుల ప్లాన్ ఏంటో, కానూరులో ఎందుకున్నారో దర్యాప్తు చేస్తున్నాం. త్వరలో చాలా మంది లొంగిపోతారు. అరెస్టుల వల్ల భయపడాల్సిన అవసరం లేదు. ఛత్తీస్‌గఢ్‌లో చాలా చోట్ల దాడులు జరుగుతున్నాయి. దీంతో అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు మావోయిస్టులు వెళ్తున్నారు. ఈక్రమంలో వారు పట్టుబడుతున్నారు" అని ఏడీజీ తెలిపారు.

**ఏలూరులో అరెస్టయిన మావోయిస్టులకు రిమాండ్**

ఏలూరులో అరెస్టు చేసిన 15 మంది మావోయిస్టులకు కోర్టు రిమాండ్ విధించింది. మొబైల్ కోర్టు న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఒక్కొక్కరిని విడివిడిగా విచారించారు. పేరు, వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీసులు బెదిరించారా.. అని నేరుగా మావోయిస్టులను న్యాయమూర్తి అడిగారు. నిందితులను రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించనున్నారు.

## రెండు ఎన్‌కౌంటర్లూ బూటకమే..

సహకరిస్తున్నారని, మిలిషియాగా పనిచేస్తున్నారని పోలీసులు వివిధ రూపాల్లో వేధిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయన్నారు. వేధింపులను, నిర్బంధాన్ని వెంటనే నిలిపివేయాలని సీపీఎం నేత శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.రాష్ట్రంలోని వివిధ జిల్లాలో పట్టుబడ్డ 50 మంది మావోయిస్టులను పోలీసులు కోర్టులో హాజరుపర్చగా వీరికి కోర్టు రిమాండ్ విధించింది. నిన్న అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావో అగ్రనేత హిడ్మా, ఐదుగురు మావోయిస్టులు మరణించారు. అలాగే బుధవారం కూడా అదే ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరుగగా... కీలక నేతలు హతమైన విషయం తెలిసిందే.



## ఓడిన చోటే గెలిచి చూపిద్దాం..

విషాదంలో ఉన్నా హరీష్ రావు పార్టీ కోసం అంకితభావంతో పనిచేశారని కొనియాడారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలని కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. డిసెంబర్ లోపు సర్పంచ్, జిల్లా పరిషత్ ఎన్నికలు పూర్తయ్యే అవకాశం ఉందని, ఆ వెంటనే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడతామని తెలిపారు. జూబ్లీహిల్స్ లోని 407 బూతుల్లో ఒక్కో బూత్ కు 10 మంది చొప్పున, మొత్తం 4 వేల మందితో పటిష్టమైన సైన్యాన్ని నిర్మించుకోవాలని సూచించారు. గతంలో నష్టపోయిన చోటే తిరిగి బలాన్ని పుంజుకోవాలని, "ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే వెతుక్కోవాలి" అనే సామెతను గుర్తు చేస్తూ కార్యకర్తల్లో ధైర్యాన్ని నింపారు. ప్రజల సమస్యలపై ఇప్పటి నుంచే పోరాటం మొదలుపెట్టాలని, రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్ స్టార్ట్ చేయాలని పిలుపునిచ్చారు.తెలంగాణ భవన్, పార్టీ కార్యాలయాలు కార్యకర్తలకు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని, ఏ కష్టం వచ్చినా పార్టీ నాయకత్వం అండగా ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

**ఉపఎన్నిక టెక్నికల్‌గా కాంగ్రెస్ గెలిచినా.. నైతిక విజయం బీఆర్ఎస్‌దే: హరీశ్ రావు**

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితాలపై బీఆర్ఎస్ నాయకులు అధైర్యపడాల్సిన అవసరం లేదని, పోరాటస్ఫూర్తితో పనిచేసిన కార్యకర్తలదే నైతిక విజయమని మాజీ మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కేవలం 18,000 ఓట్లు మాత్రమే వచ్చిన జూబ్లీహిల్స్‌లో, ఈ ఉపఎన్నికలో 75,000 ఓట్లు సాధించడం అనేది కార్యకర్తల కృషికి నిదర్శనమని పేర్కొన్నారు.ఈ ఎన్నికలో కాంగ్రెస్ ప్రభుత్వం సాంకేతికంగా గెలిచి ఉండవచ్చని, కానీ నైతిక విజయం మాత్రం బీఆర్ఎస్ అభ్యర్థి సునీతమ్మదేనని హరీశ్ రావు అన్నారు. మైనారిటీల మద్దతు కోల్పోతున్నామని గుర్తించిన కాంగ్రెస్, చివరి నిమిషంలో హడావుడిగా అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వడాన్ని గుర్తు చేశారు. ఇది బీఆర్ఎస్ పోరాట ఫలితమేనని వ్యాఖ్యానించారు. "అప్పుడప్పుడు అనైతిక విజయం, అధర్మం కూడా గెలుస్తూ ఉంటుంది. కానీ అంతిమ విజయం ధర్మానిదే" అని హరీశ్ రావు ధీమా వ్యక్తం చేశారు. దుబ్బాక, హుజూరాబాద్ ఎన్నికల్లోనూ తాత్కాలికంగా ఓటమి ఎదురైనా, ఆ తర్వాత జరిగిన పరిణామాలు గెలుపును అందించాయని గుర్తు చేశారు. త్వరలోనే కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తారని, తమను ఇబ్బంది పెట్టిన వారిని ఎవరినీ వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. కేటీఆర్,తలసాని శ్రీనన్న సహా తామంతా కార్యకర్తలకు కుటుంబ సభ్యులుగా అండగా ఉంటామని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. జీహెచ్ఎంసీ, ఇతర ఎన్నికల కోసం కలిసి పనిచేసి మళ్లీ కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేసుకుందామని పిలుపునిచ్చారు.రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ఉపఎన్నిక ఫలితాలపై అధైర్యపడొద్దని తలసాని శ్రీనివాస్ యాదవ్ వ్యాఖ్యానించారు. అధికార పార్టీ దుర్వినియోగం, పోలీసుల జోక్యం, విచ్చలవిడి డబ్బు పంపిణీ ఫలితాన్ని ప్రభావితం చేశాయన్నారు. కాంగ్రెస్ హయాంలో ఆర్థిక సంక్షోభం ఏర్పడిందని, మార్కెట్లో డబ్బు లేకపోవడంతో పండుగల సమయంలో కూడా వ్యాపారం జరగట్లేదని ఆయన విమర్శించారు.

# ప్రభుత్వ హాస్పిటళ్లలో వృద్ధులకు ప్రత్యేక వైద్య సేవలు

- జెరియాట్రిక్ సేవలు విస్తరించాలని సూచించిన మంత్రి దామోదర్
- డీఎంహెచ్‌వోలు, హాస్పిటళ్ల సూపరింటెండెంట్లతో సమీక్ష
- అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వృద్ధుల వివరాలతో జాబితాలు సిద్ధం చేసుకోవాలని డీఎంహెచ్‌వోలకు సూచన



హైదరాబాద్ (జనంసాక్షి) : దేశంలో.. రాష్ట్రంలో పెరుగుతున్న వృద్ధుల జనాభాకు అనుగుణంగా వారికి అవసరమైన వైద్య సేవలను కూడా విస్తరిస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. అన్ని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్స్‌లో జెరియాట్రిక్ సేవలు అందించాలని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు మంత్రి సూచించారు. ఈ మేరకు జనరల్ హాస్పిటళ్ల సూపరింటెండెంట్లు, అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలు, ప్రోగ్రామ్ ఆఫీసర్లతో మంత్రి బుధవారం సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఇనిస్టిట్యూట్‌లో జరిగిన ఈ సమీక్షలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, డీహెచ్ రవిందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ మాట్లాడుతూ.. జీవన ప్రమాణాలు పెరిగాయని, దీంతో వృద్ధుల సంఖ్య కూడా పెరుగుతున్నదన్నారు. పిల్లల కోసం మనం ప్రత్యేకంగా చైల్డ్ హెల్త్ కేర్ సెంటర్లు నిర్వహిస్తున్నట్లుగానే, జపాన్, ఇటలీ తరహాలో వృద్ధుల కోసం ప్రత్యేక హాస్పిటళ్లు నిర్వహించాల్సిన అవసరం భవిష్యత్తులో మన దేశంలోనూ ఏర్పడుతుందన్నారు. వృద్ధాప్యంలో వచ్చే మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకుని అన్ని హాస్పిటళ్లలోనూ జెరియాట్రిక్ సేవలను విస్తరించాలని మంత్రి సూచించారు. ప్రతి జీజీహెచ్, డిస్ట్రిక్ట్ హాస్పిటల్‌లో ఇప్పటికే జెరియాట్రిక్ వార్డులు ఏర్పాటు చేశామన్న విషయాన్ని ప్రజలకు తెలిసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వృద్ధుల జాబితాలు సిద్ధం చేసుకుని, వారికి ప్రభుత్వ హాస్పిటళ్లలో ఉచిత వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత డీఎంహెచ్‌వోలదేనని మంత్రి ఆదేశించారు.

**డీఎంహెచ్‌వోలు, సూపరింటెండెంట్ల అటెండెన్స్‌ను మేము మానిటర్ చేస్తున్నాం**

గత ప్రభుత్వం తరహాలో హాస్పిటల్, మెడికల్ కాలేజీ పేరిట అరకొర బిల్డింగులు కట్టి వదిలేయడం లేదు. ప్రతి హాస్పిటల్‌లోనూ అవసరమైనమేర డాక్టర్లను, నర్సులను, ఇతర సిబ్బందిని నియమిస్తున్నాం. ఈ రెండేళ్లలో 9 వేలకుపైగా పోస్టులను భర్తీ చేశాం.. మరో 7 వేలకుపైగా పోస్టులు భర్తీ అవుతున్నాయి. మ్యాన్ పవర్‌తో పాటు మీరు అడిగిన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఇక మీ దగ్గరకు వచ్చే పేషెంట్లకు సర్వీస్ చేయడం మీ చేతుల్లోని ఉంది. ప్రభుత్వ హాస్పిటళ్లు మీవి మీరు వాటిని ఓన్ చేసుకుని కాపాడుకోవాలి.. అక్కడికి వచ్చే పేషెంట్లకు మంచి సర్వీస్ అందించి రక్షించుకోవాలి. డీఎంహెచ్‌వోలు, హాస్పిటల్ సూపరింటెండెంట్ల అటెండెన్స్‌ను మేము మానిటర్ చేస్తున్నాం. మీ సిబ్బంది అటెండెన్స్‌ను మీరు మానిటర్ చేస్తున్నారో లేదో కూడా చేస్తున్నాం. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు. ఎంతటివారిపైన అయినా కఠిన చర్యలు తీసుకుంటాం. అదే సమయంలో మంచిగా పని చేసే వారికి అండగా నిలుస్తాం. హాస్పిటళ్లలో పాతుకుపోయి, పని చేయించే ఆఫీసర్లపై తప్పుడు ఆరోపణలు చేస్తూ, వార్తలు రాయించడం వంటి చర్యలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరిద్దాం. వారి వివరాలను మీ హెచ్‌ోడీలకు అందించండి. మీరు చేసిన పర్యటనలు, తనిఖీలు, ఫైండింగ్స్, యాక్షన్ టేకెన్ రిపోర్టులను ప్రతి నెలా అందించాలి. ప్రభుత్వ హాస్పిటల్స్ నుంచి పేషెంట్లను బయటకు రిఫర్ చేయొద్దని మంత్రి అన్నారు. సబ్ సెంటర్ నుంచి జీజీహెచ్ల వరకూ అన్ని హాస్పిటళ్ల నడుమ సమన్వయం ఉండాలని ఆయన సూచించారు. ప్రభుత్వ హాస్పిటల్‌కు వచ్చిన పేషెంట్‌ను అవసరమైనప్పుడు మరో ప్రభుత్వ హాస్పిటల్‌కు మాత్రమే రిఫర్ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లోనే అవసరమైన అన్నిరకాల వైద్య సేవలు అందించాలన్నారు.

## వచ్చే దసరా నాటికి ఉప్పల్ కారిడార్

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్, నవంబర్ 19 (జనంసాక్షి) : ఉప్పల్ – నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనులు 2026 దసరా నాటికి కచ్చితంగా పూర్తిచేస్తామని రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. అందుకు అనుగుణంగా ఆర్అండ్‌బీ, నిర్మాణ సంస్థను మంత్రి ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న గతుకుల రోడ్డు మార్గంలో వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఇటీవల అధికారులతో సమీక్ష నిర్వహించి మంత్రి.. వెంటనే బీటీ రోడ్డు పనులు చేపట్టాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు ఉప్పల్ – వరంగల్ మార్గంలో అధికారులు ఇప్పటికే బీటీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఉప్పల్ – వరంగల్ మార్గంలో ప్రయాణించే వారికి, మేడారం వెళ్లే భక్తులకు ఇబ్బందులు లేకుండా రోడ్డు నిర్మాణం చేస్తున్నామన్నారు. మొత్తం 5.5 కి.మీ గాను 1.5కి.మీ రోడ్డు నిర్మాణం పూర్తయిందన్నారు. మేడారం జాతర ప్రారంభమయ్యే నాటికి బీటీ రోడ్డు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు. ఇచ్చిన మాట ప్రకారం, రాజకీయాలకు అతీతంగా 2026 దసరా నాటికి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉప్పల్ – నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ ప్రారంభిస్తామని పునరుద్ఘాటించారు.

# బూటకపు ఎన్‌కౌంటర్లను ఆపాలి


- అరెస్టు చేసిన మావోయిస్టులను కోర్టుల్లో హాజరుపర్చాలి
- ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరపాలి
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్

హైదరాబాద్ (జనంసాక్షి) : బూటకపు ఎన్‌కౌంటర్లను ఆపాలని, అరెస్టు చేసిన మావో యిస్టులను కోర్టుల్లో హాజరుపర్చాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుపల్లి ఏజెన్సీలో మావోయిస్టు అగ్రనాయకులు హిడ్మాతో, పాటు ఆయన భార్య, అలాగే ఆర్గురు ఎన్‌కౌంటర్‌లో చనిపోయినట్టు పోలీసులు ప్రకటించారని, బుధవారం అదే ప్రాంతంలో మరో ఎన్‌కౌంటర్ జరిగిందని, ఏడుగురు మావోయిస్టు నాయకులు చనిపోయారని, అందులో అగ్ర నాయకులు దేవ్‌జీ, ఆజాద్ కూడా ఉన్నారనేటటువంటి వార్తలొ స్తున్నాయని తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్లన్నీ మావో యిస్టులను అరెస్ట్ చేసి, నిర్బంధించి, బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడుతు న్నారనే అనుమానాలు వ్యక్తమవుతు న్నాయని ఈ బూటకపు ఎన్‌కౌంటర్లను సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తూ, ఈ ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులు కాల్పులు విరమించి చర్చలు జరపడానికి సిద్ధంగా ఉన్నామనే విషయాన్ని పలుమార్లు ప్రకటించినప్పటికీ, వాళ్ళతో చర్చలు జరపకుండా మావోయిస్టులను ఏరివేసే కార్యక్ర మానికి కేంద్ర బీజేపీ ప్రభుత్వం పూనుకుం టున్నదని, సానుభూతిపరులను, అమాయక గిరిజను లను కూడా అరెస్టులు చేసి వేధింపులకు, చిత్రహిం సలకు గురి చేస్తున్న ఘటనలు కూడా జరుగుతు న్నాయని అదే విధంగా విజయవాడ, తదితర ప్రాంతాల్లో 50 మందికి పైగా మావో యిస్టులను అరెస్టు చేసారని, ఇంకా కొంతమందిని నిర్బంధం చారనే వార్తలు వస్తున్నాయని, అరెస్టు చేసినవాళ్ళం దరినీ కూడా వెంటనే కోర్టు ముందు హాజరు పరచాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరిపి ఈ సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు.

# లిఫ్ట్‌లో ఇరుక్కుని బాలుడు మృతి



హైదరాబాద్, నవంబర్ 19 (జనంసాక్షి) : నగరంలోని ఎల్లారెడ్డిగూడలో విషాద ఘటన చోటుచేసుకుంది. కీర్తి అపార్ట్‌మెంట్స్‌లో లిఫ్ట్‌లో ఇరుక్కొని బాలుడు మృతి చెందాడు. అపార్ట్‌మెంట్ అయిదో అంతస్తులో నివాసం ఉండే నరుసు నాయుడు చిన్న కుమారుడు హర్షవర్ధన్ (5) మధురానగర్‌లోని శ్రీనిధి పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం పాఠశాల నుంచి తల్లి, సోదరుడితో పాటు ఇంటికి వచ్చిన బాలుడు లిఫ్ట్‌లో అయిదో అంతస్తులోకి వెళ్లాడు. తిరిగి కిందికి దిగుతున్న క్రమంలో 4, 5 అంతస్తుల మధ్య లిఫ్ట్‌లో ఇరుక్కుపోయాడు. వెంటనే బాలుడిని బయటకు తీయగా.. అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. బంజారాహిల్స్‌లోని ఆసుపత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బాలుడి మృతితో అపార్ట్‌మెంట్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి



## సచిన్ సావంత్‌ను సన్మానించిన ఉప్పల

హైదరాబాద్ (జనంసాక్షి) : గాంధీ భవన్ లో ఇటీవల నియమితులైన ఏఐసిసి కార్యదర్శి, సచిన్ సావంత్ (తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాలు)కు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త మర్యాద పూర్వకంగా కలిసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు. పార్టీ కోసం కష్టపడే వారికి రానున్న ఎన్నికల్లో అందరికీ న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

## టాప్రా ఆధ్వర్యంలో హైదరాబాద్ డిప్యూటీ కలెక్టర్‌కు మెమోరాండం




హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ స్టేట్ లో మార్చి 2024 నుండి రిటైర్డ్ ఉద్యోగులకు రావలసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఏ ఒక్కటీ అందక నరకయాతన అనుభవిస్తున్నారని ఎంతో మంది నిరాశ నిస్పృహ లతో ప్రాణాలు కోల్పోతున్నా అందుకు బాధ్యులయిన రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా తెలంగాణా ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టాప్రా) హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో హైదరాబాద్ కలెక్టరేట్ లో హైదరాబాద్ డిప్యూటీ కలెక్టర్ వెంకటాచారికి మెమోరాండం సమర్పించారు. 5 డీఏలు విడుదల చేసి పీఆర్సీ ప్రకటించాలని కోరారు. విన్నపాన్ని ప్రభుత్వం దృషికి తీసుకు వెళతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లోటాప్రా రాష్ట్ర ఉపాధ్యక్షులు నరహరి, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ బి.స్వరాజ్ కుమార్, రాజన్ బాబు, రాష్ట్ర ఆడిట్ కమిటీ మెంబర్ ఎస్వీ రామకృష్ణ, హైదరాబాద్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శివలింగం, ఎన్.రమేష్, భార్గవచారి, ఏంఎ సమద్, అంజాద్ ఖాన్, శ్రీధర్, నర్సింహా రెడ్డి, వెంకటేశ్వర్లు, పద్మజ, కృష్ణకుమారి, మోతుకూరి విజయలక్ష్మి, ముజఫర్ అహమ్మద్, ఫసియుద్దన్, హుస్సేన్, జగదీష్ రెడ్డి, సత్యనారాయణతోపాటు మొత్తం 32 మంది పాల్గొని జయప్రదం చేశారు.

## హిడ్మాను చంపి..ఎన్‌కౌంటర్ అంటారా?

**మావోయిస్టులపై దాడులను వెంటనే ఆపాలి**

**సిపిఐ నేత కూనంనేని డిమాండ్**

హైదరాబాద్, నవంబర్ 19 (జనంసాక్షి) : మావోయిస్టు అగ్ర నేత హిడ్మాను చంపి.. దాన్ని ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరిస్తున్నారని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు. మావోయిస్టులపై జరుగుతున్న ఎన్‌కౌంటర్లను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ.. మావోయిస్టుల ఎన్‌కౌంటర్ల అంశంపై చర్చించేందుకు గురువారం నాడు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హిడ్మా కోరితే ఆశ్రయం ఇచ్చే వాళ్లమని అన్నారు. అతన్ని తానే డీజీపీకి సరెండర్ చేయించేవాడిని అని పేర్కొన్నారు. హిడ్మాను చంపి ఎన్‌కౌంటర్ అని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరిపి సమస్యలు తెలుసుకోవాలని కూనంనేని సూచించారు. ఇలా చంపడం సరికాదని.. అరెస్టు చేసి చట్టం ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. కేంద్రానికి చిత్తశుద్ధి ఉంటే విచారణకు ఆదేశించాలని అన్నారు. దేవ్‌జీ కూడా పోలీసుల చెరలో ఉన్నట్లు తెలుస్తోందని.. అసలు పోలీసుల చెరలో ఎంతమంది ఉన్నారో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. 2026 మార్చి నాటికి మావోయిజం లేకుండా చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇదేమైనా యుద్ధమా అని ఆయన ప్రశ్నించారు. దండకారణ్యంలో విలువైన ఖనిజ సంపద కోసమే ప్రభుత్వం మావోయిస్టులను హతమారుస్తుందని ఆరోపించారు. ఏకపక్ష కాల్పులను కూడా బండి సంజయ్ ఎన్‌కౌంటర్‌గా చెప్పడం దారుణమని మండిపడ్డారు. హింసను వీడి, శాంతియుత పరిష్కారాల దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలని సూచించారు.

# నడి సంద్రంలో సందిగ్ధత..

**భారత్‌కు వస్తున్న చమురు నౌకలకు 'డెడ్‌లైన్' టెన్షన్!**

న్యూఢిల్లీ (జనంసాక్షి) : రష్యా నుంచి భారత్‌కు ముడిచమురు తీసుకువస్తున్న నౌకలకు కష్టకాలం మొదల్కెంది. అమెరికా విధించిన ఆంక్షలు శుక్రవారం నుంచి అమల్లోకి రానున్నాయి. దీంతో సముద్రంలో ప్రయాణిస్తున్న ట్యాంకర్ల పరిస్థితి ఇప్పుడు అయోమయంగా మారింది. ఆ గడువులోగా తీరం చేరకపోతే ఆ నౌకల్లోని కోట్లాది బ్యారెళ్ల చమురు ఎటూ వెళ్లలేని స్థితిలో పడే ప్రమాదం కనిపిస్తోంది. అందుకే వాటిని వేగంగా తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ.. అది ఎంత వరకు సాధ్యమవుతుంది అనేది చూడాల్సి ఉంది.

**గడువు ముంచుకొస్తోంది**

రష్యాకు చెందిన బ్లాక్‌లిస్టెడ్ సంస్థలు రాస్‌నెఫ్ట్, లుకాయిల్ నుంచి బయలుదేరిన నౌకలు భారత్ వైపు వస్తున్నాయి. కెప్లర్ డేటా ప్రకారం వీటిలో సుమారు 77 లక్షల బ్యారెళ్ల ముడి చమురు ఉంది. అమెరికా ఆంక్షలు నవంబర్ 21 నుంచి అమల్లోకి వస్తాయి. సరిగ్గా ఆ తేదీ తర్వాతే ఇవి భారత తీరానికి చేరుకునే అవకాశం ఉంది. దీంతో ఆ చమురును మన రేవుల్లో దించుతారా లేదా అన్న సందేహాలు మొదలయ్యాయి. గడువు సమీపిస్తుండటంతో ఆయిల్ వ్యాపారుల్లో ఆందోళన పెరిగింది.

**రిలయన్స్, నయారా వైపే**

సముద్రంలో ఉన్న ట్యాంకర్లలో ఎక్కువ భాగం రిలయన్స్ ఇండస్ట్రీస్ జామ్‌నగర్ రిఫైనరీకి లేదా నయారా ఎనర్జీకి చెందిన వాడినార్ పోర్టుకు వెళ్తున్నాయి. ఈ నౌకలు నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్ మొదట్లో ఇక్కడకు చేరే ఛాన్స్ ఉంది. ప్రయాణంలో ఉన్నప్పుడు ఓడలు తమ గమ్యస్థానాలను మార్చుకునే వెసులుబాటు ఉంటుంది. ఆంక్షలున్న రష్యా ఆయిల్‌ను భారత్ ఎలా తీసుకుంటుందనే విషయంపై వ్యాపారులు నిఘా పెట్టారు. దీన్ని బట్టే ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారిస్తారు.

**అమెరికా పట్టు**

ఉక్రెయిన్ యుద్ధానికి రష్యా నిధులు అందకూడదన్న ఉద్దేశంతో వాషింగ్టన్ పట్టుబట్టింది. దిల్లీ కూడా ఈ విషయంలో అమెరికా నుంచి ఒత్తిడి ఎదుర్కొంటోంది. రష్యా నుంచి చమురు కొనడం మానేస్తామని భారత్‌లోని ఐదు సంస్థలు ఇదివరకే ప్రకటించాయి. ఇందులో రిలయన్స్ కూడా ఉంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ మాత్రం ఆంక్షలు లేని రకాలను కొంటోంది. పూర్తిగా రష్యా సరఫరాలపై ఆధారపడ్డ నయారా సంస్థ మాత్రం ఇంకా కొనుగోలును కొనసాగిస్తోంది.

**మినహాయింపులు ఉన్నాయా?**

గడువు ముగిసిన తర్వాత కూడా చమురు కొనేందుకు భారత కంపెనీలు అమెరికాను ఏమైనా మినహాయింపులు అడిగాయా అన్నది స్పష్టత లేదు. ఇటీవల హంగేరీ దేశానికి రష్యా ఆయిల్ కొనుగోలు విషయంలో అమెరికా వెసులుబాటు కల్పించింది. లుకాయిల్ లావాదేవీలకు సంబంధించి కొన్ని సడలింపులు ఇచ్చింది. శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చే ఆంక్షల పరిధిలోకి రష్యాకు చెందిన నాలుగు టాప్ కంపెనీలు వస్తాయి. భారత్‌కు వచ్చే ఎగుమతుల్లో 80 శాతం వాటా వీటిదే కావడం గమనార్హం.

# రైల్వే యూనిట్ పనుల్లో జాప్యం లేకుండా చూడాలి

- మార్చి నెలలో మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ లో పనులు ప్రారంభం
- ఏడాదికి 600 కోచ్ లు ఇక్కడ తయారవుతాయి
- వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య



వరంగల్ బ్యూరో, నవంబర్ 19 (జనం సాక్షి) : కాజీపేటలోని రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను స్థానిక శాసనసభ్యులు కేఆర్ నాగరాజు తో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సందర్శించారు. రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌లో జరుగుతున్న పనుల పురోగతి, మౌలిక వసతుల అభివృద్ధి, విభాగాల వారీగా జరుగుతున్న నిర్మాణ కార్యకలాపాలపై రైల్వే అధికారులతో ఎంపీ డాక్టర్ కడియం కావ్య సమీక్షించ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ, కాజిపేట కోచ్ ఫ్యాక్టరీ 30 ఏళ్ల కల నెరవేరబోతుందని అన్నారు. కాంగ్రెస్ పాలనలోనే ఇది సాధ్యమైందని, ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇది నిదర్శనం అన్నారు. భూములు కోల్పోయిన వారికి అన్యాయం జరగకుండా చూస్తామని అన్నారు. భూ బాధితులతో పాటు స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. గతంలో ఇదే అంశంపై కేంద్ర రైల్వే శాఖ మంత్రిని కలిసి కోరనని వెల్లడించారు. రైల్వే యూనిట్ లో స్థానికుల ఉద్యోగాలు కల్పించే అంశంపై పార్లమెంట్ లో సైతం తన గళం వినిపిస్తానని స్పష్టం చేశారు. ప్రస్తుతం మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ మార్చి నెలలో ప్రారంభమవుతుందని అన్నారు. ప్రతి ఏడాది 600 ల కోచ్ లను ఇక్కడ సిద్ధం చేస్తారని పేర్కొన్నారు. ఏక్కడ పనులు జాప్యం జరగకుండా చూడాలని అధికారులకు ఎంపీ సూచించారు. అనంతరం రైల్వే అధికారులు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ నమూనా వివరాలను ఎంపీకి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఎంఈఆనంద్, జి జి ఎ మురళీకృష్ణ, డీజీఎం శర్మ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లొంగుబాటుకు ఎన్నో అవకాశాలు ఇచ్చాం

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



కరీంనగర్, నవంబర్ 19 (జనంసాక్షి) : నక్సలైట్లు అడవుల్లో చనిపోతుంటే.. అర్బన్ నక్సల్స్ పదవులు అనుభవిస్తున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ మరోమారు తీవ్రంగా వ్యాఖ్యానించారు. అమాయక నక్సలైట్లను రెచ్చగొట్టి వాళ్ల చావులకు కారకులయ్యారని విమర్శించారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడారు. నక్సల్స్ లొంగిపోవాలని పదేపదే కేంద్రం హెచ్చరిస్తూ వచ్చిందన్నారు. వారు జనజీవన స్రవంతిలో కలిస్తే మంచి భవిష్యత్ ఉండేదన్నారు. కానీ కొందరు పెడచెవిన పెట్టారని అన్నారు. నక్సలైట్లు చనిపోతే వాళ్ల తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల గుండెకోత మీకేం తెలుసు? నక్సలైట్ల తుపాకీని సమర్థించిన వారు కూడా నేరస్థులేనని అన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాది మాటంటే మాటే. మార్చిలోపు మావోయిజాన్ని పూర్తిగా అంతమొందిస్తాంఅని బండి సంజయ్ అన్నారు. ఆ మేరకు నక్సలిజం అంతం అవుతుందన్నారు. వారికి ప్రజల మద్దతు లేదన్నారు.

## 22న మరో అల్పపీడనం

అమరావతి, నవంబర్ 19 (జనంసాక్షి) : నైరుతి బంగాళాఖాతం, పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తు వరకూ విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నెల 22న ఆగేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, అనంతరం అది పశ్చిమ–వాయువ్య దిశగా కదులుతూ తదుపరి 48 గంటల్లో మరింత బలపడే అవకాశముందని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. అదే విధంగా కొమోరిన్ పరిసర ప్రాంతాలపై మంగళవారం ఏర్పడిన అల్పపీడనం బుధవారం ఉదయానికి లక్షద్వీప్ దీవులకు సరిహద్దు, మాల్దీవుల ప్రాంతాలకు విస్తరించిందని తెలిపింది. దీని అనుబంధ ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించిందని పేర్కొంది. ఇది రానున్న 24 గంటల్లో పశ్చిమ–వాయువ్య దిశగా నెమ్మదిగా కదులుతుందని వెల్లడించింది. వీటి ప్రభావంతో గురువారం ఉత్తర కోస్తా, యానాంలో పొడి వాతావరణం, దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌లో ఒకట్రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు.

# అందరి బంధువయ్య ఐఐటి రామయ్య



మానవ జీవన ప్రస్థానంలో ఏర్పడే అనుబంధాలు కొన్ని అవసరం కాగా, మరికొన్ని ఆశయ సాధన కోసం. అలా మా గురువర్యులు శ్రీ మోతుకూరి నరహరి ద్వారా ఏర్పడిన ప్రముఖ విద్యావేత్త డాక్టర్ చుక్క రామయ్య గారితో నాకు కలిగిన అనుబంధం రెండవకోవకు చెందినది. సుమారు 40 ఏళ్లుగా పూజ్యులు రామయ్య గారితో నాకు అవినాభావ సంబంధం, ముఖ్యంగా వారి చిన్నబ్బాయి అచ్యుత్ కు నేను తెలుగు బోధించడం వల్ల మా మధ్య ఆ అనుబంధం ధృఢతరమైంది. ఆ కారణంగానే వారింట్లో గాని వారి పరిచయస్తు లలో గాని నా అసలు పేరు మరుగుపడి తెలుగు సార్ అన్న పేరే స్థిరపడింది. ఇప్పటికీ ఆ పిలుపు ఒక ఆత్మీయ స్పర్శను తలపింప చేస్తుంది. పూజ్యులు రామయ్య చైతన్యానికి చిరునామా అయిన జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని గూడూరు గ్రామ వాస్తవ్యులు. క్రీస్తుశకం 1124 లో విరియాల మల్లడు వేయించిన పద్య శాసనం ఈ గ్రామంలోనే ఉంది. రాజాస్థానాలను తోసి రాజని ప్రజాస్థానాలలో నిలిచిన మహాకవి పాల్కురికి సోమనాథుడు, బమ్మెర పోతనలు ఈ ప్రాంత వాసులు. అలాగే విసునూరు దేశ్ ముఖ్ గా పేరొందిన రాపాక రామచంద్రారెడ్డి పై అతడి ఆగడాలపై అలుపెరుగని పోరాటం చేసిన వీరవనిత ఐలమ్మ కార్యక్షేత్రం కూడా ఇక్కడి పాలకుర్తె కావడం విశేషం. బహుశా ఈ పరిసరాల ప్రభావమే చైతన్య శీలియైన రామయ్యకు సహజ ఇంధనాన్ని అందించాయి. రోమ్ నగరం కాలిపోతుంటే ఫిడేలు వాయించడం ఇష్టం లేని రామయ్య, సమరమే అమరమని భావించి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని 1946-1948 మధ్యకాలంలో జైలు జీవితాన్ని అనుభవించిన దేశభక్తుడు, త్యాగధనుడు. ఈ నేపథ్యంలో అనుకోని పరిస్థితులలో ఆనాటి ఉద్యమ నాయకుల ప్రబోధం మేరకు 1950లో ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించిన రామయ్య, నేటికి నాటౌట్ బ్యాట్స్మెన్ గా నిలిచారు. అది ఆయన నిబద్ధతకు నిమగ్నతకు నిదర్శనం. సమాజంలోని అన్ని వర్గాల నుంచి ఆయనకు పరిచయాలు ఉన్నాయి. రామయ్య గారు గణితశాస్త్ర పారంగతులే కాకుండా గొప్ప మానవతావాదులు. మేధస్పందన శాస్త్రమైతే హృదయ స్పందన సాహిత్యమని వారి అభిప్రాయం. కాబట్టి ఏ మనిషికయితే సంగీత సాహిత్యాల పట్ల ఆసక్తి ఉండదో అతనికి మానవత్వం ఉండదని వారి అభిప్రాయం. కాబట్టే అప్పుడప్పుడు వారు లెక్కలు చేస్తూ అలసిపోయినప్పుడల్లా నాతో దాశరథి, జాషువాల పద్యాలను పాడి వినిపించమనేవారు, నేను నాదైనా బాణీలో వారికి వినిపించే వాడిని. రెండవది సాహిత్యం సమాజానికి అతీతమైనది కాదని, రచయితలైన ఉపాధ్యాయులకు సమాజం పట్ల మరింత బాధ్యత అవసరమని ప్రబోధించేవారు. ఇలా నా ఉద్యోగ, సాహిత్య వ్యక్తిత్వాలను ప్రభావితం చేసిన జ్ఞాన భాస్కరుడు రామయ్య. వారి వెంట వందలాది ఊళ్లు, స్కూళ్లు చూశాను. ఎన్నో అనుభవాలు, అనుభూతులు ఎదురయ్యాయి. రామయ్య గారి ప్రసంగాలు సరళంగా, స్పష్టంగా, శాస్త్రీయంగా ఉండేవి. ఎంతో గొప్ప విశ్లేషణ కనిపించేది. దానికి కారణం ఆయన నిరంతర అధ్యయనం, అధ్యాపనం, పరిశీలన, అనుభవం అన్నింటికీ మించి ఆయన దార్శనికత చాలా గొప్పది. వస్తువును కాదు వస్తు తత్వాన్ని విశ్లేషించేవారు. అది ఆయన నిష్ఠ. ఇలా వారితో ఉన్నప్పుడు ఎన్నో అంశాలను నేర్చుకునే అవకాశం కలిగింది. ఆ ఆత్మీయతే నన్ను వారి కుటుంబంలో ఒక సభ్యునిగా చేర్చిందంటే అత్యుక్తి కాదు. ఉపాధ్యాయ వృత్తిలో చేరిన నేను రామయ్య గారితో అనేకసార్లు బాసరకు వెళ్లాను. ఒకసారి ఆ గుళ్లోనే కూర్చుని

"చదువు సంధ్యలొసగి చల్లగా బ్రో చెడు జ్ఞాన లక్ష్మివమ్మ జలజవమ్మ
బాసరందునున్న భారతి వోయమ్మ
శ్యాము వాక్కు నమ్ము సత్య వాక్కు"అంటూ శతక రచనకు శ్రీకారం చుట్టాను.

అలా రాసిన ఆ శతకాన్ని సత్యవాణి పేరుతో 23-6-1997న పాలకుర్తి సభలో మహాకవులు ఉత్పల సత్యనారాయణా చార్యులు గారు ఆవిష్కరించగా, మార్గదర్శకులైన రామయ్య గారికి దానిని అంకితం ఇచ్చాను. అలాగే నేను రాసిన సోమన-పోతన అనే లఘు వ్యాస సంపుటిని తేదీ 23-6-2003న రామయ్య గారు ఆవిష్కరించారు. ఈ సభలో అప్పటి జిల్లా కలెక్టర్ తో పాటు పాలకుర్తి ప్రముఖులు ఎందరో పాల్గొన్నారు. వివిధ కార్యక్రమాలకు హాజరయ్యేందుకు రామయ్య గారు వచ్చి వెళ్తుండడంతో పాలకుర్తి మండలంలోని ఉన్నత పాఠశాలల పదో తరగతి పరీక్షల ఫలితాలను గురించి విశ్లేషించారు. పాలకుర్తి ప్రాంత చరిత్రలో ఏ విద్యా సంవత్సరంలో కూడా 500 మార్కులు దాటిన విద్యార్థులు లేకపోవడం ఆశ్చర్యం కలిగించింది. దానితో పిల్లల్ని విద్యాపరంగా ప్రేరేపించి ప్రోత్సహించాలని తేదీ 21-5-2000న పాలకుర్తిలో జరిగిన ఒక సభలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి పదో తరగతిలో 500 మార్కులు దాటిన విద్యార్థులకు "రామయ్య గోల్డ్ మెడల్" ను ప్రదానం చేస్తానని ప్రకటించాడు. దాంతో అప్పటినుండి విద్యార్థులలో పట్టుదల పెరిగి 564 మార్కులు సాధించారు. అలా ఏటా ఆ పురస్కార ప్రదానోత్సవం పాలకుర్తిలో ఒక విద్యాపర్వంగా కొనసాగింది. ఆ కార్యక్రమంలో కార్యకర్తగా పనిచేసే అవకాశం దక్కింది.

ఇటీవల గ్రేడింగ్ విధానం వచ్చిన తర్వాత ఆ పురస్కార ప్రదానోత్సవాన్ని మానేశాము.

ఐఐటి శిక్షణ ద్వారా జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన రామయ్య, బాసరలో ఐఐటిని స్థాపించాలని త్రికరణ శుద్ధితో కృషి చేశారు. దీనికి సంబంధించి అధికార ప్రతిపక్షం అనే తేడా లేకుండా యావత్ శాసనసభ రెండుసార్లు ఈ విషయమై ఏకగ్రీవ తీర్మానం చేసింది. కాలక్రమంగా స్థలం మారినా రాష్ట్రానికి ఐఐటి వచ్చిందంటే దానికి పూర్వ రంగంలో రామయ్యగారు చేసిన అవిరళ కృషి కారణం. గ్రామీణ విద్యార్థులలో ఐఐటి చదువుల పట్ల అవగాహన, చైతన్యం కలిగించడానికి వివిధ పత్రికలలో కాలమ్స్ రాశారు. ఆ వ్యాసాలతో సుమారు 50కి పైగా పుస్తక రూపంలో వచ్చాయి. విద్యారంగాన్ని కేంద్రంగా తీసుకొని ఇన్ని పుస్తకాలు రాసిన వారు రాష్ట్రంలో అరుదు. ఈ విషయాలన్నీ దృష్టిలో పెట్టుకొని ప్రముఖ పాత్రికేయులు పొత్తూరు వెంకటేశ్వరరావు గారు రాస్తూ విద్యారంగంలో కృషిచేసి జాతీయ స్థాయిలో కీర్తి గడించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ గారిని ప్రజలు తత్వవేత్త అన్నారు గానీ, విద్యావేత్త రాధాకృష్ణన్ అనలేదు. వైస్ ఛాన్సలర్ గా పనిచేసిన కట్టమంచి రామలింగారెడ్డి గారిని పండితుడు, విమర్శకుడు అన్నారు కానీ విద్యావేత్త కట్టమంచి అనలేదు. ప్రజలు ఒక్క రామయ్య గారిని మాత్రమే ఐఐటి రామయ్య అంటూ, ఆ పేరును స్థిరపరిచి ఆయన పట్ల తమ ప్రేమను, అభిమానాన్ని, గౌరవాన్ని చాటుకున్నారు అని వ్యాఖ్యానించారు.

తెలంగాణ సామాజిక ఆర్థిక రాజకీయ విద్యారంగాలకు సంబంధించి తను చేస్తున్న వాదనలకు రాస్తున్న రాతలకు చట్టబద్ధత కలగాలంటే ఆ సభల్లో ప్రవేశించి దానికొక నిర్మాణాత్మక రూపం ఇవ్వాలనే ఉద్దేశంతో ఆయన 2007లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్సీగా గెలుపొందారు. సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే ఢిల్లీకి వెళ్లి అప్పటి ప్రధాని, రాష్ట్రపతిని కలిసి సమస్యలను వివరించారు. మండలిలో విద్యారంగ సమస్యలతో పాటు అనేక ప్రజా సమస్యల్ని ప్రస్తావించారు. ఇలా ఆదర్శ ఉపాధ్యాయునిగా, నాయకులుగా, ప్రజాప్రతినిధులుగా చిత్తశుద్ధితో తమ బాధ్యతలను నిర్వహించారు. త్రికరణ శుద్ధి కలిగిన విద్యావేత్త చుక్క రామయ్య గారి జీవితం నేటి తరానికి ఆదర్శమైనది. భగవంతుడు వారికి ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.



డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్
99 891 48 305

# పాలిగంజ్‌పై తీన్ తార సందీప్ సౌరవ్



జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థి రాజకీయాల్లో ఉద్భవించిన నాయకుడు మాజీ ప్రధాన కార్యదర్శి, ఎంఎల్ పార్టీ యువ నేత సందీప్ సౌరవ్ ఇటీవల జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విజేతగా నిలిచాడు. ఎన్డీఏ - మహాగఠ్ బంధన్ మధ్య జరిగిన ఉత్కంఠ పోరులో పాలి గంజ్ నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా రికార్డు సృష్టించి జాతీయ దృష్టిని ఆకర్షి ంచాడు. మాజీ జేఎన్యూ లీడర్ మళ్లీ చర్చలోకొచ్చాడు. తీన్ తార నేతగా గుర్తింపు ప్రత్యేకం. మూడు నక్షత్రాల జెండా సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ఎన్నికల గుర్తు. 2024లో ఎంపీగా సైతం పోటీ చేసి రెండో స్థానంలో నిలిచాడు. అతి తక్కువ కాలంలోనే సీపీఐ (ఎంఎల్) కేంద్ర కమిటీ సభ్యునిగా ఎదిగాడు. అణగారిన జనులలో ప్రజాభిమానాన్ని చురగొన్న తీరు అద్భుతం.

### తల్లి స్ఫూర్తితో తనయుడు...

పాట్నా జిల్లా మానేరు మొలానిపూర్ కు చెందిన సందీప్ రైతు కుటుంబంలో 1987లో జన్మించాడు. తండ్రి సునీల్ కుమార్ 2004లో మరణించారు. అప్పటికీ సందీప్ 17 ఏళ్ళే. నలుగురు సంతానంలో చిన్నవాడు. తల్లి విమలాదేవి 2014లో క్యాన్సర్ బారిన పడి 2017 లో భౌతికంగా దూరమైంది. తల్లి పెళ్ళి నాటికి మెట్రిక్యులేట్, అనంతరం పోస్ట్రాడ్యుయేషన్ చేసింది. తల్లి స్ఫూర్తితో తనయుడు సందీప్ సౌరవ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. 2009లో ఎంఏ, 2014లో హిందీ సాహిత్యంలో ఎంఏ, ఎంఫిల్ చేసి డాక్టరేట్ పొందాడు. నిత్యం సాహిత్యాన్ని అధ్యయనం చేసే సందీప్ అభ్యుదయ కవితల్ని తన సహచరులకు వినిపిస్తూ ఉత్తేజపరుస్తుంటాడు.

### జేఎన్యూ నేతగా రాజకీయాల్లో...

ఉన్నత చదువుల కోసం పాట్నా నుంచి ఢిల్లీకి వెళ్లాడు సందీప్ సౌరవ్. అక్కడ జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీలో ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) భాగస్వామ్యంతో రాజకీయ జీవితాన్ని ప్రారంభించాడు. ఆ సంఘానికి జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశాడు. అంకిత భావం కలిగిన కార్యకర్తగా అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి రాజీనామా చేసి త్యాగనీరతిని చాటుకున్నాడు. అలాంటి యువతకు పార్టీ ఎప్పుడు వెన్నుదన్నుగా నిలిచి ప్రోత్సహిస్తుంది. జేఎన్యూ విద్యార్థి నాయకుడిగా కీలకమైన పోరాటాలను నిర్వహించాడు. 2013 - 14 లో జేఎన్యూ (ఎస్యూ) ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడి సెంట్రల్ లో విద్యా రంగ పరిరక్షణకై, కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాటాలను రగిలించాడు. యూనివర్సిటీల సమస్యలపై, విద్యా రంగం, సామాజిక న్యాయం, అభివృద్ధి కోసం, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకై ఏఐఎస్ఏ జాతీయ ప్రధాన కార్యదర్శిగా విద్యార్థి యువజనోద్యమాలకు నాయకత్వం వహించాడు.

### లిబరేషన్ పోరాట క్షేత్రం 'పాలిగంజ్'

పాలిగంజ్ నియోజకవర్గం సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పోరాట క్షేత్రం. ఆ రాష్ట్రంలో ఎంఎల్ బలమైన కోటలుగా చెప్పబడిన ప్రాంతాల్లో ఇదొకటి. ఆధిపత్య వర్గాలకు వ్యతిరేకంగా మిలిటెంట్ పోరాట నేపథ్యం ఉంది. దళితులు, ఓబీసీలు, అణగారిన వర్గాల అభివృద్ధి కోసం చారిత్రక ప్రజా పోరాటాలు చేపట్టింది. భూ పోరాటాల ద్వారా ప్రజల్లో సీపీఐ (ఎంఎల్) గుర్తింపు సాధించింది. సామాజిక, ఆర్థిక ఇతర అంశాలపై క్యాంపెయిన్ నిర్వహించిన సీపీఐ (ఎంఎల్) బలమైన ప్రజా పునాది కలిగి ఉంది. 2005లో జరిగిన ఎన్నికల్లో నంద కుమార్ నందా లిబరేషన్ నుంచి గెలుపొందాడు. 2015 లో ఒంటరిగా పోటీ చేసిన లిబరేషన్ అభ్యర్థి అన్వర్ హుస్సేన్ 19, 438 ఓట్లు సాధించాడు.

### అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాన్నొదిలి ఎమ్మెల్యేగా..

జేఎన్యూ విద్యార్థి నాయకుడిగా అనేక పోరాటాలు నిర్వహించిన సందీప్ సౌరవ్ 33 ఏళ్లకే ఎమ్మెల్యేగా మొదటిసారి ఎన్నికయ్యాడు. బీహార్ లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా ఉద్యోగం సాధించిన ఆయన సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నుంచి 2020లో ఎమ్మెల్యేగా రికార్డు సృష్టించాడు. పాలిగంజ్ నియోజకవర్గం నుంచి 30,915 వేల మెజార్టీతో గెలుపొంది అసెంబ్లీలో అడుగు పెట్టాడు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న జై వర్ధన్ యాదవ్ పై పోటీచేసిన సందీప్ సౌరవ్ యాదవ్ శతాబ్దాల కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల్ని ఎన్నికల ప్రచారంలో లేవనెత్తాడు. ప్రజా సమస్యల్ని, ప్రభుత్వ వైఫల్యాలను అడ్రస్ చేశాడు. ఎన్డీయే కూటమి ప్రధానంగా సీపీఐ (ఎంఎల్)ను, సందీప్ సౌరవ్ ను టార్గెట్ చేసి ప్రచారం చేసింది. ప్రత్యర్థుల అధికార అండ, డబ్బు, ఇతర ప్రలోభాల ప్రభావం సౌరవ్ విజయాన్ని అడ్డుకోలేకపోయాయి. సామాన్య జన మద్దతుతో 67 వేల 917 ఓట్లు సాధించి సమీప జేడీయూ అభ్యర్థి జై వర్ధన్ యాదవ్ (బచ్చా యాదవ్) పై విజయ పతాక ఎగురవేశాడు. 44.27 శాతం ఓట్లు లభించాయి.

### 2024లో ఎంపీగా బరిలో...

2024లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో సందీప్ సౌరవ్ నలంద పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ అభ్యర్థిగా పోటీ చేశాడు. ప్రజాదారణ కలిగిన సందీప్ సౌరవ్ ఎన్డీఏ కూటమి అభ్యర్థికి చెమటలు పట్టించాడు. ఈ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలుండగా ఆరు ఎన్డీఏ కూటమి ప్రాతినిధ్యం ఉన్నవి. ఈ నేపథ్యంలో.. జేడీయూ ఎంపీ కేశలేంద్ర కుమార్ తో పోటీ పడిన సందీప్ 3, 90, 308 ఓట్లు సాధించడం విశేషం. రెండో స్థానంలో నిలవడం, పోరాట ఫలితంగా రాజకీయ ఉనికి విస్తరించింది. పెద్దగా ఆస్తుపాస్తులు లేని సౌరవ్ ప్రజా పునాదే తన ఆస్తి అంటాడు. ఆ రాష్ట్ర యువ ప్రముఖుల్లో సౌరవ్ కు అత్యంత ప్రాధాన్యత ఉంది.

రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపు...

2025 అసెంబ్లీ ఎన్నికల్లో పాలిగంజ్ నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఎన్డీఏ కూటమి అభ్యర్థి (లోక్ జనశక్తి పార్టీ) సునీల్ కుమార్ పై గెలిచాడు. 81, 105 ఓట్లను సాధించాడు. ఎన్డీఏ కూటమితో జరిగిన హోరాహోరీ పోరులో 6,655 కోట్ల మెజార్టీతో విజయం సాధించాడు. ఐదేళ్ల పదవి కాలంలో విద్య వైద్యం, రోడ్లు మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాడు. ఒకవైపు ప్రజా సమస్యల పరిష్కరిస్తూనే మరోవైపు అసెంబ్లీ లోపల బయట ప్రజా వేదికలలో ప్రశ్నించే గొంతుకగా నిలుస్తున్న సందీప్ సౌరవ్ పై పాలిగంజ్ ప్రజలు నమ్మకాన్ని, విశ్వాసాన్ని నిలిపారు. పాలక పార్టీల ప్రలోభాలను కాలదన్ని యువ విప్లవకారుడికు అండగా నిలబడ్డారు. ఫాసిస్ట్ శక్తులపై సౌరవ్ విజయం ప్రజా విజయంగా ప్రజాస్వామిక, ప్రగతిశీల శక్తులు అభివర్ణిస్తున్నాయి.

### ప్రత్యామ్నాయం రాజకీయాలు సృష్టించాలి

జాతీయ స్థాయిలో నిరుద్యోగ సమస్యపై బలమైన ఉద్యమాన్ని నిర్వహిస్తామని, అందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తానని చెబుతున్న సందీప్ సౌరవ్ విద్యార్థి యువతరానికి బలమైన సందేశాన్ని ఇస్తున్నారు. దేశ రాజకీయాల్లో నూతన మార్పుకోసం నవతరం రాజకీయాల్లోకి రావాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నాడు. "నవతరం రాజకీయాలను తిరస్కరిస్తే దేశ పురోభివృద్ధి. ప్రత్యామ్నాయ రాజకీయాలు ఎలా అభివృద్ధి అవుతాయి." అని ప్రశ్నిస్తున్నాడు. అవును.. సందీప్ సౌరవ్ ప్రశ్నలో సగటు భారతీయుడి ఆవేదన, ఆందోళన ఇమిడి ఉంది. ఆ దిశగా తెలంగాణ యువత ఆలోచన చేయాలి. అందుకు సందీప్ సౌరవ్ లాంటి యువత నడుం బిగించాలి. పాలిగంజ్ లాంటి ఫలితాల కోసం నవతరం కదలాలి, అణగారిన జనాలను కదిలించాలి. అవశేష ఫ్యూడల్ పాలన నుంచి చైతన్య వంతమైన సమాజం బయటపడాలి. అప్పుడే సమగ్రాభివృద్ధికి, సామాజిక న్యాయానికి పునాది రాళ్లు పడతాయి.



- మామిండ్ల రమేష్ రాజా
సెల్ : 7893230218

## ప్రశ్నించే తత్వం

జ్ఞానాన్వేషణకు ప్రేరణ
(ప్రశ్నలు జ్ఞానానికి నాంది
సోక్రటీస్)

మనిషి జీవితంలో
ఎందుకు? ఏమిటి ?
ఎలా? అని ప్రశ్నించే
తత్వం జ్ఞానాన్వేషణకు
ప్రేరణై జీవితం
మొదలవుతుంది
జీవన సాఫల్యతకు
నూతన మార్గాలను
కనుగొంటాం
ప్రశ్నించే తత్వం
సృజనాత్మకతకు
ఇంధనం లాంటిది
కొత్త ఆలోచనలకు
కొత్త ఆవిష్కరణలను
పురికొల్పుతుంది
తరగతి గదిలో అధ్యాపకులు
పాఠాలు బోధించినప్పుడు
ప్రతి విషయాన్ని విమర్శాత్మక
ధోరణితో ప్రశ్నించండి ?
జ్ఞానం వృద్ధి చెందుతుంది
విజ్ఞానం వికసించి ప్రతిభ
ఇనుమడిస్తుంది
ప్రశ్నించే తత్వం
నేర్చుకోవాలనే
తపనను పెంచి మానసిక
వికాసం
పెరిగి సమస్యల పరిష్కార
నైపుణ్యాన్ని పెంచుతుంది
ప్రశ్నించే తత్వంతో మనం
ఎంచుకున్న రంగంలో
ఉన్నత స్థాయికి ఎదిగుతాం
అలా కాకుండా మనం
నేర్చుకున్న ప్రతి విషయాన్ని
గుడ్డిగా విశ్వసిస్తూ తర్కానికి
దూరంగా ఉండిపోతే
పతనావస్థకు చేరుకుంటాం
సమస్య గురించి ఫిర్యాదు
చేయడం
మాని సమస్యకు గల
కారణాలు
పరిష్కార మార్గాలు
సూచించే
సామర్థ్యంపై దృష్టి పెట్టండి
సమస్య తీవ్రతను బట్టి
ప్రాధాన్యాన్ని నిర్ణయించాలి
నిర్ణీత కాలములో
పరిష్కరించే
కార్యాచరణకు
ఉపక్రమించాలి
పరిష్కారం కోసం
అన్వేషించాలి
స్ఫూర్తినిచ్చి జీవిత కథలు
చదవండి విభిన్న
వ్యక్తులతో కలవడం
సంభాషించడం ద్వారా
ప్రశ్నించేతత్వం
పెరుగుతుంది
చిన్నలక్ష్యాలు నిర్దేశించుకొని
ఆలక్ష్యాలను చేరడం ద్వారా
సంతృప్తిని ఆసక్తిని
పెంచుకొని
సానుకూల దృక్పథంతో
మానవ
వికాసానికి తోడ్పడాలి
ప్రశ్నతో పరిశీలన పరిశోధన
అధ్యయనం అభ్యసనం
విమర్శనాత్మక ఆలోచన
ప్రశ్నించే తత్వం మనసులో
ప్రపంచం గురించి

నేదునూరి కనకయ్య
ఇండిపెండెంట్ జర్నలిస్టు
కాలమిస్ట్
హైదరాబాద్
9440245771

# మానవుడే పుస్తకం... అనుభవమే పాఠం


గ్రంథాలయం అంటే ఏమిటి? మన మనసులో మొదటగా మెదిలేది గోడల మధ్య అమర్చిన వేలాది పుస్తకాలు, చక్కగా అలంకరించిన రాక్‌లు, పుస్తకాల సుగంధం, నిశ్శబ్దంలో మునిగిన పాఠకులు. కానీ ఒక కొత్త రకం గ్రంథాలయం గురించి విన్నప్పుడు మీ ఊహలన్నీ తలకిందులవుతాయి. ఇక్కడ పుస్తకాలు లేవు. రాక్‌లు లేవు. లైబ్రేరియన్ లేడు. ఉన్నది కేవలం మనుషులు మాత్రమే. వారినే "సజీవ పుస్తకాలు" లేదా "మానవ పుస్తకాలు" అంటారు. మీరు ఒక సజీవ పుస్తకాన్ని ఎంచుకుని, ప్రశాంతమైన మూలలో కూర్చుని 20 నుంచి 40 నిమిషాల పాటు స్వేచ్ఛగా మాట్లాడ వచ్చు. ఏ ప్రశ్న అడిగినా సమాధానం ఇస్తారు. ఏ విషయం గురించి అయినా లోతుగా తెలుసుకోవచ్చు. ఆ సంభాషణ ముగిసేసరికి మీ మనసులో ఉన్న ముందస్తు అభిప్రాయాలు, భయాలు, ద్వేషాలు, పక్షపాతాలు, స్టీరియోటైప్‌లు కొంతైనా కరిగిపోతాయి. ఇదే "మానవ గ్రంథాలయం" అనే అద్భుత భావన. ఇది కేవలం ఒక కార్యక్రమం కాదు... సమాజాన్ని మార్చే, మానవత్వాన్ని తిరిగి నేర్పే మహా ఉద్యమం.

### డెన్మార్క్‌లో జన్మించి 85 దేశాలకు వ్యాపించిన అద్భుత ఆలోచన

2000 సంవత్సరం. డెన్మార్క్‌లోని కోపెన్‌హేగన్ నగరం. ఓ చిన్న స్వచ్ఛంద సంస్థ "స్టాప్ ది వయలెన్స్" నాయకులు ఒక కీలకమైన ప్రశ్న వేసుకున్నారు %-% "సమాజంలో ద్వేషం, పక్షపాతాలు, స్టీరియోటైప్‌లు ఎక్కడ నుంచి వస్తున్నాయి? అవి ఎలా తొలగాలి?" ఈ ప్రశ్నకు సమాధానం కోసం వారు లోతుగా ఆలోచించారు. చర్చలు జరిపారు. అనేక సమావేశాలు నిర్వహించారు. చివరకు ఒక సరళమైన, అయినా శక్తివంతమైన సమాధానం కనుగొన్నారు - "మనుషులు ఒకరినొకరు నేరుగా కలుసుకోవాలి. మాట్లాడుకోవాలి. అర్థం చేసుకోవాలి." ఈ ఆలోచన నుంచే మానవ గ్రంథాలయం జన్మించింది.

మొదటి కార్యక్రమం ఒక చిన్న హాలులో జరిగింది. కొద్దిమంది సజీవ పుస్తకాలు, కొద్దిమంది పాఠకులు పాల్గొన్నారు. కానీ ఆ చిన్న ప్రయోగం ప్రజల మనసులను కదిలించింది. ఆ కార్యక్రమంలో పాల్గొన్నవారు తమ అభిప్రాయాలు మార్చుకున్నారు. ఇతరుల పట్ల సానుభూతి పెరిగిందని చెప్పారు. ఈ విజయం ఆ సంస్థకు కొత్త ఆలోచనలను ఇచ్చింది. కొన్ని నెలల్లోనే ఈ భావన డెన్మార్క్‌లోని ఇతర నగరాలకు వ్యాపించింది. ఆ తర్వాత స్వీడన్, నార్వే, ఫిన్‌లాండ్, జర్మనీ, ఫ్రాన్స్ వంటి యూరప్ దేశాలకు విస్తరించింది. 2005 నాటికి అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాలో కార్యక్రమాలు జరిగాయి. 2010 నాటికి ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాల్లోనూ ఈ భావన పాతుకుపోయింది. ఇప్పుడు 85కి పైగా దేశాల్లో ఈ గ్రంథాలయాలు సామాజిక మార్పుకు కేంద్రాలుగా మారాయి.

మానవ గ్రంథాలయంలో సజీవ పుస్తకాలుగా ఎవరు ఉంటారు? సమాజం వెలివేసినవారు, లేబుల్ అంటించినవారు, దూరంగా పెట్టినవారు. ఉదాహరణకు %-% ఆటిజం ఉన్న బాలుడు, డిప్రెషన్‌తో పోరాడుతున్న యువతి, బైపోలార్ డిసార్డర్‌తో జీవిస్తున్న వ్యక్తి, హిజాబ్ ధరించే ముస్లిం మహిళ, ట్రాన్స్‌జెండర్ వ్యక్తి, హోలోకాస్ట్ బతికి బయటపడిన యూదుడు, ఎయిడ్స్ బాధితుడు, మాజీ డ్రగ్ అడిక్ట్, ఆసిడ్ దాడి బాధితురాలు, దివ్యాంగుడు, గే జంట, సిరియా రిఫ్యూజీ, బాలకార్మికుడిగా బతికిన వ్యక్తి, మాజీ ఖైదీ, లైంగిక వేధింపుల బాధితురాలు, ఆదివాసీ మహిళ, దళిత యువకుడు, మతమార్పిడి బాధితుడు... ఇలా ఎంతో మంది. వీరంతా స్వచ్ఛందంగా



తమ జీవిత కథలను పంచుకోవడానికి సిద్ధంగా ఉంటారు. వారి లక్ష్యం పాఠకులను బాధపెట్టడం కాదు... వారిలోని తప్పుడు అవగాహనలను, స్టీరియోటైప్‌లను, ద్వేషాన్ని తొలగించడం.

### స్టీరియోటైప్‌లను, కళంకాలను, ద్వేషాన్ని కరిగించే శక్తివంతమైన సాధనం

మానవ గ్రంథాలయం ఎలా పనిచేస్తుంది? ఒక ఉదాహరణ తీసుకుందాం. ఒక యువకుడు ట్రాన్స్‌జెండర్ మహిళతో మాట్లాడాడు. ఇప్పటిదాకా అతను వారిని "వికృతులు" అనుకునేవాడు. కానీ ఆమె కథ విన్నాక అతని కన్నీళ్లు ఆగలేదు. "నేను ఇప్పటిదాకా ఎంత తప్పు చేశానో ఇప్పుడు అర్థమైంది" అని రాశాడు. ఒక విద్యార్థిని మాజీ డ్రగ్ అడిక్ట్‌తో మాట్లాడింది. "అతను చెడ్డవాడు కాదు... సమాజం అతన్ని అలా చేసింది" అని రాసింది. ఒక మధ్యవయస్కుడు స్కిజోఫ్రీనియాతో బతుకుతున్న యువకుడితో మాట్లాడాడు. "నేను ఇప్పటిదాకా వాళ్లను 'పిచ్చివాళ్లు' అనుకునేవాణ్ణి... ఇప్పుడు వాళ్ల బాధ ఎంత లోతైందో తెలిసింది" అని చెప్పాడు. ఒక మహిళ ఆసిడ్ దాడి బాధితురాలితో మాట్లాడింది. "ఆమె ముఖం చూసి భయపడేవాళ్లం... ఇప్పుడు ఆమె ధైర్యానికి జోహార్లు చెబుతున్నాం" అని రాసింది.

ప్రపంచవ్యాప్తంగా జరిగిన అధ్యయనాలు ఒక్కటే చెబుతున్నాయి. మానవ గ్రంథాలయంలో పాల్గొన్న 80-90 శాతం మంది తమ అభిప్రాయాలు మార్చుకున్నారు. 95 శాతం మంది ఇతరుల పట్ల సానుభూతి పెరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమం మానసిక ఆరోగ్య కళంకాన్ని తొలగిస్తుంది. లింగ వివక్షను తగ్గిస్తుంది. జాతి, మత, కుల ద్వేషాలను కరిగిస్తుంది. సమాజంలోని అంచున ఉన్నవారిని మధ్యలోకి తెస్తుంది. వారి గొంతులను వినిపిస్తుంది. ఇది ఒక్కసారి జరిగే కార్యక్రమం కాదు... నిరంతరం కొనసాగాల్సిన ప్రక్రియ.

### భారత్‌లో చిన్నారి అడుగులు... దేశవ్యాప్త ఉద్యమంగా మారాల్సిన అవసరం

భారతదేశంలో ఈ భావన ఇంకా చిన్నారి అడుగులే వేస్తోంది. 2016 జూన్‌లో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో తొలి మానవ గ్రంథాలయం ప్రారంభమైంది. ఆ తర్వాత హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, పూణే, కోల్‌కతా, అహమ్మదాబాద్, లక్నో, జైపూర్, భోపాల్, గువాహటి, చండీగఢ్, విశాఖపట్నం, విజయవాడ, కోయంబత్తూర్ వంటి నగరాల్లో కొన్ని కార్యక్రమాలు జరిగాయి. హైదరాబాద్‌లో లంబాడా మహిళలు, ట్రాన్స్‌జెండర్లు, మానసిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారు, ఎయిడ్స్ బాధితులు సజీవ పుస్తకాలుగా మారారు. ఢిల్లీలో ఆసిడ్ దాడి బాధితులు, దివ్యాంగులు, ఎల్‌జీబీటీక్యూ సముదాయం నుంచి వచ్చినవారు, రిఫ్యూజీలు పాల్గొన్నారు. ముంబైలో బాలకార్మికులుగా బతికినవారు, గుడిసెలో జీవించే మహిళలు, మాజీ ఖైదీలు తమ కథలు చెప్పారు. చెన్నైలో దళిత యువత, మతమార్పిడి బాధితులు, మత్స్యకార సముదాయం నుంచి వచ్చినవారు మాట్లాడారు.

కానీ ఈ కార్యక్రమాలు ఒక్కోసారి మాత్రమే జరిగాయి. నిరంతర కార్యక్రమంగా మారలేదు. భారత్‌లో ఈ భావనకు అపార అవసరం ఉంది. ఇక్కడ జాతి, కులం, మతం, లింగం, మానసిక ఆరోగ్యం, లైంగిక గుర్తింపు పై బలమైన కళంకాలు ఉన్నాయి. ఒకరినొకరు అర్థం చేసుకోవడం లేదు. సోషల్ మీడియాలో ట్రోలింగ్, హేట్ స్పీచ్‌లు, సైబర్ బుల్లింగ్ పెరిగిపోతున్నాయి. రాజకీయ ధ్రువీకరణ, మత ఉద్రిక్తతలు, కుల ఘర్షణలు, లింగ వివక్ష సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో మానవ గ్రంథాలయం కంటే శక్తివంతమైన సాధనం మరొకటి లేదు.

ప్రతి రాష్ట్రంలోనూ, ప్రతి జిల్లా కేంద్రంలోనూ, ప్రతి యూనివర్సిటీలోనూ, ప్రతి ప్రభుత్వ గ్రంథాలయంలోనూ, ప్రతి పాఠశాలలోనూ, ప్రతి కళాశాలలోనూ ఈ కార్యక్రమాలు నిరంతరం జరగాలి. ఎన్జీవోలు, విద్యాసంస్థలు, సాహిత్య సంఘాలు, గ్రంథాలయ సంఘాలు, యువజన సంఘాలు, మహిళా సంఘాలు, దళిత సంఘాలు, ఆదివాసీ సంఘాలు, ఎల్‌జీబీటీక్యూ సంఘాలు, మానసిక ఆరోగ్య సంస్థలు, మానవ హక్కుల సంస్థలు, సామాజిక సేవా సంస్థలు ఈ బాధ్యతను స్వీకరించాలి. ప్రభుత్వం దీన్ని అధికారిక కార్యక్రమంగా చేపట్టాలి. జాతీయ విద్యా విధానంలో ఇది ఒక భాగంగా చేర్చాలి. ప్రతి విద్యార్థి తన విద్యలో భాగంగా కనీసం ఒకసారైనా మానవ గ్రంథాలయంలో పాల్గొనేలా చేయాలి.

డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ గారు ఒకసారి అన్నారు - "ఒక ఉత్తమ పుస్తకం వంద మంచి స్నేహితులకు సమానం... కానీ ఒక మంచి స్నేహితుడు మాత్రం ఒక గ్రంథాలయానికి సమానం." మానవ గ్రంథాలయం అంటే ఆ మంచి స్నేహితుడిని కలిసిన అనుభవం. ఆ స్నేహితుడిలోని బాధలు, ఆశలు, పోరాటాలు, విజయాలు విని మనసు మార్చుకునే అవకాశం. పుస్తకాలు మనల్ని తెలివితేటలు చేస్తాయి. కానీ సజీవ మానవులతో సంభాషణ మనల్ని మానవుల్ని చేస్తుంది. ఈ ఉద్యమాన్ని మనం బలపరచాలి. ఎందుకంటే... రేపటి సమాజం ఎలా ఉండాలనేది ఈ రోజు మనం ఎంత మానవత్వం చూపుతున్నామనేది పైనే ఆధారపడి ఉంటుంది. మానవ గ్రంథాలయం ఆ మానవత్వాన్ని మేల్కొల్పే మహా ఉద్యమం. దీన్ని ప్రతి ఒక్కరూ స్వీకరించాలి. ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. ఇది మన బాధ్యత. ఇది మన భవిష్యత్తు. ఇది మన సమాజం కోసం మనం చేయవలసిన కనీస సేవ.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

## పరిష్కారం!

వేదాలు ఉపనిషత్తులు ధర్మశాస్త్రపురాణాలు
రామాయణభారతాలు కృష్ణలీలలుగీతాబోధలు
ఎంతమంది చదివారు? సూద్ర, దళితులు,
స్త్రీలకు చదువుల్లేకుండాచేసారు!
గ్రంధాలు చదివేదెవరు?
దారుణమైన మోసం అనాదేజరిగిపోయింది!
గాలిలో దీపంపెట్టి 'నీదేభారం'అంటున్నాం!
ఇవన్నీ పరిష్కారం కాదు మనువాదులు ఎక్కడ
దెబ్బకొట్టారో అక్కడే మొదలుపెడదాంమనం!
అదొక్కటే పరిష్కారం!
సంపూర్ణ అక్షరాస్యతే ప్రాధమిక అంశం!రండి
అందరికివిద్యఅందిద్దాం!
విద్యలేనిసమాజంలో మూఢవిశ్వాసాలుపెరిగి
వివక్షలే ఉంటాయి తప్ప విచక్షణాజ్ఞానం
పెరగదు!
చదువుకున్నవాళ్లంతా దేశాన్ని ఉద్దరించారా?
అనేవితండవాదమొద్దు!
అక్షరాస్యుల్నిచేద్దాంరండి
చదువులేకపోవటంవల్ల
ఇప్పటికీ మోసగాళ్లు చెలరేగి పోతున్నారు!
అన్నీగారడీలుమాయలు సంపూర్ణ అక్షరాస్యత
సాధించటమే కర్తవ్యం!తేలికమార్గం చెపుతాను!
'కులం'తోసాధించవచ్చు!
మనదేశం కులాల దేశం!
కులమంటే మహా ప్రేమ!
కులాన్నిసాధనంగావాడు విజయం సాధించు!
ఇంట్లోపిల్లలతోపెద్దలకు అక్షరమాల నేర్పించు!
మూడునెలలు చాలు! అందరూ అక్షరాస్యులే!
ఇక కాగల కార్యం వాళ్ళే చూసుకుంటారు!
దోచుకునేవాళ్లకి వాళ్ళే బుద్ధి చెపుతారు!
నాకులాన్ని తీర్చిదిద్దాను అనే సంతృప్తి నీకు
లభిస్తుంది-వాళ్ళుకూడా నిన్ను అభినందిస్తారు!
కులంవల్ల ఈ కార్యం మనం సాధించ గలం!
ఈ రకంగా దేశానికి ప్రయోజనంచేకూర్చగలం
ఒక్కసారి ఆలోచించండి! వేదాంతంలో దేశం
నెంవన్ అక్షరాస్యత`కూడా సాధిస్తే ప్రపంచం
లోనే నెం.వన్ దోపిడీకి చిక్కకుండా
ప్రజలు తెలివిమీరతారు!
కొంతలోకొంతమేలే కదా! ఇది ఒక
'పరిష్కారం'!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వాలి

- టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం
- ఫీజు రాయితీ ఇవ్వని పాఠశాలపై కఠిన చర్యలు ఉంటాయి
- జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి జర్నలిస్టులకు స్పష్టమైన హామీ
- త్వరలో డిఈవో ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తాం



**ఇబ్రహీంపట్నం, నవంబర్ 19 (జనం సాక్షి) :** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల్లో 50% ఫీజు రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి టిడబ్ల్యుజేఎఫ్ నాయకులు జర్నలిస్టులు భారీగా హాజరయ్యారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షులు గణేష్, ప్రధాన కార్యదర్శి సైదులు, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, మణి కుమార్, రాందాస్, జిల్లా సహాయ కార్యదర్శులు ప్రభాకర్, నర్సింహ్మ, నేషనల్ కౌన్సిల్ సభ్యులు దేవేందర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఖాజా పాషా, శ్రీనివాస్, తదితరుల తో కలిసి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు అని, జర్నలిస్టులకు నూతన అక్రిడేషన్ కార్డులను ఇవ్వాలని అదేవిధంగా ఇల్లు స్థలాలు హెల్త్ కార్డులు తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ కు విన్నవించారు.

**ఫీజు రాయితీ ఇవ్వని పాఠశాలపై కఠిన చర్యలు**

రంగారెడ్డి జిల్లా పరిధిలో పనిచేస్తు అక్రిడేషన్ కలిగివున్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో 50% ఇవ్వాలని గతంలోనే ఆదేశాలు జారీ చేశామని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. త్వరలోనే డిఇఓతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి జర్నలిస్టుల పిల్లలకు స్కూళ్లలో ఫీజు రాయితీ ఇవ్వటానికి నిరాకరిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని స్పష్టమైన హామీ ఇచ్చారు. జర్నలిస్టులు తమ పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో రాయితీ దక్కని పక్షంలో నేరుగా తమకు ఫిర్యాదు చేయవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. రాయితీ నిరాకరించిన పాఠశాలలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. అక్కడేషన్ల అంశానికి వస్తే రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిదని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో నూతన అక్రిడేషన్ కార్డులు జారీ చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అధ్యక్ష, కార్యదర్శులు చిలువేరు యాదగిరి, జగన్, షాద్నగర్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు రాఘవేందర్, గౌడ్ నరేష్, చేవెళ్ల అధ్యక్షులు రాజు, మహేశ్వరం అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహా, సురేందర్, రాజేందర్ నగర్ అధ్యక్షులు గోపాల్, ఎల్ బి నగర్ అధ్యక్షులు శ్రీ రాములు, జిల్లా ప్రచార కార్యదర్శి నరసింహ రెడ్డి, షాద్నగర్ డివిజన్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష కార్యదర్శులు ఆంజనేయులు గౌడ్, సాయినాథ్ రెడ్డి పాల్గొన్నారు.

## సీసీఐ నిబంధనలు వ్యతిరేకిస్తూ సీపీఐ (ఎం) నిరసన



**చేర్యాల, నవంబర్ 19 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం, సీసీఐ అమలు చేస్తున్న రైతు వ్యతిరేక నిబంధనలను వ్యతిరేకిస్తూ పాత బస్టాండ్ వద్ద పత్తి రైతులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొంగరి వెంకట మావో మాట్లాడుతూ.. ఈ విధానాన్ని వెంటనే మానుకొని, అన్ని జిన్నింగ్ మిల్లులకు నోటిఫై చేసి, ఆంక్షలు లేకుండా పత్తి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామన్నారు.

## హైడ్రా అధికారులను అడ్డుకున్న అంబేద్కర్ యువజన సంఘం



**అల్వాల్, నవంబర్ 19 (జనంసాక్షి) :** ఓల్డ్ అల్వాల్ అంబేద్కర్ నగర్‌లో సాగుతున్న స్థల వివాదం బుధవారం ఉద్రిక్తానికి దారితీసింది. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం–వజ్ర ఎంక్లేవ్ మధ్య కొనసాగుతున్న స్థల తగాదా నేపథ్యంలో హైడ్రా అధికారులు కంచె వేయడానికి రావడంతో కాలనీవాసులు అడ్డుకట్ట వేశారు. అధికారుల రాకతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మధ్యాహ్నం మూడు గంటలకు హైడ్రా కార్యాలయంలో కమిషనర్ రంగనాథ్ సమక్షంలో వివాద పరిష్కారానికి సమావేశం జరుగనున్నప్పటికీ, ముందుగానే కంచె పనులకు రావడం తగదని అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు పేర్కొన్నారు. 30 ఏళ్ల క్రితం భూమి యజమాని హరినాధరావు పార్కు కోసం రెండువేలకి పైగా గజాల స్థలాన్ని ఇచ్చారనీ, 1986లో భవనం నిర్మాణం కోసం పిల్లర్లు కూడా వేశారనీ, అప్పట్లో ఎలాంటి సమస్యలు లేవని, ఇప్పుడు వివాదం ఎలా వస్తుందని హైడ్రా సిబ్బందిని నిలదీశారు. కొత్తగా ఎన్నికైన వజ్ర ఎంక్లేవ్ కమిటీ సభ్యులు ఈ స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తున్నారని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సి.ఎల్. యాదగిరి, యాదలయ్య నాగమయ్య, ఢిల్లీ పరమేశ్, శంకర్, రాజయ్య, ఆనంద్, రామకృష్ణ, ఎల్లమయ్య, గోరెమియా, హంజద్ ఖాన్‌తో పాటు మహిళలు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

- రంగారెడ్డి మీడియా ప్రతినిధుల విన్నపం



**రాజేంద్రనగర్, నవంబర్ 19 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల మంజూరు చేయాలని టీయూడబ్ల్యూజే జిల్లా శాఖ నాయకులు మంత్రి శ్రీధర్ బాబు, మండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌లను కోరారు. జిల్లాలో అనేక మంది రిపోర్టర్లు ప్రభుత్వ గుర్తింపు లేక, హెల్త్ కార్డులు లేక ఇబ్బందులు పడుతున్నారని, సరైన వైద్యసదుపాయాలు అందక పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని వారు తెలిపారు. హెల్త్ కార్డులు పనిచేయకపోవడంతో సమస్యలు తీవ్రమయ్యాయని, రాజేంద్రనగర్ వి6 రిపోర్టర్ నర్సింగ్ రావు గుండెపోటుతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, అతనికి సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఇటీవల శాబాద్ మండల రిపోర్టర్ రాములు మృతికి గురైన విషయాన్ని ప్రస్తావిస్తూ, వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. జర్నలిస్టులకు ఉద్యోగుల మాదిరిగా భద్రతా పథకాలు, వైద్య సేవలు, నివాస స్థలాలు కల్పించాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. ఈ అంశాలపై మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించారు. వినతిపత్రం అందించిన వారిలో సీనియర్ జర్నలిస్టులు భీమయ్య, విష్ణు, సూర్యనారాయణ, రాజేందర్ రెడ్డి, రాజు, శేఖర్ రెడ్డి, నరేందర్, బాలు తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.

## యువతలో నైపుణ్యాభివృద్ధి పెంచడానికి కృషి

- తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు



**ఖైరతాబాద్, నవంబర్ 19 (జనం సాక్షి) :** మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా యువత లో నైపుణ్యాభివృద్ధిని పెంచడానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర ఐటీ ఎలక్ట్రాని క్స్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. గచ్చిబౌ లిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియాలో బుధవారం జరిగిన నాల్గవ స్కిల్ స్నాతకోత్సవానికి ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సంద ర్భంగా మంత్రి మాట్లాడుతూ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటుతో పాటుగా ఐటిఐ పాలిటెక్నిక్ ఇనిస్టిట్యూట్లను, అడ్వాన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్స్‌గా మార్చినట్లు 2100 కోట్ల వ్యయం తో యువత నైపుణ్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభు త్వం ప్రభుత్వం కేటాయించిందని అన్నారు. మరో అతిథి మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ నైపుణ్యమంటే సమా జానికి అవసరమయ్యే వస్తువులను ఉత్పత్తి చేస్తూ వంద మందికి ఉపాధి కలిగించాలన్నారు. ఇంజనీ రింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర రావు మాట్లాడుతూ సుమారు 13 ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీల్లోని 960 మంది యువతకు ఎలక్ట్రికల్ వెహికల్స్, సోలార్ టెక్నాల జీ, డేటా సైన్సెస్ తదితర ఎమర్జింగ్ టెక్నాలజీలపై నైపుణ్య సంబంధమైన శిక్షణ ఇచ్చామని, భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్, స్కిల్ ఇండియా తోడ్పాటుతో ఈ కార్యక్రమాలు నిర్వహి స్తున్నామన్నారు. సమావేశంలో జయప్రకాశ్ నారా యణ ఇంజనీరింగ్ కాలేజీల ఛైర్మెన్ రవి కుమార్, ఎం.జి.ఐ టి ప్రిన్సిపాల్ చంద్రమోహన్ రెడ్డితో పాటు పలు కాలేజీల ప్రిన్సిపాల్స్, ఫ్యాకల్టీ సభ్యు లు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ డెవలప్ మెంట్ ప్రోగ్రాం సెల్ రెండు రోజుల పాటు ఆర్టిఫిసి యల్ ఇంటిలిజెన్స్, డిజిటల్ టెక్నాలజీస్ పై నిర్వ హించిన హ్యాక్ థాన్ లో గెలుపొందిన విద్యార్థుల కు మంత్రి శ్రీధర్ బాబు, జయ ప్రకాష్ నారాయణ సర్టిఫికెట్లు ప్రధానం చేసారు. సమావేశంలో ఎఫ్. డి.పి సెల్ హెడ్ పి.సాయి కిషోర్, ఎస్కి సిబ్బంది లక్ష్మి కాంత రావు, డాక్టర్ పి.రాజారావుతో పాటుగా పలు డివిజన్లకు చెందిన హెడ్స్ ఆఫ్ డిపార్ట్ మెంట్స్, పలు కాలేజీల విద్యార్థులు పాల్గొన్నారు.

## కోచింగ్ ది కోచ్ ప్రచారాన్ని ప్రారంభించిన ఫ్రీడమ్




**ఖైరతాబాద్, నవంబర్ 19 (జనం సాక్షి) :** దేశంలోని ప్రముఖ వంట నూనె బ్రాండ్‌లలో ఒకటైన ఫ్రీడమ్ సన్‌ఫ్లవర్ ఆయిల్, తాము కొనుగోలు చేస్తున్న వంటనూనె పౌచ్‌లో వంట నూనె పరిమాణాన్ని తనిఖీ చేయడం గురించి వినియోగదారులలో అవగాహనను వ్యాప్తి చేయడానికి డిఆర్ఎస్ (డెసిషన్ రివ్యూ సిస్టమ్) వర్సెస్ పిఆర్ఎస్(ప్యాక్ రివ్యూ సిస్టమ్) భావనను ఉపయోగించి తమ కొత్త 'కోచింగ్ ది కోచ్' ప్రచారాన్ని ప్రారంభించినట్లు జెమి ని ఎడిబుల్స్, ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ సేల్స్, మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ పి.చంద్రశేఖ ర రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జెమిని ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా లిమిటె డ్ హెడ్ మార్కెటింగ్ శ్రీ చేతన్ పింపాల్‌ఖుటేతో కలసి ఆయన మాట్లాడుతూ ఈ ప్రచారంలో రాహుల్ ద్రవిడ్ ప్రముఖంగా కనిపిస్తారని చెప్పారు. ఆయ న ప్యాక్‌పై పేర్కొన్న పరిమాణాన్ని ధృవీకరించడం యొక్క ప్రాముఖ్యతను ప్రధానంగా వెల్లడిస్తారని తెలిపారు. భారత ప్రభుత్వ వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిబంధనల ప్రకారం, ప్రతి ఒక లీటర్ పౌచ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌లో 910 గ్రాముల నూనె ఉండాలని, అయితే, కొన్ని బ్రాండ్లు 1 లీటరు తరహాలో కనిపించే ప్యాక్ లో తక్కువ పరిమాణంలో నూనె అందిస్తున్నాయని అన్నారు. సాధారణంగా అవి 800 నుండి 870 గ్రాములు బరువు ప్యాక్ లు విడుదల చేస్తున్నాయన్నారు. ఈ నూనె ప్యాక్‌లో నికరంగా 910 గ్రాముల బరువు నూనె ఉండాలి, పౌచ్ ఫిల్మ్ యొక్క పరిమాణం, బట్టి ప్యాక్‌తో సహా స్థూల బరువు సుమారుగా 918 గ్రాములు ఉండాలన్నారు.

## మాజీ ప్రధాని ఇందిరగాంధీ సేవలు చిరస్మరణీయం

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల, నవంబర్ 19 (జనంసాక్షి) :** దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాలర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దేశ ప్రధానిగా బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. రూపాయి మూల్యాంకణం, రాజాభరణాల రద్దు, బ్యాంకుల జాతీయకరణ వంటి అనేక సంచలన నిర్ణయాలు తీసుకున్నారన్నారు. సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, ఆర్థిక రంగాల్లో రాణించిన ఇందిరా గాంధీ భారత దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటారని కొనియాడారు. ఆమె స్ఫూర్తితో ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూధన్ రెడ్డి, చేవెళ్ల, ముడిమ్యాల సొసైటీ చైర్మన్లు దేవర వెంకట్ రెడ్డి, గోనే ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య, వైస్ చైర్మన్ బెగరి రాములు, మాజీ సర్పంచ్ లు పడాల ప్రభాకర్, మధుసూధన్ గుప్తా, దావల్గారి గోపాల్ రెడ్డి, నర్సింహులు, మాజీ ఎంపీటీసీలు రవీందర్ రెడ్డి, గుండాల రాములు, మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, జంగా రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, పాండు, మండల యువజన విభాగం అధ్యక్షుడు కార్తిక్ రెడ్డి, నరేందర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## సీఎంని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి



**జడ్చర్ల, నవంబర్ 19 (జనంసాక్షి) :** సీఎం రేవంత్ రెడ్డిని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఉదండాపూర్ నిర్వాసితుల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కి సంబంధించిన ఫైలును రాబోయే కేబినెట్ మీటింగ్ లో ఆమోదించాలని, నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన తర్వాత కొంతమంది ఇంటి నిర్మాణానికి పునాదులు వేసుకోగా అవి ఇందిరమ్మ యాప్‌లో అప్లోడ్ కాకపోవడం వల్ల వారికి బిల్లులు ఆగిపోయాయని ఈ సమస్యను ఎదుర్కొంటున్న వారి వివరాలను జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపడం జరిగిందని ఇందిరమ్మ యాప్‌లో ఉన్న సాంకేతిక సమస్యలు తొలగించి ఆ బిల్లులను సత్వరమే పరిష్కరించేలా చేయాలని సీఎంని కోరారు. ఈ విషయంగా సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు.

## మేడ్చల్ జిల్లాలో కోటి చీరల పంపిణీకి సీఎం ఆదేశాలు

- పారదర్శకంగా నిర్వహించాలన్న కలెక్టర్ సూచనలు




**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 19 (జనంసాక్షి) :** ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "కోటి మహిళలకు–కోటి చీరలు" పంపిణీ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. కార్యక్రమం జిల్లాల్లో ఎలాంటి వివాదాలు లేకుండా పారదర్శకంగా సాగాలని అన్ని కలెక్టర్లకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, విజయేందర్ రెడ్డి పాల్గొన్నారు. జిల్లాలో పంపిణీ షెడ్యూల్‌ను ఖచ్చితంగా పాటించి, ప్రతి మండలంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇవాళ్టి నుంచి డిసెంబర్ 9 వరకు, పట్టణాల్లో మార్చి 1%–%8 వరకు చీరల పంపిణీ జరుగనుంది. ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేక అధికారి నియమించాలని సీఎం సూచించారు. మహిళా సంఘాల అభివృద్ధి కోసం యూనిఫార్ముల కుట్టు పనులు, ఇందిరా శక్తి బజార్, ఆన్‌లైన్ మార్కెట్ అవకాశాల కోసం అమెజాన్‌తో చర్చలు కొనసాగుతున్నాయని సీఎం తెలిపారు. జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మహిళాశక్తి సంఘాలు సమావేశంలో పాల్గొన్నారు.


## పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల, నవంబర్ 19 (జనంసాక్షి) :** రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తెలిపారు. బుధవారం చేవెళ్ల మండల పరిధిలోని దామరిగిద్ద గ్రామంలో పరిధిలో ఉన్న పత్తి మిల్లు వద్ద పత్తి కొనుగొలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కాలే యాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రైతులు పండించిన పంటను కొనుగోలు చేసేందకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటికే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. పత్తి రైతుల కోసం పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పత్తి పండిన రైతులు నేరుగా పత్తి మిల్లులోనే పత్తిని విక్రయించాలని సూచించారు. దళారులకు పత్తి అమ్మి రైతులు నష్ట పోవద్దన్నారు. రైతులకు మద్దతు ధర రూ.8110 అందించి పత్తిని కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకట్ రెడ్డి, గోనే ప్రతాప్రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, మర్పల్లి క్రిష్ణా రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్లు గోపాల్ రెడ్డి, నర్సింలు, పడాల ప్రభాకర్, రెడ్డి శెట్టి మధుసూదనుప్తా, పాండుగౌడ్, మాజీ ఎంపీటీసీ గుండాల రాములు, ఎర్ర మల్లేష్, కాంగ్రెస్ మండల యువజన నాయకుడు కార్తిక్ రెడ్డి, శ్రీనివాస్, రైతులు తదితరులు ఉన్నారు.

# క్రయవిక్రయదారులకు సేవలు అందించేది దస్తావేజు లేఖరులే..

- అవగాహన లేకుండా మాట్లాడడం సరికాదు
- తప్పుడు ఆరోపణలు చేసిన వారు క్షమాపణ చెప్పాల్సిందే..
- దస్తావేజు లేఖరుల సంఘం డిమాండ్



**వనపర్తి బ్యూరో, నవంబర్ 19 (జనంసాక్షి) :** క్రయ విక్రయ దారుల మధ్య వారధిగా ఉంటూ స్థిరాస్తుల కు సంబంధించిన డాక్యుమెంట్లను సిద్ధం చేయడానికి దస్తావేజు లేఖరుల పాత్ర ముఖ్యమైనదిగా దస్తా వేజ్ లేఖరుల సంఘం సభ్యులు అన్నారు.బుధవారం వనపర్తి పట్టణంలోని దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కొందరు తప్పుడు ఆరోపణలు చేశారని, ఒక డాక్యుమెంట్ను సిద్ధం చేయడానికి దస్తా వేజు లేఖరుల పాత్ర చాలా ముఖ్యమని గత 50 సంవత్సరాల నుండి కొనుగోలు, అమ్మకంధారులకు సేవలందిస్తున్నామని గుర్తు చేశారు. నాడు పెన్నుతో డాక్యుమెంట్ను సిద్ధం చేసేవారిమని, నేడు పెరిగిన టెక్నాలజీ ద్వారా కంప్యూటర్ సాయంతో అన్ని రకాల సేవలను, ప్రజలకు అందిస్తూ జీవనోపాధి పొందుతున్నామని తెలిపారు.కొందరు అవగాహన రహితంగా మాట్లాడుతున్నారని, వారు మేము తయారు చేసిన డాక్యుమెంట్లు తోనే బ్యాంకులలో మరి ఎక్కడైనా చెల్లుబాటు అవుతున్నాయని, అది వాళ్ళు గమనించాలన్నారు. ఈ డాక్యుమెంట్లతోనే 250 కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నారని, అటువంటి వ్యవస్థను కించపరిచే విధంగా మాట్లాడడం సరికాదన్నారు. చేసిన తప్పును సరిదిద్దుకొని వారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర దస్తావేజులేఖరుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ జహంగీర్, వనపర్తి జిల్లా అధ్యక్షులు సంద రమేష్, వనపర్తి సబ్ ఆఫీస్ అధ్యక్షులు కాటమోని కృష్ణ గౌడ్, సీనియర్ డాక్యుమెంట్ రైటర్ ఆదిల్, ప్రధాన కార్యదర్శి పి ఎల్ శివ జయ రాములు, మన్నెంకొండ,సురేష్, ఉందేకోటి మహేష్ ,మన్నెంకొండ సాగర్, గణేష్ మనీ వర్ధన్, ఎడవల్లి రమేష్, కరుణాకర్, రవి నాయక్, మహేష్ యాదవ్, జి శ్రీకాంత్, సిద్ధార్థ నాయక్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోలు సక్రమంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి

- సీసీఐలో పత్తి కొనుగోలు వేగవంతం చేయాలి
- పత్తి అమ్మకానికి ఆధార్ ప్రామాణికత తప్పనిసరి
- సిసిఐ కేంద్రాలలో రైతులకు అన్ని వసతులు కల్పించాలి
- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య



**సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 19 (జనం సాక్షి) :** పత్తి కొనుగోలు సక్రమంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సంబంధిత అధికారులకు సూచించారు. 2025 - 26 సీజన్‌లో పత్తి, ధాన్యం తదితర పంటల కొనుగోళ్లను పారదర్శకంగా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సంబంధిత శాఖలతో విడివిడిగా సమీక్షలు నిర్వహించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ సమావేశాల్లో పౌరసరఫరాల శాఖ , సహకారశాఖ, వ్యవసాయ, మార్కెటింగ్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో 2025-26 సీజన్ పత్తి సాగు, దిగుబడిపై సమగ్ర అంచనా ప్రకారం, పత్తి కొనుగోలు సజావుగా జరిగేలా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆరు మార్కెటింగ్ యార్డుల పరిధిలోని 24 జిన్నింగ్ మిల్లుల నుండి సీసీఐ ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు వేగవంతం చేయాలని అన్నారు. పత్తి అమ్మకానికి ఆధార్ ప్రామాణికత తప్పనిసరి అని, చెల్లింపులు రైతుల ఆధార్‌తో అనుసంధానం చేసిన బ్యాంకు ఖాతాలలోనే జమ అవుతాయని తెలిపారు. జిల్లాలోని అన్ని జిన్నింగ్ మిల్లులను తనిఖీ చేసి యంత్రాలు, వసతులు, భద్రత ప్రమాణాలు సరిగా ఉన్నాయో లీగల్ మెట్రాలజీ శాఖ పర్యవేక్షణలో పరిశీలించాలని ఆదేశించారు. అగ్నిమాపక శాఖ అధికారులు మిల్లులను సందర్శించి భద్రత సూచనలు ఇవ్వాలని సూచించారు. రైతుల కోసం తాగునీరు, కనీస వసతులు కల్పించడమే కాకుండా, టోకెన్ సిస్టమ్ అమలు చేసి కొనుగోలు వ్యవస్థను క్రమబద్ధీకరించాలని కలెక్టర్ తెలిపారు. అంతేకాక, రైతులు కిసాన్ కంపాస్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసి నిర్ణీత సమయానికి పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. 2025-26 ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన ఏర్పాట్లను కూడా కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో 216 ధాన్యం కొనుగోలు కేంద్రాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని తెలిపారు. అన్ని కొనుగోలు కేంద్రాలకు అవసరమైన సాంకేతిక పరికరాలు, ప్యాడి క్లీనర్లు, తార్పాలిన్లు, మాచర్ మిషన్లు, గన్ని సంచులు, లారీలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. గోనెసంచులను రైతులకు నేరుగా ఇవ్వకుండా, కొలత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని సూచించారు. పిపిసి సెంటర్ ఇన్‌చార్జీలు కొనుగోలు వివరాలు వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, మిల్లర్లు ధాన్యాన్ని వెంటనే స్వీకరించి ఎంట్రీలు చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటాచ్మెంట్‌లో ఉన్న నిర్దిష్ట రైస్ మిల్లర్లకే పీపీసీ సెంటర్ నిర్వాహకులు ధాన్యం పంపాలన్నారు. జిల్లాలో ఇప్పటికే సోయా చిక్కుడు 7, మొక్కజొన్న 9 కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని కలెక్టర్ తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అన్ని పంటల కొనుగోళ్లను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. రైతులకు ఇబ్బందుల్లేకుండా పంటల కొనుగోళ్లు జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

### భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) రోడ్ ఓవర్ బ్రిడ్జిలు (ఆర్ఓబిఎస్) నేషనల్ ఇన్వెస్ట్మెంట్ మాన్యుఫాక్చరింగ్ జోన్ (నిమ్జ్) వంటి కీలక ప్రాజెక్టుల భూసేకరణపై కూడా కలెక్టర్ సమీక్షించారు. భూ సేకరణలో ప్రజల హక్కులు కాపాడుకునేలా, రైతులకు న్యాయం జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని, మరోవైపు అభివృద్ధి ప్రాజెక్టులు ఆలస్యం కాకుండా సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. విక్రయ విలువలను ఆధారంగా పరిగణించి భూసేకరణను న్యాయంగా పూర్తి చేయాల్సిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ బాల సరోజ, డిఏం సివిల్ సప్లై అంబదాస్ రాజేశ్వర్ ,సహకారశాఖ అధికారి కిరణ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జహీరాబాద్ ఆర్‌డిఓ దేవుజా, నిమ్జ్ ప్రత్యేక అధికారిని విశాలాక్షి, మార్కెటింగ్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వయోవృద్ధుల అనుభవం వెలకట్టలేనిది



**గద్వాల నడిగడ్డ, నవంబర్ 19 (జనం సాక్షి) :** వయోవృద్ధులు తమ జీవిత అనుభవంతో పిల్లలకు మంచి విషయాలు చెబుతుంటారని, వెలకట్టలేని ఆ విషయాలను పాటిస్తే ప్రతి ఒక్కరూ ఎదిగేందుకు అవకాశం ఉంటుందని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ ఆధ్వర్యంలో, సీనియర్ సిటిజన్ ఫోరం సహకారంతో బుధవారం గద్వాల ఐడిఓసి సమావేశ మందిరంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మన దేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ క్రమంగా తగ్గుతోందని, ఈ పరిస్థితులకు కారణాలేంటో అధ్యయనం చేసి పరిష్కరించవలసిన అవసరం ఉందన్నారు. వయోవృద్ధుల సంక్షేమానికి ప్రవేశపెట్టిన అనేక చట్టాలు ఉన్నప్పటికీ ఏ తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను ఇబ్బంది పెట్టాలని చూడరన్నారు. యువత భవిష్యత్తులో వృద్ధులు కాక తప్పదని తెలుసుకుంటే వారి తల్లిదండ్రులను తాము ఇప్పుడు బాగా చూసుకుంటేనే తమ పిల్లలు కూడా తమ బాగోగులు చూస్తారని తెలుసుకోవాలన్నారు. అనంతరం వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ముఖ్య అతిధులు బహుమతులు అందజేశారు.అలాగే వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన సీనియర్ సిటిజన్స్ ను శాలువా, జ్ఞాపికతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి శంకర్, ఆర్డిఓ అలివేలు,జిల్లా సంక్షేమ అధికారిని సునంద,సీనియర్ సిటిజన్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు మోహన్ రావు,ఇండియన్ రెడ్ క్రాస్ సంఘం జిల్లా చైర్మన్ అయ్యపురెడ్డి, బ్రహ్మకుమారిస్ గద్వాల ప్రతినిధి మంజుల, సీనియర్ పాత్రికేయులు ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

## భారతదేశ ఉక్కు మహిళ ఇందిరాగాంధీ



**పటాన్‌చెరు, నవంబర్ 19 (జనంసాక్షి) :** తన పరిపాలన దక్షతతో భారతదేశ ఉక్కుమహిళగా పేరుగాంచిన వీరవనిత మాజీ ప్రధాని భారతరత్న స్వర్గీయ ఇందిరాగాంధీ అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం ఇందిరాగాంధీ జయంతి పురస్కరించుకొని చిట్కూల్ లోని ఆయన నివాసం వద్ద, పేదలకు ఆమె అందించిన సంక్షేమాని స్మరించుకుంటూ ఆమె చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ పేదలకు సంక్షేమం, అభివృద్ధిని దగ్గరికి చేసి భారతీయుల గుండెలో పదిలంగా నిలిచిపోయారని తెలిపారు. ఆనాడు ఆ మహానేత ముందు చూపుతో చేపట్టిన సంక్షేమ పథకాల ఫలితంగా దేశం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. ఇందిరమ్మ పాలన స్ఫూర్తితో తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పాలన కొనసాగిస్తూ అన్ని వర్గాలకు సంక్షేమాన్ని, అభివృద్ధిని అందిస్తుందని వివరించారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోనే అభివృద్ధి సాధ్యం

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**కల్వకుర్తి, నవంబర్ 19 (జనం సాక్షి) :** కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఎంపిడిఓ లు, పురపాలక సంఘం కమిషనర్,గృహ నిర్మాణ శాఖ డిఈలు,ఎఈ లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల విషయం పై ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల గ్రామాలలో పురపాలక సంఘం పరిధిలో ఉన్న అన్ని వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. బేస్మెంట్ స్థాయిలో ఎన్ని,లెంటల్, స్లాబ్ లేవల్ అయిన లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో వారి ఖాతాలో జమ అయ్యాయే విధంగా చర్యలు తీసుకోవాలని, ఇంకా పనులు ప్రారంభం కాని వాటిని త్వరగా పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేసింది అని పనులు పూర్తి స్థాయిలో చేసుకోని బిల్లులు అందే విధంగా అధికారులు పర్యవేక్షణ చెయ్యాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో అన్ని మండలాల ఆర్డీవోలు ఎమ్మార్వోలు ఎంపిడిఓలు, కమిషనర్,గృహ నిర్మాణ శాఖ డిఈలు ఎఈ లు, కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ వావిళ్ళ సంజీవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అశోక్ రెడ్డి, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ మెంబర్ గుమ్మకొండ రాములు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ చీరల పంపిణీ పారదర్శకంగా జరగాలి

- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

**సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 19 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లాలో ఇందిరమ్మ చీరల పంపిణీని పూర్తిగా పారదర్శకంగా నిర్వహించి, మహిళలందరికీ ఎలాంటి లోపాల్లేకుండా చీరలు చేరేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, మహిళా సమాఖ్య ప్రతినిధులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ చీరల పంపిణీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్లు, మహిళా సమాఖ్యలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదరపు కలెక్టర్ చంద్రశేఖర్, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, డిపిఓ సాయిబాబా, పిడి మెప్మా ఇన్చార్జ్ , ఈ డి కార్పొరేషన్ అధికారి రామాచారి, అదనపు డిఆర్డిఓలు బాలరాజు, సూర్యారావు,జిల్లా మహిళా సమైక్య సభ్యులు, ఏపీఎంలు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## గుండాల గుండం చుట్టూ రక్షణ కవచం ఏర్పాటు



**వెల్దండ, నవంబర్ 19 (జనం సాక్షి) :** వెల్దండ మండల పరిధిలోని గుండాల గ్రామంలో గల శ్రీ అంబా రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద గల గుండానికి చుట్టూ రక్షణ కవచాన్ని తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేయించిన చెదురుపల్లి గ్రామ వాస్తవ్యులు దెంది పరిమిళా పరమేశ్వర్ రెడ్డి దంపతులు . సుమారు లక్ష 30 వేల రూపాయలు వ్యయంతో గుండానికి గ్రిల్స్, జాలి రక్షణ కవచంగా ఏర్పాటు చేశారు. ప్రమాద నివారణ కొరకు కోనేరు చుట్టూ రక్షణ కవచం, జాలి ,గ్రిల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. గత సంవత్సరందేవాలయంలో ఎంతో ప్రతిష్టాత్మక పెద్ద రథోత్సవానికి సుమారు రూ. 1 లక్ష రూపాయల ఖర్చుతో మరమ్మతులు చేయించారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు పరిమళ పరమేశ్వర్ రెడ్డి దంపతులను సన్మానించడం జరిగింది.

# ప్రభుత్వ ఉద్యోగుల జోలికొస్తే చర్యలు తప్పవు

- ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై హత్యాయత్నానికి పాల్పడ్డ రౌడీ షీటర్లు
- కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించిన పోలీసులు
- విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన జహీరాబాద్ డిఎస్పి సైదా

**రాయికోడు, నవంబర్ 19 (జనం సాక్షి) :** విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేస్తే కఠిన చర్యలు తప్పవని జహీరాబాద్ డిఎస్పి సైదా హెచ్చరించారు. ఒక దళిత ఆర్టీసీ డ్రైవర్ ను కులం పేరుతో దూషించి ఆపై హత్యాయత్నానికి పాల్పడ్డ ఇద్దరు రౌడీ సీటర్లపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు డిఎస్పి సైదా తెలిపారు. జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు తో కలిసి డిఎస్పి రాయికోడు పోలీస్ స్టేషన్లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. డీఎస్పీ కథనం ప్రకారం ఈ నెల 17న ఉదయం జహీరాబాద్ డిపోకు సంబంధించిన ఆర్టీసీ బస్సును మండలంలోని మాందాపూర్ గ్రామానికి చెందిన డ్రైవర్ ప్రశాంత్ కోడూరు గ్రామానికి తీసుకెళ్తున్నాడు.హస్నాబాద్ వద్దకు రాగానే ఉదయం ఎనిమిది గంటల పది నిమిషాల సమయంలో హస్నాబాద్ గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు రౌడీ శీటర్లు బోయిని శేఖర్, బోయిని సురేష్ లు ఇద్దరు కలిసి రోడ్డుపై బొలెరో కారును అడ్డంపెట్టి రాకపోకలకు అంతరాయం కలిగించి డ్రైవర్ పై పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని చంపడానికి ప్రయత్నించి రాయితో బలంగా కొట్టారన్నారు.దీంతో డ్రైవర్ చాకచక్యంగా తప్పించు కున్నాడన్నారు.అదే క్రమంలో డ్రైవర్ ప్రశాంత్‌పై చెప్పుతో కుడి భుజం పై దాడి చేసి,కులం పేరుతో దూషించి, విధులకు ఆటంకం కలిగించారన్నారు. ప్రశాంత్ ఫిర్యాదు మేరకు ఇరువురు రౌడీ షీటర్ లపై కేసు నమోదు చేసుకొని వారి వద్ద నుండి మూడు మొబైల్ ఫోన్లు,టీఎస్ 15 ఎఫ్ హెచ్ 9068 నెంబర్ గల కారును,ఒక చెప్పును స్వాధీనపరుచుకొని నిందితులను రిమాండ్ తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.ఈ సందర్భంగా డిఎస్పి సీఐలు మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకారపాలకు పాల్పడుతున్న ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.ఈ ఇద్దరు రౌడీషీటర్లు ఇంతకుముందు ఎవరినైనా బెదిరించిన మందలించినట్లు ఉన్నట్లయితే సంబంధిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని వారిపై మరొక కేసు నమోదు చేయనున్నట్లు చెప్పారు.ఈ కేసులో చాకచకంగా వ్యవహరించి నిందితులిద్దరిని పట్టుకోడానికి సహకరించిన రాయికోడు ఎస్సై చైతన్య కిరణ్, ఝరాసంగం ఎస్సై నారాయణ,హద్నూర్ ఎస్సైలను డిఎస్పి అభినందించారు. కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది ఉన్నారు.



## మోడల్ పాఠశాల హాస్టల్ భవనాన్ని ప్రారంభించి వినియోగంలోకి తేవాలి

- టీం సభ్యులతో కలిసి యువ నాయకుడు చక్రపాణి తనిఖీ



**రేగోడ్, నవంబర్ 19 (జనంసాక్షి) :** రేగొండ మోడల్ పాఠశాల హాస్టల్ భవనాన్ని ప్రారంభించి వినియోగంలోకి తేవాలని రేగోడు మండల యువ నాయకుడు చెన్నయగారి చక్రపాణి అన్నారు. ఈ సందర్భంగా బుధవారం రేగోడ్ మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలను తన టీం సభ్యులతో కలిసి ఆకస్మికంగా తనిఖి చేశారు.ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ హాస్టల్ భవనాన్ని ప్రారంభించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్‌ను కోరారు. అక్షయ పాత్ర నుండి వస్తున్న భోజనాన్ని తిని, ఆహార నాణ్యతను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేయడంతో అక్షయ పాత్ర ఫౌండేషన్ వారిని అభినందించారు. విద్యార్థులందరూ భోజన సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మోడల్ పాఠశాల యాజమాన్యం కోరిక మేరకు స్టేజి పైకప్పు నిర్మాణాన్ని తన సొంత ఖర్చులతో నిర్మిస్తానని, పాఠశాల సమయంలో విద్యార్థులు బయటకి రాకుండా చూడాలని పాఠశాల యాజమాన్యాన్ని కోరారు.

# పదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి పనులపై శ్వేత పత్రంతో చర్చకు రండి

- బహిరంగ సవాలు విసిరిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి బ్యూరో, నవంబర్ 19 (జనంసాక్షి) :** వనపర్తి నియోజకవర్గంలో రెండేళ్ల అభివృద్ధి పనులపై శ్వేతా పత్రంకు మేము సిద్ధమని,పదేళ్ల మీ పాలనలో జరిగిన అభివృద్ధి పనులపై శ్వేత పత్రంతో చర్చకు రండి అని, ఎమ్మెల్యే మేఘా రెడ్డి సవాల్ విసిరారు. బిఆరెస్ పార్టీలో పెద్దపెద్ద అవినీతి తిమింగలాలు ఉన్నాయని స్వయాన కెసిఆర్ కూతురు కల్వకుంట్ల కవిత పేర్లు బయటపెట్టిన ఇప్పటివరకు తేలు కుట్టిన దొంగల్లాగా ఏ ఒక్కరు కూడా నోరు మెదపలేదని అలాంటి అవినీతి తిమింగలాలు నేడు ప్రజల మధ్యన నీతులు వల్లించడం సిగ్గుచేటని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి విమర్శించారు.బుధవారం వనపర్తి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉక్కు మహిళ, భారత దేశపు తొలి మహిళా ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ దేశ అభివృద్ధి కోసం ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని ఆమె జయంతి సందర్భంగా మనందరం ఇందిరా గాంధీ ఆశయ సాధనాల కోసం పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులకు నేడు కొందరు నాయకులు అక్కడక్కడ బొక్కలు పెట్టి తామే సాగునీరు అందించామని గొప్పలు చెప్పుకుంటూ వారి పేర్లను మార్చుకోవడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే ఎద్దేవ చేశారు.తెలంగాణ రాష్ట్రంలో కళాకారులకు సముచిత స్థానం కల్పించి గౌరవించిన ఏకైక ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజాకవి గద్దర్, అందెశ్రీ లాంటి మహానుభావులకు ప్రభుత్వపరమైన గౌరవ మర్యాదలను అందిస్తూ వారి కీర్తిని నలు దిక్కుల చాటినా ఘనత కేవలం కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు.పదేళ్ల బిఆరెస్ పాలనలో కళాకారులను కష్టాలకు గురిచేసి కేవలం ఆట బొమ్మలుగా మార్చారని అన్నారు.నాటి నుంచి నేటి వరకు తెలంగాణ రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలకు ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించి నిర్మించి ఇచ్చిన ఘనత కేవలం కాంగ్రెస్ పార్టీ దేనిని ఎమ్మెల్యే పేర్కొన్నారు.కంటోన్మెంట్ ఎన్నికలైన జూబ్లీహిల్స్ ఎన్నికలైనా కాంగ్రెస్ పార్టీదే గెలుపొని,కాంగ్రెస్ పార్టీ గెలిస్తే బుల్డోజర్ పాలన జరుగుతుందని,ఎన్ని కల్లబొల్లి మాటలు చెప్పిన ప్రజలు మాత్రం కాంగ్రెస్ పార్టీ వైపే ఉన్నారని మొన్నటి ఎన్నికలు నిరూపించాయనీ ఎమ్మెల్యే తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన నిర్వహిస్తుందని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంటు, మహిళల ఉచిత బస్సు సౌకర్యం, రేషన్ కార్డులు, సన్న బియ్యం , రుణమాఫీ, రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్, విద్యార్థులకు 42 శాతం మెస్ చార్జీలు, ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం లాంటి అనేక పథకాలు చేపట్టి నిరుపేదలకు అండదండగా నిలుస్తుందన్నారు.ఎమ్మెల్యేగా పదవీ బాధ్యతలు చేపట్టిన నాడు ఈ నియోజకవర్గానికి పెద్ద జీతగాడిలా పనిచేస్తారని చెప్పానని నేటికీ అదే తరహాలో పనిచేస్తున్నానని ఎక్కడైనా ఏదైనా లోపం ఉన్న తమ దృష్టికి నేరుగా తీసుకురావాలన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచే అభ్యర్థులను గెలిపించాలని ఏదైనా బంధు ప్రీతితో వేరే వాళ్లకు అవకాశం కలిపిస్తే వారు అభివృద్ధికి ఆటంకాలుగా మారుతారే తప్ప వారి వల్ల జరిగేదేమీ ఉండదని దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకే ఓటు వేసి గెలిపించాలని సూచించారు.కాంగ్రెస్ పథకాల అమలులో అధికారులు గాని ప్రజాప్రతినిధులు గాని ఎక్కడైనా అవినీతి అక్రమాలకు పాల్పడితే నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు.ఈ కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్,, పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదుని రెడ్డి, ఉపాధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి రామకృష్ణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ య్య, శంకర్ నాయక్, తిరుపతయ్య గౌడ్, వనపర్తి పట్టణ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు,ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# సాండ్ బజార్ ద్వారా ఇసుక అక్రమ రవాణాకు చెక్

- రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద
- నూతన సాండ్ బజారు ప్రారంభోత్సవం
- మహిళలకు చీరల పంపిణీ..ఇందిరా గాంధీ 108వ జయంతి వేడుకలు



**చెన్నూర్ నవంబర్ 19 (జనం సాక్షి) :** సాండ్ బజార్ ఏర్పాటు ద్వారా ఇసుక అక్రమ రవాణా నియంత్రించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని చెన్నూరు మండలం బావురావుపేట గ్రామంలో ఏర్పాటు చేసిన సాండ్ బజార్ ను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాను నియంత్రించేందుకు సాండ్ బజార్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గత సంవత్సరం కంటే 18 శాతం అధికంగా పన్ను వసూలు జరిగిందని, ఈ అభివృద్ధిలో అధికారుల పాత్ర అభినందనీయమని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలోని సోమనపల్లిలో 250 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను మంజూరు చేసి పనులు కొనసాగుతున్నాయని, ప్రభుత్వ పాఠశాలలలో అవసరమైన మరమ్మత్తులు, ఆర్. ఓ. ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అభివృద్ధి పనుల కొరకు 2 కోట్ల 50 లక్షల రూపాయలు, జూనియర్ కళాశాల కొరకు 1 కోటి 50 లక్షల రూపాయలు మంజూరు చేసి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. చెన్నూర్ లో 50 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పించడం జరిగిందని తెలిపారు. చెన్నూరు ప్రాంతంలో డయాలసిస్ ప్లాంట్ ఏర్పాటు చేసి 6 యంత్రాల ద్వారా బాధితులకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని, గ్రామాలలో సోలార్ లైట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సాండ్ బజార్ ద్వారా ఇసుక అక్రమ రవాణాను అరికట్టి ప్రణాళిక బద్ధంగా వినియోగదారులకు ఇసుకను అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆన్‌లైన్ బుకింగ్‌లో అందిన వివరాల ప్రకారం వినియోగదారులకు ఇసుక పంపిణీ జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

చెన్నూరు మండలం కిష్టంపేట గ్రామంలోని రైతు వేదికలో అధికారులతో కలిసి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల అభివృద్ధి, సంక్షేమం కొరకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. గడిచిన 2 సంవత్సరాలలో ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలకు 8 వేల కోట్ల రూపాయల లబ్ధి చేకూరిందని తెలిపారు. అనంతరం చెన్నూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో డివిజన్, మండల స్థాయి అధికారులతో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతుందని, ప్రతి పథకాన్ని మారుమూల ప్రాంతాలకు తీసుకువెళ్లి అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందే విధంగా అధికార యంత్రాంగం సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, గృహ జ్యోతి, ఆసరా పింఛన్లు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, గ్రామాలలో అంతర్గత రహదారులు, పారిశుద్ధ్యం ఇతర అన్ని రంగాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సదుపాయాల కల్పన దిశగా అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# దుమ్ము లేపుతున్నాయ్!

- ఇసుక లారీలు ఆపి రోడ్డుపై బైఠాయించిన మహిళలు
- ఇసుక లారీల దుమ్ము ధూళి తో అనారోగ్యానికి గురవుతున్నాం
- వెంటనే జాతీయ రహదారిపై మరమ్మతుల నిర్మాణ పనులు చేపట్టాలి



**మంగపేట నవంబర్ 19(జనంసాక్షి) :** ఇసుక లారీలతో వచ్చే దుమ్ము ధూళితో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని స్థానికుల మహిళలు బుధవారం జాతీయ రహదారిపై గంటసేపు ఇసుక లారీలను ఆపి రోడ్డుపైనే బైఠాయించారు. కోమటిపల్లి క్రాస్ రోడ్డు నుండి గ్రోమోర్ సెంటర్ మూలములకు వరకు డబల్ లైన్ రోడ్డు పూర్తిగా ధ్వంసమైనట్లు తెలిపారు. ఈ రోడ్డుపై నిత్యం వందలాది ఇసుక లారీలు ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాయని ఆ క్రమంలో వాహనాల రాకపోకల కారణంగా దుమ్ము, దూళి అంత షాపు లు, నివాసముండే ఇండ్లలోకి రావడం జరుగుతుందని ఆ దుమ్ము దూళి వలన అనారోగ్య సమస్యలు (శ్వాసకోశ వ్యాధులు) బారిన పడుతున్నామని స్థానికుల మహిళలు ఆరోపించారు. రోడ్ల మరమ్మత్తులపై నిరంతరం పర్యవేక్షించాల్సిన ఆర్ అండ్ బి అధికారులు రోడ్డును పట్టించుకోకపోవడంతోనే ఇసుక లారీలు ఇష్టానుసారంగా ప్రయాణాలను కొనసాగించడంతో రోడ్ల పైన మోకాళ్ళ లోతు గోతులు ఏర్పడుతున్నాయని కనీసం ఆ గోతులు పూడ్చకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ స్థానికులు ఆరోపించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై టివిఆర్ సూరి తన సిబ్బందిని సంఘటన స్థలానికి పంపించి నిరసన చేస్తున్న స్థానిక మహిళలతో మాట్లాడి రోడ్డు మరమ్మతులు పూర్తి అయ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో స్థానిక మహిళలు నిరసన ను విరమించారు.

### త్వరలోనే రోడ్డు మరమ్మతుల పరులను పూర్తి చేస్తాం : ఆర్ అండ్ బి ఏఈ వెంకటేష్

జాతీయ రహదారి పై మరమ్మతుల విషయమై ఆర్ అండ్ బి ఏఈ వెంకటేష్ ను వివరణ కోరగా రోడ్డు మరమ్మత్తుల నిర్మాణం కొరకు గత రెండు రోజుల క్రితమే నిధులు మంజూరుకావడం జరిగిందని మండల కేంద్రంలోని మండల కేంద్రంలోని హెచ్ పి కిసాన్ పెట్రోల్ బంక్ నుండి కోమటిపల్లి క్రాస్ రోడ్ వరకు సుమారు 70 మీటర్ల రోడ్డు మరమ్మత్తులకు 5 లక్షల రూపాయలు మంజూరయ్యాయని త్వరలోనే పనులను పూర్తి చేస్తామని తెలిపారు.

# గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు



**బెల్లంపల్లి, నవంబర్ 19, (జనంసాక్షి) :** గంజాయి కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు తాండూర్ సీఐ దేవయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బెల్లంపల్లి నియోజకవర్గం తాండూర్ మండలం మాదారం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. గోలేటి ప్రాంతానికి చెందిన అద్దూరి జగన్, జంగంపల్లి ప్రశాంత్ అనే ఇద్దరు యువకులు మాదారం వన్ ఇంక్లైన్ సమీపంలో గంజాయి తీసుకు వస్తున్నట్లు పక్కా సమాచారం తెలిసిందన్నారు. వెంటనే మాదారం ఎస్సై సౌజన్య సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి ఆ ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా ఆ ఇద్దరు వ్యక్తుల నుండి 120 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. ఎక్కడైనా గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందితే వెంటనే తమకు తెలియజేయాలని వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని సిఐ తెలిపారు.

# కడెం ప్రాజెక్టులో దూకి వ్యక్తి ఆత్మహత్య



**కడెం, నవంబర్ 19 (జనంసాక్షి) :** కడెం మండల కేంద్రంలోని నారాయణరెడ్డి ప్రాజెక్టులో దూకి ఆత్మహత్యాయత్నం చేసుకొని మృతి చెందిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే... ఎస్సై సాయి కిరణ్ తెలిపిన కథనం ప్రకారం. కడెం మండల కేంద్రానికి చెందిన పాలకుర్తి కృష్ణ (51) బుధవారం ఉదయం దాదాపు 9 గంటల సమయంలో ఇంటి నుండి బయలుదేరాడు మధ్యాహ్నం సమయానికీ ఇంటికి వెళ్లకపో వడం కుటుంబీకులు ఆందోళ నలో పడ్డారు. గాలింపు మొదలు పెడుతూ కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టు వైపు వెళ్లగా ప్రాజెక్టు పైన చెప్పులు గమనించి ప్రాజెక్టులో గాలించగా మృతుడి మృతదేహం లభ్యం కావడంతో మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు.

# రైతుల సంక్షేమమే సీఎం లక్ష్యం

- కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** రైతుల సంక్షేమమే సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి మండలం కొంపెల్లి, గుడాడ్ పల్లి, నేరేడుపల్లి, గొర్లవీడు గ్రామాల్లో బుధవారం ఉదయం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి శ్రమించి పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రజా ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుందని తెలిపారు. అనంతరం గొర్లవీడు గ్రామంలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ టాయిలెట్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు.

### ఘనంగా అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక, ప్రపంచ చర్యలను నడిపించే వృద్ధులు మన ఆకాంక్షలు, మన శ్రేయస్సు, మన హక్కులు అనే థీమ్‌తో భూపాలపల్లి ఐడిఓసి కార్యాలయంలో మహిళా శిశు వయోవృద్ధుల, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు. కార్యక్రమంలో శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, మహిళా, శిశు, వయో వృద్ధుల సంక్షేమ అధికారి మల్లేశ్వరి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రామచంద్ర మూర్తి, రామచందర్, ఎన్జీవో శ్యాం పాల్గొన్నారు.

### ఉక్కు మహిళ ఇందిరాగాంధీ: ఎమ్మెల్యే గండ్ర

పేదల అభ్యున్నతికి, దేశ సమగ్రత కోసం పాటుపడిన ఉక్కు మహిళ మాజీ ప్రధాని, భారతరత్న ఇందిరాగాంధీ అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా భూపాలపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై, ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం కేకు కట్ చేసి, స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశసేవకు తన జీవితాన్నే అంకితం చేసిన ఉక్కు మహిళ, దేశ ప్రథమ మహిళా ప్రధానమంత్రి ఇందిరాగాంధీ అని అన్నారు.

# విద్యకు అత్యధిక ప్రాధాన్యత

- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- మంచి మార్కులు సాధించి ఉన్నతస్థాయికి ఎదగాలి
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 19 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యకు అత్యధికప్రాధాన్యత ఇవ్వడంజరుగుతుం దని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్పూర్ ఎంఎల్ఏ కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. స్టేషన్ ఘనపూర్ మండలం నమిలిగొండ లోని కస్తూరిభా గాంధీ,ఆదర్శ పాఠశాలల కు సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి తో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య శంకుస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ సమాజంలో మహిళలు అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని, మహిళల పురోగతి నే దేశ పురోగతిగా భావించాలి అని అన్నారు. 2011 లో కేజీబీవీ స్థాపించినప్పటి నుంచి ఈ పాఠశాలకు రోడ్ సౌకర్యం లేకపోవడం బాధాకరమని, ఇది గత పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. రాష్ట్ర ప్రభు త్వం వ్యక్తుల కోసం కాకుండా వ్యవస్థబలోపేతం కోసం పని చేస్తోందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లా డుతూ చదువుకు మాత్రమే జీవితాలను మార్చే శక్తి ఉందని, చదువుతోనే ఆర్థిక స్వేచ్ఛ, సమాజంలో గౌరవం లభిస్తాయని తెలిపారు. ముఖ్యంగా విద్యా, ఉద్యోగం, ఆర్థిక స్వేచ్ఛ, ఆరోగ్యం తోనే మహిళా సాధికారత సాధ్యం అవుతుందని అన్నారు. బాలికలు సెల్ ఫోన్, సోషల్ మీడియా జోలికి వెళ్లకుండా కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. మున్సిపాలిటీ అభివృద్ధి లో భాగంగా కోటి రూపాయలతో జఫర్ గడ్ ప్రధాన రహదారి నుండి కస్తూరిభా గాంధీ పాఠశాల వరకు సిసి రోడ్డు నిర్మాణంతో పాటు లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, జిసిడిఓ గౌసియా బేగం, తాహసిల్దార్ వెంకటేశ్వర్లు, ఇన్చార్జ్ ఎంపీడీవో నర్సింగరావు, కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ రజిత, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ పురమని రజాక్ యాదవ్, విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఇతర అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో విలువైన సామాగ్రి మాయం?

- ఇంటిదొంగల పనేనని పుకార్లు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి సింగరేణి ఏరియాలో కోటి రూపాయల విలువగల కాపర్ వైర్, ఇనుప సామాగ్రి మాయం అయినట్లు తెలిసింది. ఇది ఇంటిదొంగల పనేనని స్థానికంగా పుకార్లు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భూపాలపల్లి సింగరేణి ఏరియా వర్క్ షాప్, కేటీకే 5 ఇంక్లైన్, కేటీకే ఓసి-2, వెయ్యి క్వార్టర్స్ ప్రాంతాల్లో సింగరేణి సంస్థ కు చెందిన విలువైన సామాగ్రి చోరీకి గురైంది. చోరీ దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయినట్లు తెలుస్తుంది. అయితే ఈ విషయంపై అధికారులు, సిబ్బంది రహస్యంగా వ్యవహరించడం వెనుక మతలబు ఏమిటోననే పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సింగరేణి సొమ్మును కాజేసిన ఇంటి దొంగలపై ఆరా తీసి, కొరడా ఝుళిపించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# ఎస్సీ కార్పొరేషన్ భూమి రెడ్డికి రిజిస్ట్రేషన్!

- గత ప్రభుత్వంలో ఎస్సీ మహిళకు ఎస్సీ కార్పొరేషన్ కింద భూమి అందజేత
- కన్న కొడుకుకు తెలవకుండా రెడ్డికి భూమి అమ్మకం
- భూమి రిజిస్ట్రేషన్ ఆపాలంటూ కుమారుడు తహసీల్దార్‌కు వినతి





**హనుమకొండ ప్రతినిధి నవంబర్ 19 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం దళితులకు మూడు ఎకరాల భూమి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందజేస్తూ దళితుల జీవితాల్లో వెలుగులు నింపి దళిత కుటుంబాలకు అండగా నిలిచారు అదే క్రమంలో హనుమకొండ జిల్లా నడికుడ చౌటుపర్తి గ్రామానికి చెందిన బుడిమ లక్ష్మికి 2017 సంవత్సరంలో రెండు ఎకరాల 34 గుంటలు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా గత ప్రభుత్వం అందజేయడం జరిగింది. ఆమెకు ముగ్గురు కుమారులు ఒక కుమారుడు చనిపోగా ఇద్దరు కుమారులు కలరు అప్పటినుండి ఆమె భూమి సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తుండేది 2024 సంవత్సరంలో కుమారుడు నరసింహ కు తెలవకుండా తల్లి భూమి అమ్మకానికి పెట్టి పెట్టడం జరిగింది అది తెలుసుకున్న కుమారుడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తహసిల్దార్ కార్యాలయంలో అట్టి భూమిని రిజిస్ట్రేషన్ చేయకూడదని అట్టి భూమి ఎస్సీ కార్పొరేషన్ భూమి అని వినతి పత్రాలు అందజేయడం జరిగింది అయినా నడి కూడ నూతన తహసిల్దార్ రవీందర్ రెడ్డి అట్టి భూమిని ఆపకుండా ఎస్సీ కార్పొరేషన్ కు సంబంధించిన భూమిని రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారికి రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది. హనుమకొండ జిల్లా నడికూడ మండల తాహసిల్దార్ కార్యాలయం వింత పోకడలకు కేరాఫ్ గా మారింది. ఫిర్యాదు బాధితుడునరసింహ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల క్రితం తమ భూమిని వేరే వాళ్లకు అమ్మకూడదని తన తల్లిని కోరగా ఆమె అమ్ముతున్నానని చెప్పడంతో వారు నడికుడ తాహసిల్దార్ కార్యాలయంలో తమకు సంబంధం లేకుండా భూమి ఎవరికి రిజిస్ట్రేషన్ చేయవద్దని అది ఎస్సీ కార్పొరేషన్ భూమి అని దరఖాస్తు చేసిన వినకుండా అధికారులు మామూళ్లకు అలవాటు పడి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని మా తల్లిని మోసం చేసి ఉన్న వ్యక్తిపై కార్పొరేషన్ భూమి రిజిస్ట్రేషన్ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఆర్డిఓ ను వివరణ కోరగా బాధితులు భూమి రిజిస్ట్రేషన్ కోసం మీసేవ కేంద్రంలో స్లాట్ బుక్కు చేసుకోగా అది ఎస్సీ కార్పొరేషన్ భూమి అని చూపించక పోయేసరికి నూతనంగా వచ్చిన తహసిల్దార్ రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది అట్టి భూమిపై విచారణ చేపట్టి కొన్న వారిపై చర్యలు తీసుకుంటూ అట్టి భూమి రిజిస్ట్రేషన్ రద్దు చేయడం జరుగుతుందని ఆర్డిఓ డాక్టర్ కే నారాయణ తెలిపారు.

# బ్రిడ్జి కింద బిజినెస్!

- ఎండకు వానకు రక్షణ
- చిరు వ్యాపారులకు ఉపాధి
- ఇది వరంగల్ బీట్ బజార్ ఫ్లైఓవర్ బ్రిడ్జ్





**వరంగల్ ఈస్ట్, నవంబర్ 19 (జనం సాక్షి) :** వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని రైల్వే గేట్ నుండి బట్టల బజారు వరకు నిర్మించిన ఫ్లై ఓవర్ బ్రిడ్జి చిరు వ్యాపారులకు, స్థానిక వ్యాపారస్తులకు ఎంతో ఉపయోగకరంగా మారింది. అండర్ రైల్వే గేట్ లోని అటు కరిమాబాద్, ఉరుసు ప్రాంతవాసులు ఎన్నో ఏళ్లుగా రైల్వే గేట్ మీద నుంచి ఫ్లై ఓవర బ్రిడ్జి నిర్మాణం కావాలని పోరాటాలు చేసిన సంగతి తెలిసిందే. అయితే రైల్వే గేట్ మీద నుంచి బట్టల బజారు వైపు, అలాగే ఖమ్మం బైపాస్ రోడ్డు తో పాటు కరీమాబాద్ వైపు మూడు వైపులా వై ఆకారంలో బ్రిడ్జి నిర్మాణం జరిగింది. అయితే అప్పుడు వరంగల్లోని బట్టల బజార్ బీట్ బజార్ ప్రాంతాలకు చెందిన వ్యాపారస్తులు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అడ్డుకునే ప్రయత్నం చేశారు. కానీ బ్రిడ్జ్ నిర్మాణం అయితేనే అండర్ రైల్వే గేట్ ప్రాంత ప్రజలకు మేలు జరుగుతుందని అంతేకాకుండా రైల్వే గేటు వద్ద నిత్యం ఉండే ట్రాఫిక్ రద్దీతో పాటు ప్రమాదాల నివారణ కూడా జరుగుతుందని డిమాండ్ చేయడం, పోరాటాలు ఉద్యమాలు చేయడంతో ఎట్టకేలకు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం జరిగింది. అయితే ప్రస్తుతం రైల్వే ఓవర్ బ్రిడ్జ్ చిరు వ్యాపారులకు ఉపాధి అవకాశాలను ఇవ్వడమే కాకుండా స్థానికంగా ఉన్న వ్యాపార సంస్థల వాళ్లకు అండగా మారింది. పండ్ల వ్యాపారులు, చౌదాపూడి, టీ స్టాల్స్, పానీపూరి బండి, కొబ్బరి బోండాలు, ఉల్లిగడ్డ మొదలైన చిరు వ్యాపారులు ఈ బ్రిడ్జి కింద తమ వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అంతేకాకుండా ఆయా ప్రాంత వ్యాపారస్తులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వరంగల్ కు వచ్చిన వినియోగదారులు తమ వాహనాలను బ్రిడ్జి కింద పార్కింగ్ చేసుకుంటున్న పరిస్థితి ఉంది. అయితే అప్పుడప్పుడు బ్రిడ్జి కింద వాహనాలను నిలపడం వల్ల కొంత ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. వాహనాల రాకపోకలు తోపాటు ప్రజలకు రాకపోకలకు కూడా ఇబ్బంది కలిగినా చిరు వ్యాపారులకు కొంత ఉపాధి లభిస్తుంది. అంతేకాకుండా ఎండకు వానకు తల దాచుకునే విధంగా బ్రిడ్జి ప్రస్తుతం సహకరిస్తుంది. ఏదిఏమైనా ఒకప్పుడు బ్రిడ్జ్ నిర్మాణం వద్దని చెప్పిన వాళ్ల తోపాటు చిరు వ్యాపారస్తులకు ప్రస్తుతం బ్రిడ్జ్ ఎంతో ఉపయోగపడుతుంది అన్నది వాస్తవం.

## నాట్య విపంచి పురస్కారం సాధించిన త్రివేణి విద్యార్థులు



**ఖమ్మం, నవంబర్ 19 (జనం సాక్షి) :** శ్రీ డాన్స్ అకాడమీ వెల్ఫేర్ అసోసియేషన్ వారు బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన బాల్య నాట్యోత్సవం -25 లో ఖమ్మం త్రివేణి పాఠశాల 9వ తరగతికి చెందిన హేమశ్రీ లేఖ మరియు 7వ తరగతికి చెందిన హరిణి కీర్తి, నాట్య విపంచి పురస్కారం సాధించారు. కార్యక్రమం అనంతరం జరిగిన కార్యక్రమంలో హేమశ్రీ లేఖని మరియు హరిణి కీర్తిని, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి గారు విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ గారు మాట్లాడుతూ త్రివేణి విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ చూపటానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారని, ఆ మార్గంలోనే విద్య ప్రణాళిక రచించబడిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు పాఠశాల సి ఆర్ ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న ముస్తఫా క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్ సందీప్ మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దుబ్బాక వాసుకి కొడంగల్ వ్యవసాయ కళాశాలలో సీటు



**రామన్నపేట, నవంబర్ 19 (జనంసాక్షి) :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో , బీఎస్సీ అగ్రికల్చర్ మొదటి సంవత్సరం కోసం నిర్వహించిన కౌన్సిలింగ్ లో రామన్నపేట మండలం దుబ్బాక గ్రామానికి చెందిన గుండాల రమేష్, లక్ష్మీల కుమారుడు గుండాల మణిదీప్ వికారాబాద్ జిల్లా కొడంగల్ వ్యవసాయ కళాశాలలో సీటును సాధించాడు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో కొడంగల్ వ్యవసాయ కళాశాలను 30 సీట్లతో ఈ సంవత్సరమే ప్రారంభించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో జరిగిన కౌన్సిలింగ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ అల్దాస్ జానయ్య చేతుల మీదుగా గుండాల మణిదీప్ వ్యవసాయ కళాశాల ప్రవేశపత్రాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ అల్దాస్ జానయ్య మణిదీపను అభినందించారు. బాగా కష్టపడి చదువుతూ నిరంతర సాధనతో విజయాన్ని సాధించి విశ్వవిద్యాలయానికి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మణిదీప్ వైస్ కౌన్సిలర్ కు ధన్యవాదాలు తెలిపారు.

## గోవులను తరలిస్తున్న వాహనం పట్టివేత



చౌటుప్పల్, నవంబర్ 19 (జనం సాక్షి) : అక్రమంగా గోవులను తరలిస్తున్న కంటైనర్‌ను పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని లింగోజీగూడెం శివారులోని హైవే-9 హోటల్ సమీపంలో పోలీసులు బుధవారం తెల్లవారుజామున వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా గోవులను తరలిస్తున్న కంటైనర్ వాహనం పట్టుబడింది,వైజాగ్ సంతలో 82 గోవులను కొనుగోలు చేసి హైదరాబాద్‌లోని బహదూర్పురాకు తరలిస్తుండగా పట్టుకున్నారు.ఈ మేరకు ఎల్బీనగర్ కు చెందిన వాహన యజమాని అర్బర్ పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉద్యోగ సాధనలో విజయం సాధించాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవేటి రామారావు



**సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 19 (జనంసాక్షి) :** గ్రంథాలయాల సహకారంతో మహిళలు ఉద్యోగ సాధనలో విజయం సాధించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవేటి రామారావు అన్నారు.బుధవారం మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా జిల్లా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.మహిళా పాఠకులు మహిళల విద్య, మహిళా సాధికారికత, మహిళల హక్కులను ప్రతిబింబించే విధంగా ముగ్గులను వేశారు.ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవేటి రామారావు,కార్యదర్శి బాలమ్మ మాట్లాడుతూ మహిళలు తాము ఎంచుకున్న రంగంలో ఎదగాలని అన్నారు.పలువురు పాఠకులు మాట్లాడుతూ గ్రంథాలయం ఉద్యోగ నియామక పరీక్షలు రాసే వారికి చదువుకోవడానికి ఉపయోగపడుతుందని, తాము రోజుకు 12 గంటలు గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతూ,ఉద్యోగ సాధనలో ఉన్నట్లు తెలిపారు.పదవి విరమణ పొందిన గ్రంథాలయ ఉద్యోగులు ఎల్లమ్మ అటెండర్, లలితాదేవి లైబ్రేరియన్, వీరస్వామి లైబ్రేరియన్ ను ఘనంగా సన్మానించారు. ముగ్గురు పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో స్ఫూర్తి క్లబ్ సభ్యులు అడ్వకేట్ రమాదేవి, ఆండాళ్, ప్రమీల, లైబ్రేరియన్లు శ్యాంసుందర్ రెడ్డి విజయభాస్కర్, రంగారావు, సృజన, సుమతి, పుష్పలీల,రోజారమణి తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక దందాకు అడ్డుకట్ట వేసేదెప్పుడూ..?

- మక్తా కొత్తగూడెంలో నిత్యం ఇసుక దందా....
- అధికారులకు ఎంత చెప్పినా పట్టించుకోని వైనం...
- ఒక్కో ట్రాక్టర్ కు 20వేలు అధికారులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు..
- ఉన్నతాధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్



**ఆత్మకూరు (ఎస్), నవంబర్ 19 (జనంసాక్షి) :** మండల పరిధిలోని మక్తా కొత్తగూడెం గ్రామం నుండి ప్రతిరోజు ఎదేచ్ఛగా ఇసుక రవాణా కొనసాగుతుంది. ఇసుక ట్రాక్టర్లను గ్రామస్తులు అడ్డుకుంటే గ్రామస్తుల పై ఇసుక ఆక్రమణ దారులు దాడుల కు పాల్పడుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పాతర్లపాడు, ముక్కుడుదేవులపల్లి, రామన్నగూడెం, ఏపూర్ గ్రామాల వారికి ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక తరలించేందుకు అనుమతి ఇచ్చిన అధికారులు మక్త కొత్తగూడెంలో అనుమతులు ఇవ్వడం లేదని ఆరోపించారు. కారణం ఏమిటంటే ఇసుక ట్రాక్టర్ ల వద్ద నెల మామూలు తీసుకుంటున్న అధికారులు అనుమతులు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఒక ట్రాక్టర్ కు 20 వేల రూపాయల చొప్పున మక్త కొత్తగూడెం తో పాటు పరిసర గ్రామాలు, తండాలకు చెందిన సుమారు 20 ట్రాక్టర్లకు అధికారులు నెల మాముల్ల ఒప్పందం చేసుకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మక్త కొత్తగూడెంలో ఇందిరమ్మ ఇళ్లకు అనుమతులు ఇస్తే తక్కువ రేటుకు ఇసుక అమ్మాల్సి వస్తుంది కాబట్టి అధికారులకు ఇచ్చే ముడుపులు ఇవ్వలేరని ఉద్దేశంతో ఇందిరమ్మ ఇళ్లకు అనుమతులు ఆపారని, అధికారుల సహకారంతోనే ఇసుక అక్రమ రవాణా కొనసాగుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. మంగళవారం మక్త కొత్తగూడెం మాజీ సర్పంచ్ ఏటి వద్ద ఇసుక తరలించ కుండా ఘాతులు తీస్తే పోలీసులు వచ్చి గాతలు తీయకుండా అడ్డుకున్నట్లు వారు ఆరోపించారు. ఇసుక రావానా అడ్డుకోవాల్సిన పోలీసులే అడ్డుకుంటున్న గ్రామస్తులపై బెదిరించడం పట్ల గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.ఏటిలో ఇసుక నింపుతున్నట్లు నింపిన ట్రాక్టర్లు చెట్ల పొదల్లో నిలిపివేసినట్లు పక్క సమాచారం వచ్చినప్పటికీ అధికారులు ఇసుక ట్రాక్టర్లు యజమానులకు సమాచారం ఇచ్చి పక్కదోవ పట్టిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత నెల రోజులుగా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతున్నట్లు వేలం పాటలో రెండున్నర లక్షలకు పాట పాడినట్లు పాడిన వారి పేర్లు వివరాలు ఇచ్చిన నేటికి అధికారులకు చర్యలు తీసుకోకపోవడం విశేషం. ప్రతినెల లక్షల్లో ఆదాయం వస్తున్న అడ్డుకోలేని అధికారులు అడపాదప ఇతర మండలాలకు చెందిన ట్రాక్టర్లను పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఉన్నత స్థాయి అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేయనట్లయితే ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక దొరకడం కష్టంగా మారినట్లు ఆరోపిస్తున్నారు. ఇసుక దందాలు మండల స్థాయి అధికారులు అందరూ కుమ్మక్కయి ఇసుక అక్రమ రవాణాల్లో వాటాలు పంచుకు%శీ%టున్నట్లుఆయా గ్రాములు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎన్ని ఫిర్యాదులు చేసినప్పటికీ మక్త కొత్తగూడెం ఏటి నుండి ఇసుక రవాణా ఆగడం లేదని స్థానికలు ఆరోపిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా దారులకు ముడుపులు తీసుకొని సహకరిస్తున్న మండల అధికారుల పై చర్య తీసుకోవాలని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయనునట్లు గ్రామస్తులు ఆరోపించారు. ఇసుక అక్రమ రవాణా పై స్థానికులు ఫిర్యాదు చేసిన పత్రికల్లో వార్తలు వచ్చిన అధికారులుమక్త కొత్తగూడెం ట్రాక్టర్ల పై ఒక్క కేసు కూడా నమోదు చేయకపోవడం పట్ల అధికారుల చేతి వాటం స్పష్టం అవుతుందని ఆరోపిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా లను అడ్డుకున్నట్లైతే ఇందిర మహిళ లబ్ధిదారులందరూ కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టినట్లు తెలిపారు.

## తల్లిదండ్రుల పోషణ సంరక్షణ పిల్లల బాధ్యత

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 19 (జనంసాక్షి) :** తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ తీసుకోవాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.బుధవారం కలెక్టరేట్ లో నిర్వహించిన అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం-2025కు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వయో వృద్దులకు సంబందించిన చట్టాలు, పథకాలు అమలుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకొని ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు.పెన్షన్ కు సంబంధించిన అకౌంట్ లోని డబ్బులను సైబర్ నేరగాలు ఫోన్ చెసి ఓటీపీ ద్వారా దొంగలిస్తున్నారని, సైబర్ మోసాల పట్ల సీనియర్ సిటిజన్స్ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.సూర్యాపేట జిల్లాలో 50 లక్షల రూపాయలతో ఓల్డ్ ఏజ్ హోం త్వరలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు.మల్టీ సర్వీస్ డే కేర్ సెంటర్ ను కూడా ప్రారంభిస్తామని తెలిపారు.అత్యవసర వైద్య చికిత్స అవసరం ఉన్న వారి కోసం ఆలనా పాలన ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. పిహెచ్ సి ల ద్వారా బిపి, షుగర్ ల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తున్నామని, డోర్ టూ డోర్ ఫివర్ సర్వే చేసినప్పుడు సీనియర్ సిటిజన్స్ యొక్క వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు.వయస్సు పెరిగే కొద్దీ సంతోషంగా జీవించాలి కాబట్టి పెద్దలను కుటుంబ సభ్యులు ఆప్యాయతతో, ప్రేమతో పలకరిస్తే వారు చాలా సంతోషంగా ఉంటారని సూచించారు.జిల్లాలో చాలా మంది స్వాతంత్ర్య సమరయోధులు ఉన్నారని, అభివృద్ధిలో వారి పాత్ర ఉందని,వారి అనుభవాలు యువతకు తెలియజేసి వారిని ముందుకు తీసుకెళ్లాలని కోరారు.వివిధ రంగాలకు చెందిన ప్రముఖ సీనియర్ సిటిజన్స్ ను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, డిడబ్ల్యూఓ నరసింహారావు,డిపిఓ యాదగిరి, డిప్యూటీ డిఎంహెచ్ఓ చంద్ర శేఖర్, డిసిహెచ్ఎస్ వెంకటేశ్వర్లు, ఆర్.సీతారామయ్య, రాంబాబు, విద్యాసాగర్, హమీద్ ఖాన్,కృష్ణారెడ్డి,అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రచార జాతకు ఘనస్వాగతం పలకాలి

**ఖమ్మం రూరల్, నవంబర్ 19 (జనం సాక్షి) :** ఈనెల 24న కూసుమంచి వద్దకు చేరుకోనున్న ప్రచార జాతకు ఘన స్వాగతం పలకాలని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా సిపిఐ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం ఖమ్మం రూరల్ మండలం కౌన్సిల్ సమావేశాన్ని గిరి ప్రసాద్ భవన్ లో సిపిఐ జిల్లా సమితి సభ్యుడు ఉన్నం రంగారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ... సిపిఐ శతాబ్ది ఉత్సవాల విజయవంతానికై నల్లగొండ నుంచి బస్సు జాత ఖమ్మం నగరానికి వస్తున్నట్లు తెలిపారు. ఈ జాతకు ఖమ్మం రూరల్ మండలంలోని సిపిఐ శాఖల నుంచి కామ్రేడ్స్ పెద్ద ఎత్తున తరలి వెళ్లి విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ... చరిత్రలో నిలిచిపోయే విధంగా శతాబ్ది వేడుకల ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. ఇది ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమానికి దక్కిన గౌరవంగా కొనియాడారు. కావున సిపిఐ శ్రేణులు ఊరు, వాడలలో విస్తృత ప్రచారాన్ని నిర్వహించి వేడుకకు కుటుంబ సభ్యులతో సహా కదలి




రావాలన్నారు. అనంతరం బస్సు జాత విజయవంతనికై ముఖ్య నాయకులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిద్ధినేని కర్ణ కుమార్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మెడకంటి చిన్న వెంకటరెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు పగిళ్ల వీరభద్రం, వెంపటి సురేందర్, మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## నల్లబెల్లం పటిక స్వాధీనం



**దేవరకొండ, నవంబర్ 19 (జనం సాక్షి) :** సారా తయారీకి ఉపయోగిం చే నల్లబెల్లం, పటికను ఓ వాహనంలో తరలిస్తుండగా చెన్నారం నుండి కొండమల్లేపల్లి కి వెళ్లే దారిలో చెన్నారం గేటు వద్ద దేవరకొండ ఎక్సైజ్ శాఖ బృందం పట్టుకున్నారు. 1800 కిలోల నల్ల బెల్లం, 80 కిలోల పట్టికను టీ ఎస్ 08 యూ ఏ 2909 నెంబర్ గల వాహనంలో ఇద్దరు అక్రమ రవాణా చేస్తుండగా పోలీసులు వారిని పట్టుకుని ఒకరిపై కేసు నమోదు, వాహనం సీజ్, నల్ల బెల్లం స్వాధీనం చేసుకున్నట్లు దేవరకొండ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

## విద్యుత్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష



**జహీరాబాద్ టౌన్, నవంబర్ 19 (జనం సాక్షి) :** విద్యుత్ అధికారులతో బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని విద్యుత్ శాఖ డివిజన్ అధికారులతో ఎమ్మెల్యే మాణిక్ రావ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ గ్రామాలలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న కరెంట్ వైర్లు ,స్థంభాలు, ట్రాన్స్ఫార్మర్ ల యొక్క మరమ్మతులను వెంటనే చేపట్టి, అలాగే అవసరమైన గ్రామాల్లో నూతన స్థంభాలలో ఓల్టేజిలుగా ఉన్న గ్రామాలు తండాలో అదనంగా సింగిల్ ఫేస్ ట్రాన్స్ఫార్మర్ లు ఏర్పాట్లు చేసి రైతులుకు,ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, పాక్స్ చైర్మన్ మచ్చెందర్,చిన్న రెడ్డి, రాథోడ్ భీమ్ రావు నాయక్, తదితర నాయకులు విద్యుత్ అధికారులు డిఈ లక్ష్మీ నారాయణ, ఏఈ లు, తదితరులు పాల్గొన్నారు.

# భూటకపు ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలి

- సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

**ఖమ్మం రూరల్, నవంబర్ 19 (జనం సాక్షి) :** దేశ ప్రజల సంపదను, వనరులను దోచుకుంటున్న బహుళజాతి కంపెనీలకు వ్యతిరేకంగా పోరాడే వారిని బూటకపు ఎన్కౌంటర్లలో కాల్చి చంపుతున్నారని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు విమర్శించారు. బుధవారం ఎం.వెంకటాయా పాలెంలో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాలకుల యొక్క దుర్మార్గపు విధానాలను ప్రశ్నించే వారిని నరమేధంతో నిర్మూలిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో దేశంలో ప్రధాని నరేంద్ర మోడీ అమిత్ షా కొనసాగిస్తున్న బూటకపు ఎంకౌంటర్ల హత్యాకాండపై సుప్రీంకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించి, తగిన విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే బూటకవు ఎన్కౌంటర్ల హత్యాకాండను, ఆపరేషన్ కాగార్ హత్యాకాండను ఆపాలని, కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరపటానికి ముందుకొస్తున్నప్పటికీ ప్రభుత్వం నిరాకరిస్తుందని, మొదట చర్చలకు సిద్ధమైన అని ప్రభుత్వం ప్రకటించి ఆచరణలో మోసం చేసిందని విమర్శించారు. రాజ్యాంగంలో హక్కుల ప్రకారం ప్రశ్నించడం, ప్రజాస్వామ్య ప్రక్రియ లోక్సభ స్వతంత్రం, దేశం రానున్న కాలంలో చీకటి రాజ్యంగా మారుతుందన్నారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కేంద్ర కమిటీ నాయకులు కేజీ రామచందర్ మాట్లాడుతూ, దేశంలో మావోయిస్టులు కమ్యూనిస్టులపై బిజెపి ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం నరమేధం కొనసాగిస్తుందని ఈ హ త్యాకాండను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడే వంద సంవత్సరాలు అవుతున్నదని, డిసెంబర్ 26న పురస్కరించుకొని 25న హైదరాబాదులో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సును నిర్వహిస్తున్నామని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో సభలను నిర్వహిస్తున్నామని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కెచ్చెల రంగయ్య మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోనికి రావడానికి ముందు అనేక వాగ్దానాలు చేశారని రైతాంగాన్ని ఆదుకోవడంలో విఫలమైందని విమర్శించారు. ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర నాయకులు గుమ్మడి నరసయ్య మాట్లాడుతూ, సెప్టెంబర్ నెల కర్రగుట్టల నుండి ప్రారంభమైన దాడులు,హత్యలు నేడు బీకరంగా కొనసాగుతూ మానవహరణం జరుగుతుందని, చరిత్రలో నరహంతకులు పోయారు తప్ప నక్సలైట్లు, ప్రజా నాయకులు నిర్మూలన జరగలేదని ఆయన అన్నారు. అభివృద్ధి నిరోధకులని ముద్ర లేసి అభివృద్ధి పాలకులుగా చలామణి అవుతూ ప్రజా నాయకుల పై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ప్రజలను మట్టుబెట్టడానికి



కుట్రలు చేస్తున్నారని, కమ్యూనిస్టులను, నక్సలైట్లును నిర్మూలిస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. హిడ్మా చనిపోయిన దృశ్యాన్ని చూస్తే, పండ్లు విరిగిపోయి,శరీరం చిద్రమైనదిగా ఉందని,ఇది ముమ్మాటికీ బూటక ఎన్కౌంటరని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం చర్చలతో పరిశీలిస్తామని మొదట చెప్పి, తర్వాత ఎన్కౌంటర్ హత్యలు చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో పార్టీ కేంద్ర కమిటీ నాయకురాలు కే రమ,కార్యదర్శి వర్గ సభ్యులు వి ప్రభాకర్, చిన్న చంద్రన్న, నందిరామయ్య, సదానందం,పిట్ల రామకృష్ణ, నాయిని రాజు, గుర్రం అచ్చయ్య ఆవుల వెంకటేశ్వర్లు సివై పుల్లయ్య, జిరామయ్య, ఆవుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.




# బ్యాటరీలతోనే బ్యాటరీలు తయారీ!


ప్రపంచవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల విప్లవం వేగవంతమవుతున్న నేపథ్యంలో వీటికి శక్తినిచ్చే లిథియం-అయాన్ బ్యాటరీల భవిష్యత్తుపై తీవ్ర చర్చ జరుగుతోంది. ఈవీల ఉత్పత్తి పెరిగే కొద్దీ పనికిరాని బ్యాటరీల సంఖ్య కూడా భారీగా పేరుకుపోతుంది. భవిష్యత్తులో ఈ సమస్య మరింత ఎక్కువయ్యే అవకాశం ఉంది. వీటిని సరైన రీతిలో నిర్వహించకపోతే పర్యావరణానికి పెనుముప్పు తప్పదు. అయితే, ఈ బ్యాటరీల నిర్వహణనే ఒక భారీ ఆర్థిక అవకాశంగా కొన్ని కంపెనీలు మలుచుకుంటున్నాయి. పరిశ్రమ వర్గాల అంచనా ప్రకారం.. త్వరలోనే ఈవీ బ్యాటరీ రీసైక్లింగ్ పరిశ్రమ వేల కోట్ల డాలర్ల వ్యాపారంగా అవతరించనుంది.

**పెరుగుతున్న బ్యాటరీల వాడకం**

ఎలక్ట్రిక్ వాహనాల్లో బ్యాటరీలే ప్రధానం. ఇంధన ధరల పెరుగుదల, కర్బన ఉద్గారాల తగ్గింపు లక్ష్యాల నేపథ్యంలో అన్ని దేశాలూ ఈవీల తయారీని ప్రోత్సహిస్తున్నాయి. ఫలితంగా అధిక శక్తి సాంద్రత, ఎక్కువ శ్రేణి(%=ఘుఅస్త్రవ%)ని అందించే అధునాతన లిథియం-అయాన్ బ్యాటరీలకు డిమాండ్ పెరుగుతోంది. కంపెనీలు నిరంతరం కొత్త రసాయన ఫార్ములాలు ఉపయోగిస్తూ బ్యాటరీల సామర్థ్యాన్ని పెంచుతున్నాయి. అయితే వాహనం జీవితకాలం ముగిసిన తర్వాత లేదా బ్యాటరీ సామర్థ్యం తగ్గిన తర్వాత దాన్ని ఎలా నిర్వహించాలనే ప్రశ్నలు మొదలవుతున్నాయి. ప్రస్తుతానికి పాత బ్యాటరీల నిర్వహణ గందరగోళంగా ఉంది.

**బ్యాటరీల రీసైక్లింగ్**

ఈవీ బ్యాటరీలను పర్యావరణ హితంగా రీసైకిల్ చేయడం సంక్లిష్ట ప్రక్రియ. వీటిలో విలువైన లోహాలు (కోబాల్ట్, నికెల్, లిథియం, మాంగనీస్) ఉంటాయి. ఈ లోహాలను తిరిగి వెలికి తీయడం రీసైక్లింగ్ ప్రధాన లక్ష్యం. అందుకు రెండు పద్ధతులను ఉపయోగిస్తున్నారు.



**హైడ్రోమెటలర్జీ**

ఇది అత్యంత ప్రజాదరణ పొందిన పద్ధతి. ముందుగా బ్యాటరీలను సురక్షితంగా విడిభాగాలుగా చేసి, పొడిగా చేస్తారు. తర్వాత శక్తివంతమైన రసాయన ద్రావణాలను (యాసిడ్స్) ఉపయోగించి చూర్ణం పొడి పదార్థాన్ని కరిగిస్తారు. ఈ ద్రావణం నుంచి లిథియం, కోబాల్ట్, నికెల్ వంటి విలువైన లోహాలను వేరుచేసి, శుద్ధి చేస్తారు. దీనివల్ల అధిక స్వచ్ఛత కలిగిన పదార్థాలను తిరిగి పొందవచ్చు.

**పైరోమెటలర్జీ**

ఈ ప్రక్రియను స్మెల్టింగ్ అని కూడా అంటారు. ఇందులో బ్యాటరీ భాగాలను నేరుగా అధిక ఉష్ణోగ్రతల వద్ద (సుమారు 1500 డిగ్రీ సెంటీగ్రేడ్ కంటే ఎక్కువ) కాల్చివేస్తారు. ఈ ప్రక్రియలో ప్లాస్టిక్, కార్బన్ వంటి పదార్థాలు కాలిపోతాయి. విలువైన లోహాలు ద్రవ రూపంలోకి మారి లోహ మిశ్రమం గా ఏర్పడతాయి. ఈ మిశ్రమం నుంచి కోబాల్ట్, నికెల్‌లను తిరిగి పొందుతారు. ఇందులో బ్యాటరీలను పూర్తిగా విడదీయాల్సిన అవసరం తక్కువగా ఉంటుంది. అయితే ఈ ప్రక్రియలో అధిక ఉష్ణోగ్రతలు వెలువడడంతో లిథియంను తిరిగి పొందడం కష్టమవుతుంది. పైన తెలిపిన పద్ధతులతో పాటు కేవలం లోహాలను భౌతికంగా వేరుచేసే డైరెక్ట్ రీసైక్లింగ్ వంటి నూతన పద్ధతులపై కూడా పరిశోధనలు జరుగుతున్నాయి.

**రీసైకిల్ చేయకపోతే కలిగే నష్టాలు**

పనితీరు తగ్గిపోయిన ఈవీ బ్యాటరీలను రీసైకిల్ చేయకుండా పారవేయడం వల్ల పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి తీవ్ర నష్టం కలుగుతుంది. బ్యాటరీలలో ఉండే భారీ లోహాలు, విషపూరిత రసాయనాలు (ఉదా: లిథియం లవణాలు, ఎలక్ట్రోలైట్స్) భూమిలోకి, జల వనరులలోకి చేరి నీటిని, నేలను కలుషితం చేస్తాయి. పాత బ్యాటరీలను కాల్చివేసినా లేదా అవి శిథిలమైనా ప్రమాదకరమైన వాయువులు వాతావరణంలోకి విడుదలవుతాయి. లిథియం-అయాన్ బ్యాటరీలు అగ్ని ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంటుంది. పారవేసిన ప్రదేశాల్లో ఇవి మండే ప్రమాదం ఉంది. రీసైకిల్ చేయకపోతే బ్యాటరీల్లోని కోబాల్ట్, నికెల్, లిథియం వంటి కీలకమైన ఖనిజ వనరులు శాశ్వతంగా కోల్పోయే ప్రమాదం ఉంది. దీనివల్ల కొత్త బ్యాటరీల తయారీకి కేవలం మైనింగ్ మీదే ఆధారపడాల్సి వస్తుంది.

**రీసైక్లింగ్ వల్ల లాభాలు**

బ్యాటరీ రీసైక్లింగ్ కేవలం పర్యావరణ పరిరక్షణ మాత్రమే కాదు, ఆర్థికంగా పరిశ్రమకు అనేక ప్రయోజనాలను అందిస్తుంది. లిథియం, కోబాల్ట్ వంటి లోహాల నిల్వలు ప్రపంచంలో కొన్ని ప్రాంతాలకే పరిమితమై ఉన్నాయి. రీసైక్లింగ్ ద్వారా ఈ విలువైన ముడిసరుకును దేశీయంగా తిరిగి పొందవచ్చు. ఇది సరఫరా గొలుసుపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. మైనింగ్, శుద్ధి ప్రక్రియలతో పోలిస్తే రీసైక్లింగ్ ద్వారా లోహాలను పొందడం దీర్ఘకాలంలో చౌకైన పద్ధతిగా మారే అవకాశం ఉంది. ఉదాహరణకు, రీసైకిల్ చేసిన కోబాల్ట్ కొత్తగా తవ్విన కోబాల్ట్ కంటే సుమారు 25% తక్కువ ఖర్చుతో లభించవచ్చని అంచనా. బ్యాటరీ రీసైక్లింగ్ అనేది కొత్త పరిశ్రమ. దీని నిర్వహణ, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో వేలాది కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయి.




## 400 రోజుల్లో 50 వేల యూనిట్లు

**ముంబై:** కార్ల తయారీ కంపెనీ జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా ఎలక్ట్రిక్ క్రాస్‌ఓవర్ యూటిలిటీ వెహికల్ ఎంజీ విండ్సర్ అమ్మకాలు కీలక మైలురాయి చేరుకున్నట్లు ప్రకటించింది. కేవలం 400 రోజుల్లోనే 50,000 యూనిట్ల అమ్మకాలు పూర్తి చేసుకున్నట్లు ప్రకటించింది. గణాంకాల ప్రకారం ప్రతి గంటకు సగటున 5 యూనిట్ల ఎంజీ విండ్సర్ కార్లు అమ్ముడైనట్లు తెలుస్తోంది. ఇది కంపెనీకి చారిత్రక విజయాన్ని సూచించడమే కాకుండా, భారతదేశంలో ఈవీ విభాగంలో అత్యంత వేగంగా ఈ మార్కును చేరుకున్న మొదటి ఈవీగా విండ్సర్ నిలిచిందని కంపెనీ తెలిపింది. ఈ సందర్భంగా జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్ మెహ్రోత్రా మాట్లాడుతూ..'విండ్సర్ ఈవీని ప్రారంభించినప్పుడు వినియోగదారులకు స్టైలిష్, విలువ ఆధారిత మొబిలిటీ సొల్యూషన్‌ను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. విండ్సర్ ఈవీ వేగంగా విజయం సాధించింది. రికార్డు సమయంలో 50,000 అమ్మకాలను చేరింది. ఈ విజయం న్యూ ఎనర్జీ వాహనాల పట్ల కంపెనీ నిబద్ధతను మరింతగా పెంచుకోవడానికి శక్తినిస్తుంది' అన్నారు. జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా తయారు చేసిన పరిమిత ఎడిషన్ సిరీస్ ఎంజీ విండ్సర్ ఇన్‌స్పైర్‌ను ఇటీవల భారత రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ ఆవిష్కరించినట్లు గుర్తు చేశారు.

ఎంజీ విండ్సర్ ఫీచర్లు

ఈ కారు 100 శక్తిని 200 ఎన్ఎం టార్క్‌ను అందిస్తుంది. దీని ప్రారంభ ధర రూ.9.99 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. ఫ్యూచరిస్టిక్ ఏరోగ్లైడ్ డిజైన్‌తో పాటు 135 డిగ్రీల వరకు వాలే ఏరో లాంజ్ సీట్లు ఉన్నాయి.

## సోషల్ మీడియా ద్వారా వ్యాపారావకాశాలు

యూట్యూబ్, ఫేస్‌బుక్‌లాంటి సోషల్ మీడియా ద్వారా వ్యాపారం చేసే అవకాశాలను కల్పించనున్నట్లు హైదరాబాదీ సంస్థ డబ్ల్యూకామర్స్ సహ వ్యవస్థాపకుడు శ్రీధర్ శ్రీరామనేని తెలిపారు. ఈ విధానంలో పెట్టుబడి, సరుకుల నిల్వ లాంటి బాదరబందీ ఉండదని.. చిరు వ్యాపారులు, విద్యార్థులు, గృహిణులు, ఉద్యోగులు ఎవరైనా దీన్ని ప్రారంభించవచ్చని వివరించారు. ఇందుకోసం కంపెనీ తాము ఆఫర్ చేసే ఉత్పత్తులను విక్రయించేందుకు, విక్రేతల పేరుతో ఆన్‌లైన్ స్టోర్ ఏర్పాటు చేస్తుంది. దాని లింకులు/క్యూఆర్ కోడ్‌లను విక్రేతలు తమ సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం లేదా తెలిసినవారికి షేర్ చేయాలి. వాటి ఆధారంగా జరిగే ఆయా ఉత్పత్తుల అమ్మకాలపై విక్రేతకు 20-40 శాతం లాభం ఉంటుంది. డెలివరీ బాధ్యతలను కంపెనీ తీసుకుంటుంది. ఇప్పటికే దేశవ్యాప్తంగా 22,000కు పైగా యాక్టివ్ ఆన్‌లైన్ స్టోర్స్ ఉన్నాయని, హెల్త్, వెల్‌నెస్ తదితర విభాగాల్లో 40కి పైగా బ్రాండ్స్, 600 పైచిలుకు ఉత్పత్తులు ఉన్నాయని శ్రీధర్ చెప్పారు.



## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 6.25 | ₹ 6.27 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| ₹ 1,14,450 (22 క్యారెట్లు) | ₹ 1,24,860 (24 క్యారెట్లు) |
|---|---|

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 1,76,000

## ఇంటికీ కావాలి ఆపరేటింగ్ ఆఫీసర్..



**న్యూఢిల్లీ:** కెరియర్‌లో బిజీగా ఉన్న వృత్తి నిపుణులకు ఇంటి నిర్వహణ ఒక పెద్ద సవాలుగా మారుతోంది. ఈ నేపథ్యంలో సమర్థవంతమైన ఇంటి నిర్వహణ కోసం కొత్తగా 'హోం మేనేజర్లు' రంగంలోకి దిగుతున్నారు. ఇది కేవలం ఇంటి పనులకే పరిమితం కాకుండా ఆధునిక పని సంస్కృతి అవసరాలకు అనుగుణంగా మారుతున్న ముఖ్యమైన ఉద్యోగంగా అవతరిస్తుంది. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో చాలా మంది వృత్తి నిపుణులు తమ వర్క్-లైఫ్ బ్యాలెన్స్ కాపాడుకోవడానికి కష్టపడుతున్నారు. గంటల తరబడి పనిచేయడం, కార్పొరేట్ సంస్థల ఒత్తిడి కారణంగా ఇంటిని నిర్వహించడానికి సమయం కేటాయించలేకపోతున్నారు. ఈ కారణాల వల్లే తమ ఇంటి బాధ్యతలను నిర్వహించడానికి, సమయాన్ని ఆదా చేసుకోవడానికి ప్రొఫెషనల్ సహాయం తీసుకోవడానికి వెనుకాడడం లేదు. ఇటీవల గ్రేల్యాబ్స్ ఏఐ స్టార్టప్ సహ-వ్యవస్థాపకుడు, ఐఐటీ గ్రాడ్యుయేట్ అమన్ గోయెల్, ఆయన భార్య హర్షితా శ్రీవాస్తవ నెలకు రూ.1 లక్ష వేతనంతో హోం మేనేజర్‌ను నియమించుకున్నట్లు చెప్పారు. పెరుగుతున్న స్టార్టప్ డిమాండ్ల మధ్య తమ వ్యక్తిగత జీవితాన్ని, ఇంటి నిర్వహణను సమతుల్యం చేసుకోవడం కష్టమైందని తెలిపారు. ఈ నేపథ్యంలో తమ ఇంటి బాధ్యతలను నిర్వహించడానికి ఒక ప్రొఫెషనల్‌ను నియమించుకోవాలని నిర్ణయించుకున్నట్లు పేర్కొన్నారు. గోయెల్ తన ఎక్స్ పోస్ట్‌లో ఈమేరకు వివరాలు వెల్లడించారు. 'నేను ఒక హోమ్ మేనేజర్‌ను నియమించాను. ఆమె ఫుడ్ ప్లానింగ్, వార్డ్‌రోబ్‌లు, మరమ్మతులు, నిర్వహణ, కిరాణా సామాగ్రి, లాండ్రీ వంటి ప్రతి విషయాన్ని చూసుకుంటారు. ప్రాథమికంగా ఆమె ఇంటి సహాయకులు. మాకు విలువైన సమయాన్ని ఆదా చేస్తారు' అని పేర్కొన్నారు.

**హోం మేనేజర్లు ఏం చేస్తారు?**

హోం మేనేజర్లు ఇంట్లో అన్ని పనులను నిర్వహిస్తారు. భోజన ప్రణాళిక, కిరాణా సామాగ్రి జాబితా తయారు చేయడం, వాటిని కొనుగోలు చేయించడం. ఇంటి మరమ్మతులు, నిర్వహణ పనులు, వస్తువుల రిపేర్లు, అపాయింట్‌మెంట్లను సమన్వయం చేయడం. వంట మనిషి, క్లీనింగ్ స్టాఫ్, గార్డెనర్ వంటి ఇంటి సహాయకులందరి పనులను పర్యవేక్షించడం, వారికి ఆదేశాలివ్వడం. వార్డ్‌రోబ్ నిర్వహణ, లాండ్రీ పర్యవేక్షణ, బిల్లుల చెల్లింపులు వంటి వ్యక్తిగత పనులను చూసుకోవడం. సంక్షిప్తంగా హోం మేనేజర్ అనే వ్యక్తి ఇంటి వ్యవహారాలన్నింటికీ ఒక చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌లా పనిచేస్తారు.

ఎంతో మేలు..

వృత్తి నిపుణులు తమ పనిపై దృష్టి పెట్టడానికి, వారి వృత్తిపరమైన లక్ష్యాలను సాధించడానికి ఈ మేనేజర్లు తమ సమయాన్ని ఆదా చేస్తారు. దీనివల్ల పనిలో ఉత్పాదకత పెరుగుతుంది.

# భారత్ చూపు మిడిల్‌ఈస్ట్ వైపు





**రష్యా నుంచి ఆయిల్ దిగుమతులపై ఆంక్షలు నేపథ్యంలో...**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** రష్యాకు చెందిన ప్రధాన చమురు ఉత్పత్తిదా రులపై ఆంక్షలు అమలులోకి రానుండటంతో భారతదేశం చమురు దిగుమతులను పెం చుకోవడానికి మిడిల్‌ఈస్ట్ దేశాలపై మొగ్గు చూపుతోంది. దాంతో మధ్యప్రా చ్యం(మిడిల్‌ఈస్ట్) నుంచి భారత్‌కు సరుకులు తీసుకు రావడానికి చమురు ట్యాంకర్ల(క్రూడాయిల్ సరఫరా చేసే షిప్‌లు) బుకింగ్స్ గణనీయంగా పెరిగాయి. పెరిగిన డిమాండ్ షిప్ బ్రోకర్ నివేదికల ప్రకారం ఈ వారం ఇప్పటివరకు సౌదీ అరేబియా, కువైట్, ఇరాక్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి దేశాల నుంచి ముడి చమురును రవాణా చేయడానికి సుమారు డజను ట్యాంకర్లను అద్దెకు తీసుకున్నారు. ఈ ట్యాంకర్లు అరేబియా సముద్రం మీ దుగా రవాణా కానున్నాయి. ఇది గత నెలలో ఇదే సమో ద్రైన కేవలం నాలుగు బుకింగ్‌లతో పోలిస్తే పెరిగింది. ఈ బుకింగ్‌ల్లో వెరీ లార్జ్ క్రూడ్ క్యారియర్స్ (వీఎల్‌సీసీ) అని పిలువబడే సూపర్ ట్యాంకర్లతో పాటు చిన్న సూయజ్‌మ్యాక్స్ నౌకలు కూడా ఉన్నాయి. భారతీయ దిగుమ తిదారులు ఇంకా అదే మార్గాల్లో మరిన్ని ట్యాంకర్లను అద్దెకు తీసుకోవాలని చూస్తున్నారని నివేదికలు చెబుతున్నాయి.

నవంబర్ 21 నుంచి ఆంక్షలు

నవంబర్ 21న రోస్‌నెఫ్ట్ పీజేఎస్సీ,లుకోయిల్ పీజేఎస్సీపై ఆంక్షలు అమలులోకి రానున్న నేపథ్యంలో భారత చమురు వ్యాపారులు రష్యాయేతర ముడి చమురు కొనుగోళ్లవైపు మళ్లుతున్నారు. భారతదేశంలోని రిఫైనరీల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌తో సహా ఐదు ప్రధాన రిఫైనరీలు ఈ వారం తర్వాత రష్యన్ ముడి చమురు డెలివరీ చేసుకోబోమని ఇప్పటికే ప్రకటించాయి. మిగిలిన కంపెనీలు మాత్రం ఆంక్షలు లేని రష్యా చమురు విక్రేతల నుంచి కొనుగోళ్లు కొనసాగించవచ్చని భావిస్తున్నారు.



## ఎన్ఐఏ కస్టడీకి అన్మోల్ బిష్ణోయ్

**ఢిల్లీ(జనంసాక్షి):** భారత్ మోస్ట్ వాంటెడ్ గ్యాం గ్స్టర్ లారెన్స్ బిష్ణోయ్ సోదరుడు, అన్మోల్ బిష్ణోయ్‌కు పటియాలో కో ర్టు 11 రోజుల ఎన్ఐఏ కస్టడీ విధించింది. 18కిపైగా కేసుల్లో నిందితుడుగా ఉన్న అన్మోల్ బిష్ణోయ్‌ను విచారించేందుకు తమను అప్పగించాలని భారత్ సుదీర్ఘ న్యా యపోరాటం చేసింది. ఈ నేపథ్యంలో అమెరికా ప్రభుత్వం ప్రత్యేక విమానంలో అన్మోల్ బిష్ణోయ్‌ను భారత్‌కు పంపించింది. ఢిల్లీ ఎయిర్‌పోర్టులో అన్మోల్‌ను అదుపులోకి తీసుకున్న ఎన్ఐఏ పటియాల కోర్టు ఎదుట హాజరు పరిచింది. పలు కీలక కేసుల్లో నిందితుడిగా ఉన్న అన్మోల్ బిష్ణోయ్‌ను విచారించేందుకు 15రోజుల కస్టడీ కోరింది. అయితే, కోర్టు మాత్రం ఎన్ఐఏకు 11 రోజుల గడువు ఇచ్చింది. కోర్టు ఆదేశాలతో ఎన్ఐఏ అన్మోల్ బిష్ణోయ్‌ను దర్యాప్తు చేపట్టనుంది.

## డ్రైవర్ జీతం రూ.53,350.. త్వరలో రూ.1 లక్ష!



**న్యూఢిల్లీ:** ప్రముఖ కంటెంట్ క్రియేటర్లలో ఒకరైన అంకుర్ వారికూ తన డ్రైవర్ వేతనం, కుటుంబంలో అతనికి ఉన్న గౌరవాన్ని తెలియజేస్తూ సామాజిక మాధ్యమంలో చేసిన పోస్ట్‌కు సోషల్ మీడియాలో ప్రశంసలు అందుతున్నాయి. ఇంతకూ నెటిజన్ల దృష్టిని ఆకర్షించేలా ఆయన చేసిన పోస్ట్ ఏమిటో చూద్దాం. అంకుర్ వారికూ చేసిన పోస్ట్‌లోని వివరాలు..'దయానంద్ భయ్యా(డ్రైవర్) తాజా వార్షిక ఇంక్రిమెంట్‌తో అతని నెలవారీ వేతనం రూ.53,350కు చేరింది. దీనికి ఇన్సూరెన్స్, ఒక నెల దీపావళి బోనస్, తాజాగా ఇచ్చిన స్కూటీ అదనం. అతను 13 సంవత్సరాల క్రితం రూ.15,000 నెలవారీ వేతనంతో ఈ ఉద్యోగంలో చేరారు. తాను కేవలం డ్రైవర్ మాత్రమే కాదు. మా కుటుంబంలో ఒకరు. నమ్మకమైన వ్యక్తి. అతని వద్ద ఇంటి తాళాలు ఉంటాయి. మా ఏటీఎం పిన్ నంబర్లు కూడా తనకు తెలుసు. అతను అత్యంత సమయపాలన, క్రమశిక్షణ గల వ్యక్తి. రోజూ ఉదయం 4:30 గంటలకు మేల్కొని, రాత్రి 8:30 గంటలకు నిద్రపోతారు. దయానంద్ భయ్యా ముగ్గురు పిల్లలు మంచి ఉద్యోగాల్లో స్థిరపడి, సంతోషంగా వివాహం చేసుకున్నారు. రాబోయే 5-6 సంవత్సరాల్లో అతని జీతం నెలకు రూ.1 లక్షకు చేరుకోవాలని ఆశిస్తున్నాను' అని వారికూ అన్నారు. 2024లో రూ.16.84 కోట్ల ఆదాయాన్ని ఆర్జించిన గుర్‌గావ్‌కు చెందిన వారికూ చేసిన పోస్ట్‌పై నెటిజన్లు ప్రశంసలు కురిస్తున్నారు. సూరజ్ బాలకృష్ణన్ అనే ఒక యూజర్ 'ఉద్యోగులతో ఇలా సరైన మార్గంలో వ్యవహరించాలి. నిన్ను చూసి గర్వంగా ఉంది అంకుర్' అని రాశారు. మరొకరు, 'రోజువారీ సహాయం చేసే వారిని విస్మరించే ఈరోజుల్లో నిజంగా గౌరవంతో చూస్తున్నారు. మీరు మీ డ్రైవర్‌పట్ల చాలా విధేయతతో ఉన్నారు. ఉద్యోగుల నమ్మకం, కృషిని గుర్తించడం చాలా సంతోషం' అని వ్యాఖ్యానించారు.

## స్పాట్ బుకింగ్ 5వేలే..

**న్యూఢిల్లీ:** శబరిమలలో భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో ట్రావెన్ కోర్ దేవస్థానం బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. స్వామివారి స్పాట్ బుకింగ్‌లను 5వేలకు తగ్గించింది. అంతే కాకుండా అడవి నడక మార్గంలో వస్తున్న భక్తులకు పాస్‌లు జారి చేస్తున్నట్లు తెలిపింది. శబరిమలకు స్వాముల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో ట్రావెన్ కోర్ దేవస్థానం స్పాట్ బుకింగ్‌లను రోజుకు 5 వేలకు తగ్గిస్తూ ఆదేశాలు జారీ చేసింది. తొలుత 20వేల వరకూ స్పాట్ బుకింగ్‌లు ఇవ్వాలని దేవస్థానం భావించింది. అయితే భక్తుల రద్దీ దృష్ట్యా స్పాట్ బుకింగ్‌లను సోమవారం వరకు రోజుకు 5వేలకు మాత్రమే పరిమితం చేయాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో దేవస్థానం ఈ నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా అడవి నడకమార్గంలో ప్రయాణించే స్వాములు ప్రత్యేక పాసులు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తుంది. శబరిమలకు అడవిమార్గంలో వచ్చే భక్తుల పాసులు సైతం 5వేలకు పరిమితం చేయాలని దేవస్థానం భావిస్తున్నట్లు తెలుస్తుంది. బుకింగ్‌లకు గాను ఒక కౌంటర్ పంప వద్ద మరో 7కౌంటర్లు నిలక్కల్ వద్ద ఏర్పాటు చేసినట్లు తెలిపింది. భక్తుల రద్దీని పరిగణలోకి తీసుకొని అవసరమైతే స్పాట్ బుకింగ్‌లు 10వేలకు పెంచుతామని తెలిపింది. మ్నెదట వచ్చిన భక్తులకే పాస్‌లు లభిస్తాయని ప్రకటించింది. అయ్యప్పస్వామి దర్శనం కోసం వచ్చే భక్తలకు నీలక్కల్ వద్ద అన్ని ఏర్పాట్లు చేశామని భక్తులకు

## కారు బీభత్సం భారత సంతతి గర్భిణి దుర్మరణం

**సిడ్నీ:** డ్రైవింగ్ సరిగ్గా రాకుండానే స్టీరింగ్ పట్టుకున్న ఒక మైనర్ అత్యుత్సాహం ఒక కుటుంబాన్ని అంతులేని విషాదంలోకి నెట్టేసింది. రెండో బిడ్డ రాక కోసం కలలు కంటున్న నిండు గర్భిణి తన కల తీరకుండానే అనంత లోకాలకు చేరింది. ఆస్ట్రేలియాలోని సిడ్నీలో జరిగిన ఘోర కారు ప్రమాదంలో 33 ఏళ్ల గర్భిణి భారతీయ మహిళ కన్నుమూసింది. ఎనిమిది నెలల గర్భిణి అయిన సమన్విత ధరేశ్వర్ తన భర్త, మూడేళ్ల కొడుకుతో కలిసి నడుచుకుంటూ వెళుతుండగా అదుపు తప్పిన లగ్జరీ కారు ఢీకొట్టింది. గత వారం ఈ విషాదం చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో హార్న్స్‌బైలోని జార్జ్ సెయింట్ వెంబడి ఉన్న ఫుట్‌పాత్‌పై వాకింగ్ చేస్తోంది ధరేశ్వర్. వేగంగా వస్తున్న కారు, ముందున్న కియా కార్నివాల్ కారును వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో కియా కారు ధరేశ్వర్‌ను బలంగా ఢీకొట్టిందని పోలీసులు తెలిపా రు. ఈ ప్రమాదంలో ధరేశ్వర్ కు తీవ్ర గాయాలు అయ్యాయని, వెంటనే వెస్ట్ మీడ్ ఆసుపత్రికి తరలించినా, వారిని కాపాడలేక పోయామన్నారు. ఈ ఘటనలో రెండు కార్ల డ్రైవర్లకు ఎలాంటి గాయాలు కాలేదు. ధరేశ్వర్ భర్త, ఆమె మూడేళ్ల బిడ్డ ఎలా ఉన్నారనే దానిపై సమాచారం లేదు.

## చాట్‌జీపీటీ డౌన్ అయితే పరిస్థితేంటి?

ఇంటర్నెట్ మౌలిక సదుపాయాల్లో కీలక పాత్ర పోషించే క్లౌడ్‌ఫ్లేర్‌లో ఇటీవల తలెత్తిన సమస్యల కారణంగా ప్రపంచవ్యాప్తంగా వెబ్ సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విస్తృతంగా అంతర్గత సర్వర్ లోపాలు ఏర్పడటానికి ఇది దారితీసింది. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రధాన ప్లాట్‌ఫామ్‌ల సేవలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. యూఎస్, యూరప్, ఆసియాలో ఈ అంతరాయం ప్రభావం ఎక్కువగా కనిపించింది. ఈ అంతరాయం కారణంగా (గతంలో ట్విట్టర్), స్పాటిఫై.. వంటి కీలక సేవలతో పాటు సేవలు కూడా కొద్ది సమయం నిలిచిపోయాయి. క్లౌడ్‌ఫ్లేర్ సమస్య కారణంగా సందర్శించిన వినియోగదారులకు 'దయచేసి ముందుకు సాగడానికి అన్‌బ్లాక్ చేయండి' అనే సందేశం దర్శనమిచ్చింది. ఈ నేపథ్యంలో జనరేటివ్ ఏఐలో కీలకంగా వ్యవహరిస్తున్న చాట్‌జీపీటీ(క్లౌడ్‌ఫ్లెయిర్ ఇన్‌ఫ్రా వాడుతుంది) సర్వీసులు మధ్యంతరంగా నిలిచిపోతే పనులు సజావుగా సాగేందుకు ప్రత్యామ్నాయాలు చూద్దాం.




**గూగుల్ జెమిని:** గూగుల్ జెమిని అధునాతన మోడల్స్‌తో రూపొందించారు. గూగుల్ సెర్చ్‌కు రియల్ టైమ్ కనెక్షన్ కలిగి ఉంది. దీని కారణంగా ఇది ఎల్లప్పుడూ అప్‌డేటెడ్, రియల్‌టైమ్ సమాచారాన్ని అందిస్తుంది. అంతేకాకుండా ఇది జీమెయిల్, డాక్స్, డ్రైవ్ వంటి గూగుల్ ఎకోసిస్టమ్‌తో అనుసంధానం కలిగి ఉంటుంది.

**ఆంత్రోపిక్ క్లాడ్ ఏఐ:** క్లాడ్ ఏఐ సెక్యూరిటీ, కచ్చితత్వం, నైతిక ఏఐ మోడల్స్‌పై ప్రత్యేకంగా దృష్టి పెడుతుంది. ఇది నిర్వహించగల సామర్థ్యం కలిగి ఉంది.

**మైక్రోసాఫ్ట్ కోపైలట్:** మైక్రోసాఫ్ట్ కోపైలట్ అంతర్లీనంగా చాట్‌జీపీటీలాగే అదే జనరేటివ్ ఏఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తుంది. ఇది మైక్రోసాఫ్ట్ 365 ఎకోసిస్టమ్‌లో ఇంటర్నల్‌గా ఉండే ఏఐ అసిస్టెంట్. మైక్రోసాఫ్ట్ వర్క్‌ఫ్లోలో ఉన్నవారు కార్పొరేట్ పత్రాలను రూపొందించడానికి, డేటాను విశ్లేషించడానికి ఇది అనువైనది.

**జాస్పర్ ఏఐ:** జాస్పర్ ఏఐ ప్రొఫెషనల్ కంటెంట్ రూపొందించడంలో ప్రత్యేకత కలిగి ఉంది. ఇది బ్లాగ్‌లు, కథనాలు, సోషల్ మీడియా పోస్ట్‌లు, మార్కెటింగ్ కాపీలు అందిస్తుంది. మార్కెటర్లు, బ్లాగర్లు, కంటెంట్ క్రియేటర్లకు ఇది తోడ్పడుతుంది.

## ఆస్తులుంటే వెంటనే వీలునామా రాయండి

**మహిళలకు సుప్రీం కోర్టు కీలక సూచన**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశంలో హిందూ మహిళల ఆస్తులపై గత కొన్నేళ్లుగా వివాదాలు చోటుచేసుకుంటున్న వేళ సుప్రీంకోర్టు కీలక సూచన చేసింది. హిందూ మహిళ ఆస్తి కోసం పుట్టింటివారు, అత్తింటి వారు కోర్టు మెట్లు ఎక్కుతున్న ఘటనలు అనేకం జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తాజాగా కీలక వ్యాఖ్యలు చేసింది. మహిళలు తమ మరణానంతరం ఆస్తిపై వివాదం లేకుండా ఉండాలంటే.. వారు బతికి ఉండగానే ఆస్తి ఎవరికి చెందాలనే విషయంలో స్పష్టంగా వీలునామా రాయాలని సూచించింది. మహిళకు పిల్లలు లేకపోతే ప్రస్తుత హిందూ వారసత్వ చట్టం ప్రకారం ఆమె ఆస్తి మొదటగా భర్త కుటుంబానికి వెళ్లే అవకాశం ఉంటుందని కోర్టు గుర్తుచేసింది. కానీ చాలా సందర్భాల్లో ఆస్తి విషయమై మహిళ పుట్టింటి వాళ్లకు, అత్తింటి వారికి మధ్య వివాదాలు చెలరేగుతున్నాయని పేర్కొంది. వివాహానంతరం మహిళ గోత్రం మారుతుందన్న సంప్రదాయ అంశాన్ని కూడా కోర్టు ప్రస్తావిస్తూ.. వివాహం తర్వాత మహిళపై ప్రధాన బాధ్యత భర్త కుటుంబానిదే అవుతుందని పేర్కొంది.

## 'ప్రిన్స్' విందులో.. ట్రంప్ 'పుత్రోత్సాహం'

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌లో ఉన్నట్టుండి పుత్రోత్సాహం పెల్లుబికింది. దీనికి వైట్ హౌస్‌లో సౌదీ క్రౌన్ ప్రిన్స్ మొహమ్మద్ బిన్ సల్మాన్ కోసం ఏర్పాటు చేసిన విందు కార్యక్రమం వేదికగా నిలిచింది. ఈ విందుకు సాకర్ సూపర్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో హాజరుకావడం ఆసక్తికరంగా మారింది. ఈ సందర్భంగా ట్రంప్.. రొనాల్డోను ప్రత్యేకంగా అభినందించారు. తన కుమారుడు బారన్.. రొనాల్డోకు పెద్ద అభిమాని అని ట్రంప్ వెల్లడించారు. తాను ఆ క్రీడా దిగ్గజాన్ని తన కుమారునికి పరిచయం చేయగలిగినందుకు చాలా సంతోషంగా ఉన్నానని అన్నారు. తన కుమారుడు బారన్ సాకర్ సూపర్ స్టార్ క్రిస్టియానో రొనాల్డోను కలుసుకున్నాడు. ఇకపై బారన్ తనను మరింత అధికంగా గౌరవిస్తాడని అనుకుంటున్నానని ట్రంప్ చమత్కరించారు. సౌదీ క్లబ్ అల్-నాసర్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ, సౌదీ సాకర్ లీగ్‌లో కీలక ఆటగాడిగా ఉన్న రొనాల్డో వైట్ హౌస్‌లో జరిగిన విందుకు హాజరు కావడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఇది అంతర్జాతీయ దృష్టిని కూడా ఆకర్షించింది.



## జ్యోతిబాపులే పార్కు భూమి కేటాయింపు
# జీఓ రద్దు చేయాలి

- మాజీ మేయర్ రవీందర్ సింగ్ డిమాండ్
- కలెక్టర్ నిర్ణయంపై తీవ్ర ఆగ్రహం
- పార్కు భూమి విద్యుత్ శాఖకు ఇవ్వడం నిబంధనల ఉల్లంఘన
- శానిటేషన్ పేరుతో అక్రమ వసూళ్లపై మండిపాటు
- అవసరమైతే హైకోర్టును ఆశ్రయిస్తాం: హెచ్చరిక



**కరీంనగర్, నవంబర్ 19 (జనంసాక్షి):** మహాత్మా జ్యోతిబాపులే పార్కులోని నాలుగు గుంటల భూమిని విద్యుత్ శాఖకు కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ జారీ చేసిన జీఓను వెంటనే రద్దు చేయాలని మాజీ మేయర్, మాజీ రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రజాపాలన పేరుతో అధికారులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని, నగర ప్రజల అభిప్రాయాలు సేకరించకుండానే కలెక్టర్ నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయం తీసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో కరీంనగర్‌ను నిజమైన స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దామని, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు మహాత్మా జ్యోతిబాపులే పార్కును అభివృద్ధి చేసి స్మార్ట్ సిటీ బోర్డుకు అప్పగించామని గుర్తు చేసుకొచ్చారు. అయితే ఇప్పుడు ఆ పార్కులోని నాలుగు గుంటలను విద్యుత్ శాఖకు కట్టబెట్టడం సరికాదని, చట్టంలో ఎక్కడా పార్కు భూమిని ఇతర అవసరాలకు ఉపయోగించే అవకాశం లేదని స్పష్టం చేశారు. ఈ జీఓను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనియెడల పార్కు రక్షణ కోసం హైకోర్టులో పిల్ దాఖలు చేస్తామని హెచ్చరించారు. నగర మేధావులు, బుద్ధిజీవులు ఈ విషయంపై స్పందించాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. అదనంగా మున్సిపల్ కార్పొరేషన్‌లో కొత్త సర్క్యులర్ జారీ చేసి శానిటేషన్ పేరుతో ప్రతి ఇంటికీ నెలకు రూ.60 చొప్పున వసూలు చేస్తున్నారని, జిల్లాలో లక్షకుపైగా ఇళ్లు ఉంటే నెలకు రూ.60 లక్షలకుపైగా సొమ్ము కాజేస్తున్నారని ఆరోపించారు. కౌన్సిల్ లేని పరిస్థితుల్లో, ఎలాంటి తీర్మానం లేకుండా ఇష్టారాజ్యంగా వసూళ్లకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ అక్రమ వసూళ్లను వెంటనే ఆపాలని, రేట్లను బహిరంగంగా ప్రకటించాలని జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌ను డిమాండ్ చేశారు.

## మిడ్ మానేరులో 25.873 టీఎంసీలకే భూసేకరణ

- 27.55 టీఎంసీలు నీరు నిల్వ
- రైతుల పట్టా భూముల్లోకి నీరు
- శాంతినగర్ వద్ద కరకట్టతో రైతులకు ఇబ్బందులు
- బిజెపి రాష్ట్ర నాయకుడు ఎర్రం మహేష్



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి నవంబర్ 19 (జనంసాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మానువాడ వద్ద నిర్మించిన మధ్యమానేరు జలాశయం కోసం అప్పటి ప్రభుత్వం (25.873 టీఎంసీల సామర్థ్యం మేరకు) మాత్రమే భూసేకరణ చేశారని బిజెపి రాష్ట్ర నాయకుడు ఎర్రం మహేష్ అన్నారు.మిడ్ మానేరు ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ద్వారా రైతుల పట్టా భూముల్లోని పంట పొలాల్లోకి నీరు చేరడంతో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో నాటి ప్రభుత్వం 2008లో 25.873 టీఎంసీలు 318 మీటర్లు మేరకే జలాశ య నిర్మాణం చేపట్టారన్నారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన అనంతరం 2023 వరకు గత ప్రభుత్వం 25 టీఎంసీల నీటిని మాత్రమే నిల్వ చేస్తూ వచ్చారన్నారు. 2023 నుంచి సామర్థ్యాన్ని 27 టీఎంసీలకు పెంచుతూ రావడంతో రైతుల పట్టా భూముల్లోకి నీరు వస్తుందన్నారు. ప్రస్తుతం 27.55 టీఎంసీల నీటిని నిల్వ చేయడంతో రైతులకు మరింత నష్టం కలుగుతుందన్నారు.గత ప్రభుత్వ హయాంలో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని శాంతినగర్ వద్ద , కొదుముంజ రామప్ప గుట్ట నుంచి కరకట్ట నిర్మాణం చేయడం వల్ల రైతులకు ఇబ్బంది కలుగుతుంద న్నారు. మున్సిపల్ పరిధిలోని సుమారు 250 ఎకరాల భూమికి పరిహారం అధిక మొత్తంలో చెల్లించాల్సి వస్తుందని కరకట్ట నిర్మాణం చేపట్టారన్నారు. ఈ విషయాన్ని అధికారులు దాచి ఉన్నతాధికారులకు స్పష్టంగా చెప్పడం లేదన్నారు. 318 మీటర్లతో పాటు బఫర్ జోన్ దాటి రైతుల భూముల్లోకి నీరు వస్తుందన్నారు.

అధికారులు ప్రాజెక్టు వద్ద 318 మీటర్ల మేరకు నీరు ఉన్నాయా లేదా అని చూస్తున్నారు తప్ప రైతుల పట్టా భూముల్లోకి నీరు ఏ విధంగా వస్తుందని ఆలోచన చేయడం లేదన్నారు. ప్రజావాణిలో బిజెపి, రైతులతో కలసి ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో ఇంచార్జి కలెక్టర్ స్పందించి జిల్లా అదనపు కలెక్టర్‌ను పరిశీలనకు పంపరన్నారు. అదనపు కలెక్టర్ పూర్తి స్థాయి పరిశీలించి రైతులకు అన్యా యం జరుగుతుందని, ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పడ న్నారు. ప్రభుత్వం, అధికారులు వెంటనే జలాశయం నుంచి నీటిని రెండు టీఎంసీల నీరు తరలిస్తే పట్టా భూముల్లోని నీరు బయటకు వెళ్తుందన్నారు. అధికారులు జలాశయంలో నీళ్లు లేని సమయంలో మరో మారు సర్వే నిర్వహించి సరైన హద్దు రాళ్ళు పాతాలని అయన డిమాండ్ చేశారు.

## వికారాబాద్‌లో 3,325 వాహనాలు సీజ్

- నెంబర్ ప్లేట్ ఉల్లంఘనలపై స్పెషల్ డ్రైవ్
- పరిగి సబ్-డివిజన్‌లోనే 1,843 వాహనాలు పట్టుబడ్డాయి
- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : ఎస్పీ హెచ్చరిక



**వికారాబాద్, నవంబర్ 19 (జనంసాక్షి) :** నిబంధనలకు విరుద్ధంగా నెంబర్ ప్లేట్లు లేకుండా, టాంపరింగ్ చేసిన లేదా అక్రమ నెంబర్ ప్లేట్లతో తిరుగు తున్న వాహనాలపై వికారాబాద్ జిల్లా పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అక్టోబర్ నెలలోనే 3,325 వాహనాలను సీజ్ చేశారు. రోడ్డు భద్రత, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ఈ తనిఖీలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి తెలిపారు. జిల్లాలోని మూడు సబ్-డివిజన్లలో అత్యధికంగా పరిగి సబ్-డివిజన్ పరిధిలో 1,843 వాహనాలు సీజ్ అయ్యాయి. ఇందులో పరిగి పోలీస్ స్టేషన్‌లో 575, చేన్గుముల్‌లో 512, కుల్కచర్లలో 204, దోమలో 189, బొంరాస్‌పేటలో 158, దౌల్తాబాద్‌లో 69, దుద్యాల్‌లో 73 వాహనాలు ఉన్నాయి. వికారాబాద్ సబ్-డివిజన్‌లో 1,085 వాహనాలు పట్టుబడగా, వికారాబాద్ పోలీస్ స్టేషన్‌లోనే 639, కోట్పల్లిలో 84, బంట్వారంలో 87, ధారూర్‌లో 69, నవాబ్‌పేట్‌లో 67, మార్పల్లిలో 65, మోమిన్‌పేట్‌లో 74 వాహనాలు సీజ్ చేశారు. తాండూర్ సబ్-డివిజన్‌లో 397 వాహనాలు సీజ్ అయ్యాయి. కారన్‌కోట్‌లో 130, తాండూర్‌లో 119, బషీరాబాద్‌లో 99, పెద్దేముల్‌లో 44, యాలాల్‌లో 5 వాహనాలు ఈ జాబితాలో ఉన్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ (హెచ్ఎస్ఆర్పీ) ప్రమాణాలకు అనుగుణంగా ప్రతి వాహనదారుడు నెంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ నారాయణ రెడ్డి హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని, ప్రతి నెలా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ స్పెషల్ డ్రైవ్‌లు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ప్రజలు చట్టాలను గౌరవించి, పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు.

## ‘ధైర్యానికి మరో రూపం ఇందిరా గాంధీ’

- ప్రజలందరూ సమానత్వంతో జీవించాలని తాపత్రయపడ్డ ఉక్కు మహిళా జన్మదిన వేడుకలు
- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 19 (జనంసాక్షి):** మాజీ ప్రధాని, ఉక్కు మహిళ స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతి వేడుకలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. మొదట డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి నగర కాంగ్రెస్ అధ్యక్షులు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి హాజరై మాజీ ఎమ్మెల్యే అరెపల్లి మోహన్, పిసిసి కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకారపు భాస్కర్ రెడ్డి లతో కలిసి ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించినారు. అనంతరం నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరా చౌక్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తోపాటు పలువురు నేతలు హాజరై పార్టీ శ్రేణుల సమక్షంలో ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి నేతలు మాట్లాడుతూ... ఉక్కు మహిళ భారతరత్న ఇందిరా గాంధీ ఈ దేశ ప్రధానిగా గరీబి హటావో అనే నినాదంతో ప్రతి పేదకు కూడు, గూడు, బట్ట ఉండాలని నాడు వారు చేసిన ఆలోచనతో నేడు ప్రతి వ్యక్తికి ఈ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని అన్నారు. ఇందిరాగాంధీ ఆశయాలను నెరవేర్చడానికి నేడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ శ్రేణులమైన మేమంతా వారు కన్న కలలను సాకారం చేయడానికి కంకణ బద్ధులమై పనిచేస్తామని, ఆ వీరవనిత ఉక్కు సంకల్పాన్ని ఆదర్శంగా తీసుకొని నేటి మహిళలు అన్ని రంగాలలో ముందుకు తీసుకు పోవలసిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో నాయకులు బానోతు శ్రావణ్ నాయక్, చర్ల పద్మ, అహ్మద్ అలీ, కుర్ర పోచయ్య, మడుపు మోహన్, కంకణాల అనిల్ కుమార్, వంగల విద్యాసాగర్, అబ్దుల్ రెహమాన్, ముస్తాక్ హైమద్, పొన్నం మధు, సలీముద్దీన్, నాగుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా విద్యాధికారి ఆకస్మికంగా కథలాపూర్ ప్రాథమిక పాఠశాల తనఖీ

**కథలాపూర్ నవంబర్ 19 (జనం సాక్షి) :** జగిత్యాల జిల్లా విద్యాధికారి కథలాపూర్ మండలంలోని పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సిరికొండ మరియు ఉర్దూ మీడియం పాఠశాలలను తనిఖీ చేశాడు. ఈ సందర్భంగా పలు తరగతి లను పరిశీలించి తగు సలహాలు, సూచనలు అందజేశారు పిల్లలకు నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనం అందించాలని, ఇందులో ఎటువంటి అలసత్వం వహించిన తగు చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎఫ్ఆర్ఎస్ ఉపాధ్యాయులు, విద్యార్థులు సకాలంలో వేయాలని తెలిపారు. అలాగే ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్నటువంటి సివిల్‌వర్క్స్‌ని పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి కే రాము, కోఆర్డినేటర్ రాజేష్ ప్రధానోపాధ్యాయురాలు వసంత, ఉపాధ్యాయులు సిఆర్పి విజయ్ పాల్గొన్నారు.

## రామగుండంను టెంపుల్ టౌన్‌గా తయారు చేస్తా

- సర్వ మతాలను కాపాడే బాధ్యత నాది
- ధనుర్ధాన ఆంజనేయ స్వామి విగ్రహం ఎక్కడ లేదు



**రామగుండం, జనంసాక్షి:** రామగుండం నియోజకవర్గంలో ఆలయాలను అభివృద్ధి చేసి. నూతన ఆలయాలను నిర్మించి. ఆధ్యాత్మిక కేంద్రం. టెంపుల్ టోన్‌గా తీర్చి దిద్దటమే తన లక్ష్యమని. రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మఖాన్ సింగ్ అన్నారు. కార్తీక మాస చివరి బుధవారం పురస్కరించుకొని. రామగుండంలోని రాముని గుండాల కొండపై. స్వయంబు వెలసిన ధనుర్ధాన ఆంజనేయ స్వామి క్షేత్రంలో.వేద పండితుల మంత్రోచ్చరనాల మధ్య అయన సతీమణి మనాలి ఠాకూర్‌తో కలిసి భక్త జనం మధ్య.రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతం. అభిషేకం అంగ రంగ వైభవంగా అట్టహాసంగా నిర్వహించి. అనంతరం కార్తీక మాస వనభోజనాలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మఖాన్ సింగ్ మాట్లాడుతూ ధనుర్ధాన ఆంజనేయ స్వామి విగ్రహం దేశంలో ఎక్కడ లేదని. కేవలం రామగుండంలో వెలువటం మన అదృష్టమని రాముడు నడియాడిన నేలలో మట్టి తవ్వకాలలో ధనుర్ధాన విగ్రహం వెలువ డటంతో 108 అడుగుల పంచముఖ హనుమాన్ ఆలయ నిర్మానానికి శ్రీకా రం చుట్టామని.నియోజకవర్గంలో ఆలయాలు నిర్మించి సనాతన. హిందూ ధర్మాన్ని కాపాడటంతో పాటు. సర్వ మతాలను గౌరవిద్దామని. భగవంతుని ఆశీస్సులతో అన్నివిదాల అభివృద్ధితో పాటు. విద్య. వైద్య. వ్యాపార కేంద్రంగా తయారు చేయటమే తన లక్ష్యమని అన్నారు. వేద పండితుల కోరిక మేరకు గోదావరి నదీ ఒడ్డున ఎకరం స్థలంలో వేద పాఠశాల నిర్మాణం చేపడతమన్నారు.దేవుని దయతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క. మంత్రి శ్రీధర్ బాబు ల సహకారంతో. రామగుండంలో 800 మెగావాట్ల నూతన విద్యుత్ ప్లాంటు ఏర్పాటు కావాలని సకల దేవుళ్లను వేడుకుంటున్నానని. దీనికి ప్రజల ఆశీర్వాదం కుడా ఉండాలని అన్నారు. కొండపై భారీగా భక్తులు తరలి రావటంతో. కొండ మొత్తం ఆధ్యాత్మిక శోభతో నిండి పోయి. జై శ్రీ రామ్. జై బజరంగ బలి నినాదాలతో హోరెత్తింది.ఈ కార్యక్రమంలో భక్తులు.తాజా మాజీ ప్రజా ప్రతినిధులు. నాయకులు పాల్గొన్నారు.

## వయో వృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి

**అదనపు (రెవిన్యూ) కలెక్టర్ డి.వేణు**



**పెద్దపల్లి,నవంబర్ 19(జనంసాక్షి) :** వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అదనపు (రెవిన్యూ)కలెక్టర్ డి.వేణు అన్నారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవంలో అదనపు కలెక్టర్ డి.వేణు పాల్గోన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ కుటుంబంలోని పిల్లలు మంచి మార్గంలో నడిచేలా గైడ్ చేయడంలో వయోవృద్ధులు కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. వయో వృద్ధులు తెలియజేసిన సమస్యలలో జిల్లా యంత్రాంగం పరిధిలోని సమస్యలను సంపూర్ణంగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ తెలిపారు.బ్యాంకు లలో వయో వృద్ధులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆర్.బి.ఐ నిబంధనలు ప్రకారం రుణాల జారీ అవకాశాలు పరిశీలిస్తామని తెలిపారు. వృద్ధులు తమ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం పనితీరు పట్ల ఏదైనా సలహాలు ఉంటే తెలియజే యాలని, వాటిని సానుకూల దృక్పథంతో తీసుకొని పాటించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు.వయో వృద్ధులు ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని, నలుగురితో స్నేహ పూర్వకంగా ఉండాలని, వీలైనంత వరకు తమ పనులు తామే చేసుకోవాలని నవ్వుతూ ఉండాలని అదనపు కలెక్టర్ కోరారు. సీనియర్ సిటిజన్స్ సంరక్షణ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు.అంతకుముందు జిల్లా సీనియర్ సిటిజన్స్ ఆర్గనైజేషన్ ద్వారా గత సంవత్సరం నుండి ఇప్పటి వరకు నిర్వహించిన కార్యక్రమా ల వివరాలను, వృద్ధులకు చట్టాలపై సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు వివరించారు.ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న వృద్ధులు చట్టాలలో చేయవలసిన మార్పులపై, సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై తమ అభిప్రాయాలను సభా దృష్టికి తీసుకొని వచ్చారు.అనంతరం వయో వృద్ధులను అదనపు కలెక్టర్ సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్, అదనపు డిఆర్‌డిఓ రవీందర్, వయోవృద్ధులు, వయో వృద్ధుల ఆశ్రమాలు నిర్వహించు నిర్వాహకులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి

**పట్టణ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు యేముల పుష్పలత**



**హుజురాబాద్, నవంబర్ 19 (జనం సాక్షి) :** మాజీ ప్రధాని ఇందిరాగాంధీ సేవలు మరువలేనివని పట్టణ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు యేముల పుష్పలత కొనియాడారు. బుధవారం ఇందిరాగాంధీ జయంతి వేడుకలను హుజురాబాద్‌లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ ఆదేశాల మేరకు పార్టీ కార్యాలయంలో కేక్‌కట్ చేసి ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ దేశానికి అందించిన సేవలను గుర్తు చేశారు. పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు యేముల పుష్పలత ఆధ్వర్యంలో ఇందిరానగర్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పిల్లలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మేకల తిరుపతి, జిల్లా అధికార ప్రతినిధి సొల్లు బాబు, బ్లాక్ అధ్యక్షురాలు ఆలేటి సుశీల, మండల అధ్యక్షురాలు పుల్ల రాధ, మైనార్టీ నాయకులు ఎండీ అప్సర్, సీనియర్ నాయకులు రామ్ శంకర్ గౌడ్, నర్సింగ్, కిరణ్ రెడ్డి, సునీత, కరీమ రియాజ్, మధుకర్ రిబ్క, విల్సన్, రఘుపతి, తిరుమల,రాధ, కల్పన పాల్గొన్నారు.




# కవితమ్మ.. మా జిల్లా సమస్యలు చూడమ్మా

**రంగారెడ్డి జిల్లాలో నేడు కల్వకుంట్ల కవిత జనంబాట**

- రెండు రోజుల పాటు జిల్లాలో పర్యటన
- జిల్లా సమస్యలను ముందుగానే పరిశీలన పరిశోధన చేసిన జనంసాక్షి








**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు రైతులు పడుతున్న సమస్యలతో పాటు ఈ మధ్య కాలంలో అకాల వర్షాల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వరద బాధితులను సైతం పరామర్శించేందుకు వారి కష్టాలను తెలుసుకునేందుకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జాగృతి జనం బాట కార్యక్రమం మరియు మేదావులతో సమాలోచన ప్రజలతో మమేకం అనే నినాదంతో అక్టోబర్ 25-2025 నాడు ప్రారంభిం చిన ఈ జాగృతి జనంబాట కార్యక్రమం ఫిబ్రవరి 13-2026 వరకు కొనసాగుతుందని ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం ఈ రాష్ట్రంలో ప్రజలు రైతులు నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలనే డిమాండ్ తో జాగృతి జనంబాట కార్యక్రమం కొనసాగుతుందనీ ఇదే క్రమంలో నేడు ఉదయం 9 గంటలకు రంగారెడ్డి జిల్లాలోని శేర్లింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ లో కాలనీవాసులతో బస్తీ సందర్శన 10:30కు రాజేంద్రనగర్ నియోజకవర్గం అత్తాపూర్ లో జలాల్ బాబానగర్ భూపాల్ నగర్ లోని ఇండ్లకు పట్టాలు రాని బస్తి వాసులతో భేటీ 11 గంటల 30 నిమిషాలకు మోకిలాలో ఎల్లమ్మ పోచమ్మ ఆలయాల సందర్శన మధ్యాహ్నం 12 గంటలకు చేవెళ్ల నియోజకవర్గం లోని షాబాద్ లో 42%శాతం రిజర్వేషన్ కోసం చేపట్టిన బీసీ సంఘాల దీక్షకు సంఘీభావం మధ్యాహ్నం ఒకటి 1-30 నిమిషాలకు షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రి సందర్శన రెండు 2:30 నిమిషాలకు షాద్ నగర్ ప్రభుత్వ బాలికల వసతిగృహం సందర్శన సాయంత్రం 4 గంటలకు కేశంపేట మండలం తొమ్మిది రేకుల గ్రామంలో త్రిబూల్ ఆర్ భూనిర్వాసితులతో సమావేశం 5:30 నిమిషాలకు కొత్తూరు మండలంలోని జెపి దర్గా సందర్శన 7 గంటలకు మహేశ్వరం నియోజకవర్గంలోని రాజరాజేశ్వరి ఆలయం సందర్శన కార్యక్రమం ఉంటుందని ఈ జనంబాట కార్యక్రమంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై భవిష్యత్ కార్యాచరణ నిర్వహి ంచి ఆ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం కొనసాగుతుందని తెలిపారు కల్వకుంట్ల కవిత...

### జిల్లాలో ప్రధాన సమస్యలు

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించి ఇక్కడి రైతాంగానికి సాగు త్రాగునీరు అందిస్తామని 2014 ,2018, 2023, ఎన్నికల్లో గత పాలకులు నేటి పాలకులు చెప్పిన ఇప్పటి వరకు అక్కడ పునాది రాయి కూడా పడలేదు దీంతో ఉమ్మడి రంగారెడ్డి వికారాబాద్ నల్గొండ జిల్లాలకు భవిష్యత్తులో త్రాగు సాగునీరుకు తీవ్రమైన నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది ప్రభుత్వసుపత్రిలో సరైన వైద్య సిబ్బంది సరైన సౌకర్యాలు ఆసుపత్రికి వచ్చే గర్భిణీ స్త్రీలు రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడంతోపాటు ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రులను ఆశ్రయించి అప్పుల పాలవుతున్న దుస్థితి నెలకొంది ఈ మధ్యకాలంలో కురిసిన అకాల వర్షాల వల్ల మొక్కజొన్న ప్రత్తి వరి పంట దెబ్బతినడంతో రైతన్న ఆందోళనకు గురవుతున్న పరిస్థితి నెలకొంది ప్రభుత్వ గురుకుల వసతి గృహాలలో కళాశాలలో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి కనిపిస్తుంది గ్రామీణ గిరిజన ప్రాంతాలకు నేటికి కూడా రోడ్డు రవాణా సౌకర్యం లేక ప్రజలు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు త్రిబుల్ ఆర్ రోడ్డు నిర్మాణం వల్ల తమ భూములు కోల్పోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు జిల్లాలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇండ్లు లేని పేదలకు కేటాయించకపోవడంతో ఇండ్లు లేని నిరుపేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నరూ జిల్లాలో కాలుష్యకారక పరిశ్రమలు ఎన్నో ఉన్న స్థానిక యువతకు మాత్రం ఆ పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు కూడా లభించని దుస్థితి రంగారెడ్డి జిల్లాలో నెలకొంది.

## ఇందిరమ్మ చీరను కట్టుకోవడం
# గౌరవంగా భావిస్తా

హైదరాబాద్, (జనంసాక్షి) : రాష్ట్రంలో ఆడబిడ్డలందరికీ అందిస్తున్న నాణ్యమైన ఇందిరమ్మ చీరను తాను కూడా కట్టుకుంటానని... పేద మహిళల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొస్తున్న పథకంలో భాగంగా పంపిణీ చేస్తున్న ఇందిరమ్మ చీరను కట్టుకోవడం తాను గౌరవంగా భావిస్తానని తెలంగాణ అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఇందిరాగాంధీ జయంతి పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమానికి మంత్రి సురేఖ హాజరయ్యారు. అనంతరం అక్కడే ఆమె మీడియాతో మాట్లాడుతూ.. మహిళల గౌరవాన్ని పెంపొందించేందుకు నాణ్యమైన చీరలు అందించాలన్న సంకల్పంతోనే పంపిణీ కొంత ఆలస్యం జరిగిందని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో నాణ్యత లేని చీరలు పంపిణీ చేసి.. చీరల పంపిణీ ప్రక్రియను మొత్తం అభాసుపాలు చేశారన్నారు. అయితే, తమ ప్రభుత్వం మాత్రం ఉక్కు మహిళ, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఇందిరమ్మ చీరల పంపిణీ పథకాన్ని ప్రారంభించామని వ్యాఖ్యానించారు. నాణ్యమైన చీరలు అందించే ఈ పథకాన్ని రెండు విడతలుగా అమలు చేస్తున్నామన్నారు. మొదటి విడతలో భాగంగా నేటి నుంచి తెలంగాణ తల్లి ఆవిష్కరణ దినోత్సవమైన డిసెంబర్ 9 వరకు గ్రామీణ మహిళలకు చీరల పంపిణీని పూర్తి చేస్తామన్నారు. రెండో విడతలో భాగంగా మార్చి 1, 2026 నుంచి పట్టణ ప్రాంత మహిళలకు చీరల పంపిణీ చేపడతామన్నారు. మొదటి విడతలో 65 లక్షల చీరలు, రెండో విడతలో 35 లక్షల చీరలు పంపిణీ చేస్తామన్నారు. మొత్తంగా కోటికి పైగా నాణ్యమైన చీరలను కోటి మంది మహిళలకు అందజేయాలన్న సంకల్పంతో ముందుకు వెళతామన్నారు. అర్హులైన ప్రతి మహిళకు నాణ్యమైన చీర అందించాలన్నదే తమ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. ఇందిరమ్మ చీరలను పూర్తిగా సిరిసిల్ల చేనేత కార్మికులు తయారు చేస్తున్నారని, ఉత్పత్తి ఆలస్యం అవుతున్న నేపథ్యంలో రెండు విడతల్లో పంపిణీ చేపడుతామన్నారు. చీరల నాణ్యత విషయంలో రాజీ పడటం లేదని మంత్రి సురేఖ పునరుద్ఘాటించారు.




# శభాష్ ఏసీబీ..!




- త్వరలో పురపాలక సంఘం కార్యాలయాలలో దాడులు?
- ప్రభుత్వ అధికారుల పనితీరు పారదర్శకంగా మారనుందా?

మేడ్చల్ (జనంసాక్షి) ఇటీవల జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు తెలంగాణలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి నిరోధక శాఖ అధికారుల దాడులు చేస్తూ లంచ గొండి అధికారులను జైలుకు పంపిస్తున్నారు. దీంతో సామాన్య ప్రజలు ఏసీబీ అధికారులను శభాష్ ఏసీబీ అధికారులు అంటూ ప్రశంసలతో ముంచెత్తుతు న్నారు. దీనికి ఉదాహరణగా ఇటీవల మెదక్ జిల్లాలో ఒక సబ్ ఇన్ స్పెక్టర్ స్థాయి అధికారి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టు బడగా ప్రజలందరూ టపాసులు కాల్చి ఏసీబీ అధికారులను ప్రశంసలతో ముంచెత్తి నారు. ఏసీబీ అధికారులు ఇటీవల రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో దాడులు చేస్తుండడంతో ఉద్యోగులు బెంబేలెత్తిపోతున్నట్లు ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మొన్నటి వరకు సబ్ రిజిస్టర్ కార్యాలయాలలో చేసినటువంటి దాడులు తాజాగా పురపాలక సంఘ కార్యాలయాలలో ప్రారంభమైనట్లు తెలియ వస్తుంది. బుధవారం నిజామాబాద్ జిల్లాలోని అవినీతి నిరోధక శాఖ అధికారులు పురపాలక సంఘం కార్యాలయానికి వెళ్లి పలు రికార్డులను పరిశీలించినట్లు తెలియ వస్తుంది. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారుల దాడులు ఇక పురపాలక సంఘం కార్యాలయాలలో జోరుగా కొనసాగుతాయని భావిస్తున్నారు. వాస్తవానికి ఈ ఏసీబీ అధికారుల దాడుల వల్ల ప్రభుత్వ కార్యాలయాలలో అధికారుల పనితీరు మరింత పారదర్శకంగా మారనున్నట్లు తెలియవస్తుంది. ఇప్పటికైనా విషయాన్ని తెలంగాణ అన్ని విభాగపు అధికారులు గుర్తించి సక్రమమైన పద్ధతిలో ఎలాంటి అవినీతికి తావు లేకుండా పనిచేయాలని ప్రజలు కోరుతున్నారు. ఏది ఏమైనప్పటికీ ఏసీబీ అధికారుల దాడుల వల్ల అవినీతి అధికారుల భరతం పట్టినట్లు అవుతుందని, తద్వారా అవినీతి అధికారులు తమ పంథాను మార్చుకోవాల్సి వస్తుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# జర్నలిస్టు సాంబశివరావు మృతికి సంతాపం

### పలువురు నేతల నివాళి, టీడబ్ల్యూజేఎఫ్ నేతృత్వంలో కుటుంబానికి ఆర్థిక సహాయం

కామేపల్లి (జనంసాక్షి) : కామేపల్లి మండల కేంద్రంలో మీసేవ నిర్వహిస్తూ విలేకరిగా పనిచేస్తున్న సీనియర్ జర్నలిస్టు ముక్తి సాంబశివరావు ( 40) గుండెపోటుతో మృతిచెందారు. ఆయన స్వగృహంలో ఉంచిన భౌతిక కాయాన్ని వివిధ పార్టీల నాయకులు, టీడబ్ల్యూజేఎఫ్ నేతలు సందర్శించారు. సాంబశివరావు మృతికి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. తన మీసేవ ద్వారా దాదాపుగా ఉచిత సర్వీస్ అందిస్తూ అందరి తలలో నాలుకలా ఉండే సాంబశివరావు ఆకస్మికంగా మృతి చెందటం స్థానికులను కలచివేసింది. ఆయన మరణ వార్త విన్న వెంటనే జనం భారీగా తరలివచ్చారు. సాంబశివరావు మరణ వార్త తెలిసిన వెంటనే టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, సయ్యద్ ఖదీర్, దువ్వా సాగర్, జానీపాష ఆయన భౌతిక కాయాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. జర్నలిస్ట్ సాంబశివరావు కుటుంబస్థితిగతులను చూసి పలువురు ప్రముఖులతో మాట్లాడి రూ. 1.30 లక్షల ఆర్థిక సహాయం చేయించారు. వారికి కాంగ్రెస్ జిల్లా నాయకులు, రాష్ట్ర అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్ కమిషన్ సభ్యులు రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి, కృష్ణారెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు చరణ్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు సహకరించారు. గిరిజన జర్నలిస్టు కుటుంబానికి అండగా నిలబడిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలను అభినందించారు.



**సంతాపం తెలిపిన నేతలు**

జర్నలిస్ట్ సాంబశివరావు మృతికి పలువురు సంతాపం తెలిపారు. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఫోన్ చేసి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆయనతో పాటు డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, తోటకూరి శివయ్య, ధనియాకుల హన్మంతరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి, ఇల్లందు మార్కెట్ కమిటీ డైరెక్టర్ బావ్ సింగ్, మాజీ సర్పంచ్ అజ్మీరా రామదాస్, మాజీ ఎంపిటిసి సభ్యులు నల్లమోతు లక్ష్మయ్య, జర్నలిస్టులు కోటగిరి రాము, తెల్లబోయిన రాము, కె.గోపి, ఎస్కే ఇబ్రహీం, చిలుముల శ్రీనివాస్ తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

## టేబుల్ టెన్నిస్ విజేతగా యస్‌బిఐటి విద్యార్థి



ఖమ్మం(జనంసాక్షి) : ఖమ్మం జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలలో తమ కళాశాలకు చెందిన ఎం.బి.ఏ., మొదటి సంవత్సర విద్యార్థి రెడ్డి సాయిశివ ప్రథమ స్థానంలో నిలిచాడని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. స్థానిక సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన పోటీలలో జిల్లాకు చెందిన వివిధ ప్రాంతాల నుండి సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొనగా సాయిశివ మొదటి స్థానంలో నిలవడం తమ కళాశాలకు గర్వకారణమని తెలిపారు. ఈ నెల చివరి వారంలో రాష్ట్ర స్థాయి, డిసెంబరు నెల మొదటి వారంలో జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభను కనబరచాలని ఆశించారు. ఈ సందర్భంగా విజేత సాయిశివను కళాశాల యాజమాన్యం అభినందించి సత్కరించారు. విద్యతో పాటు తమ కళాశాల విద్యార్థులకు క్రీడలపై ప్రత్యేక శిక్షణను అందిస్తూ ప్రోత్సహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి. ధాత్రి తెలిపారు. మొదటి సంవత్సరం నుండే క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల పట్ల మక్కువ ఉన్న విద్యార్థులను గుర్తించి, వారి నైపుణ్యాలకు అనుగుణంగ కావలసిన వనరులను యాజమాన్యం తరుపున అందించి ప్రోత్సహిస్తునట్లు తెలిపారు. విద్యార్థులకు నిరంతరం కేవలం విద్య పట్లనే కాకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు వారి మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రాజ్ కుమార్ తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఇష్టాయిష్టాలను గ్రహించి వారిలో దాగి ఉన్న కళలను ప్రోత్సహించాలని తద్వారా భవిష్యత్తులో జాతీయ స్థాయి క్రీడాకారులను అందించగలరని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.వి.వి. శివ ప్రసాద్, డాక్టర్ జె. రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## అల్వాల్ వేంకటేశ్వర స్వామి దేవస్థాన హుండీల లెక్కింపు

అల్వాల్, (జనంసాక్షి): అల్వాల్‌లోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవస్థాన హుండీలను బుధ వారం దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణ లో విప్పి లెక్కించారు. గత మూడు నెలల కాలానికి గాను హుండీల నుంచి మొత్తంగా రూ.2,58,656 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవస్థాన ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా సంజయ్ గోపాల్ సయించర్, ఆలయ కార్యనిర్వాహణాధికారి మఠం వీరేశం, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వెంకట్‌రాం రెడ్డి, వెంకటేష్ గౌడ్, పి.శ్రీనివాస్ గౌడ్, కే.శ్రీనివాస్ గౌడ్, శారద, పాల్గొన్నారు.

# భారత గడ్డపై 100 ఏళ్ల ఎర్రజెండా పోరాటాలు

- చలో ఖమ్మం -డిసెంబర్ 26 బహిరంగ సభ జయప్రదం చేయండి
- బాసర నుంచి ప్రారంభమైన ప్రచార జాత మొయినాబాద్‌లో ఆదరణ
- తెలంగాణ సాయుధ పోరాటం నుంచి రైతు హక్కుల డిమాండ్ల వరకు పార్టీ చరిత్ర గుర్తుచేసిన పశ్య పద్మ
- 42 దేశాల ప్రతినిధులు - 5 లక్షల మంది కార్యకర్తలతో ఖమ్మం సభ



మొయినాబాద్, నవంబర్ 19 (జనంసాక్షి): భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల సందర్భంగా "చలో ఖమ్మం" పిలుపుతో రాష్ట్రవ్యాప్త ప్రచార జాతలు కొనసాగుతున్నాయి. నిజాంబాద్ జిల్లా బాసర నుంచి ప్రారంభమైన ఈ జాత 18వ తేదీ సాయంత్రం మొయినాబాద్‌కు చేరుకుంది. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ నేతృత్వంలోని బృందానికి చేవెళ్ల నియోజకవర్గ ఇంఛార్జి కే.రామస్వామి, జిల్లా నాయకులు ఎం.ప్రభులింగం, వడ్ల సత్యనారా యణ, మంజుల తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. మొయి నాబాద్ మండల సిపిఐ కార్యదర్శి కె.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన స్వాగత సభలో పశ్య పద్మ మాట్లాడుతూ... వందేళ్లుగా బడుగు-బలహీన వర్గాల, కార్మిక-రైతు హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ ఎన్నో త్యాగాలు చేసిన ఏకైక పార్టీ సిపిఐ అని కొనియాడారు. బ్రిటిష్ వలస పాలకులకు "క్విట్ ఇండియా" అని పిలుపునిచ్చిన పార్టీ, తెలంగాణ సాయుధ పోరాటంలో 4 వేల మంది అమరవీరులను, 10 లక్షల ఎకరాల భూమిని, 4 వేల గ్రామాలను విముక్తి చేసిన ఎర్రజెండా చరిత్రను గుర్తుచేశారు. ప్రస్తుతం పత్తికి క్వింటాల్‌కు రూ.10,700 గిట్టుబాటు ధర, రైతులకు మరిన్ని సబ్సిడీలు అందించాలని డిమాండ్ చేశారు.
ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లి ఖాదర్‌వల్లి మాట్లాడుతూ... మోడీ ప్రభుత్వం ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని ఇచ్చిన హామీని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరగబోయే అఖిల భారత బహిరంగ సభను జయప్రదం చేయాలని, 42 దేశాల ప్రతినిధులతోపాటు దేశవ్యాప్తంగా 5 లక్షల మంది కార్యకర్తలను తరలించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి నరేందర్ ప్రసాద్, ప్రజానాట్యమండలి గాయకుడు ఉప్పలయ్యతో పాటు 15 మంది కళాకారులు, మండల-గ్రామ నాయకులు ఎండీ జలీల్, వెంకటయ్య, ప్రభాకర్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## సామినేని హత్యపై దశలవారీ పోరాటాలు

### నిందితుల అరెస్ట్‌కు 25న నిరసన దీక్ష : సీపీఐ(ఎం)రౌండ్ టేబుల్ సమావేశం




ఖమ్మం (జనంసాక్షి) : చింతకాని మండలం పాతర్లపాడు గ్రామ మాజీ సర్పంచ్, సీపీఐ(ఎం) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు సామినేని రామారావు హత్యకేసు విచారణ పక్కదోవ పట్టేలా సాగుతోందని, ఘటన జరిగి 20 రోజులైనా నిందితులను అరెస్టు చేయటంలో పోలీసుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ 25న దీక్ష చేపట్టాలని వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నేతలు పిలుపునిచ్చారు. సీపీఐ(ఎం) మధిర డివిజన్ కమిటీ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు అధ్యక్షతన ఖమ్మంలోని సుందరయ్య భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశానికి (బీర్ఎస్, సీపీఐ, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్, న్యూడెమోక్రసీ, వివిధ ప్రజాసంఘాల నేతలు హాజరయ్యారు. రామారావు హత్యపై దశలవారీ పోరాటాలు చేపట్టాలని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా సమష్టి ఉద్యమానికి పిలుపునిచ్చారు.

## ఎఫ్ఆర్ఎస్ సిస్టం ద్వారా పెన్షన్ల పంపిణీ

### పర్ఫామెన్స్ బాగా ఉండేలా చూసుకోవాలి



మేడ్చల్ ప్రతినిధి (జనంసాక్షి) : చేయూత పెన్షన్లపైన అవగాహన కార్యక్రమం, సెర్ప్ పెన్షన్ విభాగానికి సంబంధించిన డైరెక్టర్ గోపాల్ రావు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, సెర్ప్ ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్, డిఆర్డిఓ సాంబశివరావు మున్సిపల్, జిహెచ్ఎంసి కమిషనర్లు, తహసీల్దార్, ఎంపిడిఓలు పోస్టల్ డిపార్ట్మెంట్ టీజీ ఆన్లైన్ వాళ్లు బిల్ కలెక్టర్లు వార్డు ఆఫీసర్స్ సెక్రెటరీ డిపిఎం పెన్షన్ సిబ్బంది అందరూ హాజరుకావడం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లా డుతూ.. వృద్ధాప్య, ఒంటరి మహిళ, వింతంతు, దివ్యాంగులు, కల్లు గీత కార్మికుల, చేనేత కార్మికులు, బీడి కార్మికులు, బీడి టేకేదార్స్, ఎయిడ్స్, ఫైలేరియా, డయాలసిస్ వంటి పెన్షన్లపై అవగాహన సదస్సు కల్పించారు. మన జిల్లాలో పెన్షన్ పొందుతున్న వారి సంఖ్య ఒక లక్ష 42 వేల 383 మంది లబ్దిదారులు రూ. 34 కోట్ల 40 లక్షల 92 వేల ఆర్థిక సహాయం ప్రతినెల పొందుతున్నారన్నారు. ఫేషియల్ రికగ్నైజెషన్ ఆప్ ద్వారా పెన్షన్ల పంపిణీ జరుగుతుంది. నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్స్ కి కుటుంబ పెద్ద చనిపోయినట్టయితే ఆ కుటుంబానికి 20,000 చొప్పున 2022 జనవరి నుంచి ఇప్పటివరకు ఎవరున్నా కూడా మీ సేవలో గాని తాసిల్దార్ దగ్గరగాని మున్సిపాలిటీలో గాని అప్లై చేసుకున్నట్లయితే బిపిఎల్ ఫ్యామిలీ ఉన్నట్టయితే వారికి 20 వేల రూపాయలు ఇవ్వడం జరుగుతుంద న్నారు. గ్రీవెన్స్ సంబంధించి ప్రజావాణి గాని సీఎం ప్రజావాణి గ్రీవెన్స్ ఏ విధంగా చేయాలని వివరించారు. ఎఫ్ఆర్ఎస్ సిస్టం ద్వారా పెన్షన్ల పంపిణీ పర్ఫామెన్స్ బాగా ఉండేలా చూసుకోవాలని, సక్రమంగా ఆధార్ లింక్ చేసుకోవాలని సూచించారు. ఆధార్ మ్యాచ్ ఉన్నవాళ్లందరికీ కూడా పంపిణీ సక్రమంగా జరిగే విధంగా చూడాలన్నారు. ఎఫ్ఆర్ఎస్ పద్ధతి ఆధార్ లింకుతో ఉంది కాబట్టి లబ్ధిదా రులకు వాళ్ళ ఆధార్ ప్రకారం వస్తుందని, కాబట్టి ఆ సిస్టం మొత్తం కూడా ఇంప్రూవ్ చేయాలని, జిల్లా రిపోర్ట్స్‌లను చాలా బాగా పర్ఫామెన్స్ చేయడం, అదేవిధంగా అప్డేట్ చేస్తున్నారని డైరెక్టర్ అన్నారు.

## మల్కాజిగిరి ప్రభుత్వ జనరల్
# ఆసుపత్రికి మహర్దశ




- 70 నుంచి 220 పడకలకు అప్‌గ్రేడ్ అయిన ఆసుపత్రి
- మెడికల్ కాలేజీకి అనుబంధంగా మార్చటంతో వసతుల కల్పన పై దృష్టి
- 94 మంది డాక్టర్లు..వందకు పైగా స్టాఫ్ నర్సుల నియామకంపై చర్యలు
- ఆసుపత్రిలో డయాగ్నోస్టిక్ హాబ్ ..రేడియోలోజీల్యాబ్

మేడ్చల్ జిల్లా ప్రతినిధి నవంబర్ 19 (జనంసాక్షి):
మల్కాజిగిరి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి మంచి రోజులు వచ్చాయి. ఇసీఐఎల్‌లోని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుబం ధంగా మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిని మార్చటంతో మహార్ధశ కలిగినట్లయింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రజలకు వైద్య సేవలు మరింతగా పెరగనుంది. ప్రభుత్వం ఆదేశాల మేరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్యారోగ్య శాఖ ఆసుపత్రిలో పడకల సంఖ్యను పెంచటంతోపాటు దానికి తగ్గట్టుగా అన్నీ వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. మల్కాజిగిరి ప్రభుత్వ కేంద్ర ఆసుపత్రిలో ప్రస్తుతం 70 పడకలు ఉండగా, ఆ సంఖ్యను 220 పడకలకు పెంచారు. మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో పెరిగిన పడకల సంఖ్యకు అను గుణంగా ఇప్పటికే 94 మంది డాక్టర్లను నియమించారు. ఇందులో మెడికల్ కాలేజీకి సంబంధించిన డాక్టర్లు 49 మంది ఉండగా, వైద్యారోగ్యశాఖ సంబంధించిన డాక్టర్లు 45 మంది ఉన్నారు. దీనికి తగ్గట్టుగా స్టాఫ్ నర్సులను కూడా నియమించేందుకు చర్యలు తీసు కుంటోంది. ప్రస్తుతం మాత్రం మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో స్టాఫ్ నర్సుల సంఖ్య 30 మంది ఉండగా, ఈ సంఖ్యను వందకు పైగా పెంచటానికి వైద్యారోగ్యశాఖ కసరత్తు చేస్తోంది.ప్రభుత్వ మెడి కల్ కాలేజీలో అనాటమీ, బయోకెమిస్ట్రీ, పిజీయాలోజీ, సైకాలోజీ, పాథాలోజీ, మైక్రోబయాలోజీ, గైనకాలోజీ, పిడియా ట్రీక్స్, జనరల్ సర్జన్, మెడిసిన్, సైకాలోజీ, అర్థోపెటిక్, ఈఎన్టీ, అప్తాల్‌మాలోజీ, రేడియోలోజీ డిఫార్టుమెంట్లు ఉండటంతో ....దీనికి సంబంధించిన విభాగాలు మల్కాజిగిరి జనరల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు కానుండటంతో ప్రజలకు మరిన్నీ వైద్య సేవలు అందను న్నాయి. డయాగ్నోస్టిక్ హబ్‌తోపాటు రేడియోలోజీకి సంబంధించిన విభాగా లు కూడా త్వరలో ఆసుపత్రికి రానున్నాయి. మరో రెండేళ్లలో మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ల సంఖ్యతోపాటు వైద్య సేవల పరంగా మరిన్నీ వసతులు ఏర్పడే అవకాశమున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. అలాగే, అవసరమైన అన్నీ సదుపాయాలతోపాటు కావలసిన పరికరాలు, పారామెడికల్, వైద్యసిబ్బంది సంఖ్య కూడా పెంచనున్నారు.

**అల్వాల్ సూపర్ స్పెషల్ ఆసుపత్రితో ..**

మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలోని అల్వాల్‌లో నిర్మిస్తున్న టీమ్స్( సూపర్ స్పెషాలిటీ ప్రభుత్వ ఆసుపత్రి) పూర్తయినట్లయితే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రజలకు సముచిత స్థాయిలో వైద్య సేవలు అందగలవని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.రెండు వేల పడకలతో నిర్మిస్తున్న టీమ్స్ పనులు కూడా చకచకా జరిగేలా జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

**మూడు సీహెచ్‌సీలు**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఘట్కేసర్, మేడ్చల్,శామీర్‌పేటల్లో కమ్యూటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లు, 28 యూపీహెచ్‌పీసీలు ,12 పీహెచ్‌పీలు, 112 బస్తీ దవాఖానాలు, 69 పల్లె దవాఖానాలు ప్రజల కు వైద్య సేవలు అందిస్తున్నాయి. అలాగే, ఉప్పల్, మల్కాజిగిరి, మేడ్చల్, కీసర, జవహార్‌నగర్, అల్వాల్, బాలానగర్, మల్లాపూర్, షాపూర్‌నగర్‌ల్లోని ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు 24 గంటల వైద్యసేవలు అందిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ పేర్కొంటుంది. నారపల్లి ,కుషాయిగూడ, ఎంసీపల్లి, కుత్బుల్లాపూర్, దుండిగల్, పర్వతానగర్, వెంకట్‌రెడ్డినగర్ ఆరోగ్య కేంద్రాలలో ప్రతీ రోజు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గర్భిణీలకు ప్రసవాలను నిర్వహిస్తున్నట్లు వైద్యశాఖ తెలిపింది.

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో పెరిగిన వైద్యసేవలు :**

**డాక్టరు సి.ఉమాగౌరీ, డీఎంహెచ్ఓ**



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇప్పటికే ప్రైవేట్ రంగంలో ఏడు మెడికల్ కాలేజీలు ఉన్నాయి. ఈసీఐ ఎల్‌లో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు వల్ల జిల్లా ప్రజలకు వైద్య సేవలు మరింత పెరిగే అవకాశ ముంది.ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అనుబంధంగా మల్కాజిగిరి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 70 పడకల సంఖ్యను 220కి పెంచారు. దీంతో మల్కాజిగిరి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి. ఈసీఐఎల్‌లో మెడికల్ కాలేజీకి అనుబంధంగా ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేశారు.జిల్లాలో కొనసాగుతున్న బస్తీ,పల్లె దవాఖానాలు, సీహెచ్‌పీలు ,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు వైద్యశాఖ సేవలందిస్తోంది. కొత్తగా అల్వాల్‌లో నిర్మిస్తున్న టీమ్స్ పూర్తయితే ...ప్రజలకు పూర్తి స్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందుతాయి. .

# హిడ్మాది బూటకపు ఎన్‌కౌంటర్!

- పోలీసులు పట్టుకుని కాల్చారు
- మావోలు పోలీసుల ముందు లొంగిపోవాలి
- మాజీ మావోయిస్ట్ జంపన్న కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్, నవంబర్ 19 (జనంసాక్షి) :** పోలీస్ ఎన్‌కౌంటర్లో నిన్న మృతి చెందిన మావోయిస్ట్ నేత హిడ్మాను పోలీసులు పట్టుకొని చంపేశారని మావోయిస్టు మాజీ కేంద్ర కమిటీ సభ్యుడు జంపన్న ఆరోపించారు. ఈ అంశంపై జంపన్న మాట్లాడుతూ.. ఎన్‌కౌంటర్ తీరు పూర్తిగా పట్టుకుని కాల్చినట్లుగానే ఉందన్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో మావోయిస్టులు అడవుల్లో ఉండి ప్రాణాలు కోల్పోకండని జంపన్న మావోలకు హితవు పలికారు. 'పోలీసులు ముందు లొంగిపోవడం అవమానకరం ఏమి కాదు.. ప్రజల్లో ఉండి ప్రజలకోసం పోరాటం చేయొచ్చని,ప్రాణాలతో ఉండడం చాలా ముఖ్యం అన్నారు. మావోయిస్టు పార్టీలో కేంద్ర కమిటీలో తాను 17 ఏళ్ళ పాటు పని చేశానని, మావోయిస్టు పార్టీ ఇప్పుడు పూర్తిగా క్షీణించిందని ఆయన అన్నారు. భద్రత దళాలకు ఇన్‌ఫార్మర్ వ్యవస్థ గతం కంటే భారీగా పెరిగిందని, మరో వైపు మావోయిస్టులకంటే పోలీసులకు టెక్నాలజీ, అత్యాధునిక ఆయుధాలు ఉన్నాయని జంపన్న చెప్పారు. 'హిడ్మాను పోలీసులు పట్టుకొని చంపేశారు.. ఇది బూటకపు ఎన్‌కౌంటర్. ఎదురు కాల్పులు జరిగినట్లు ఎక్కడా ఆనవాళ్లు లేవు. ఏపీలో ఎవరినైనా చంపాలనుకుంటే అంతమంది మావోయిస్టులు యాక్షన్ చేయరు. ఏదైనా టార్గెట్‌లో యాక్షన్ చేయాలి అంటే ఐదు మందికి మించి ఉండరు. పదుల సంఖ్యలో యాక్షన్ అనేది పార్టీ అనుమతించదు. ఈ ఎపిసోడ్‌లో మధ్యవర్తిత్వం చేసిన వారు మోసం చేసినట్లు కనిపిస్తుందని జంపన్న వ్యాఖ్యానించారు. పార్టీలో హిడ్మాకు మంచి గుర్తింపు ఉంది. యాక్షన్ చేయడంలో హిడ్మా దిట్ట. నేను కేంద్ర కమిటీలో ఉన్న సమయంలో పలు సందర్భాల్లో హిడ్మాతో నాకు పరిచయం ఉంది. హిడ్మా యాక్షన్లో ఉన్నాడు అంటే.. సక్సెస్ చేసుకొనే వస్తాడు అనే నమ్మకం పార్టీలో ఉంది. యాక్షన్ చేయాలి అంటే ఒక వ్యక్తి నిర్ణయం ఉండదు. పార్టీ నాయకత్వం నిర్ణయం ప్రకారమే యాక్షన్ చేయాల్సి ఉంటుంది.హిడ్మా తరువాత మావోయిస్టు పార్టీ కనుమరుగైందనేది నేను నమ్మను. ఇక కేంద్ర కమిటీలో దేవ్ జీ , గణపతి, పల్లా రాజిరెడ్డి, గణెలిష్, సాగర్, జనార్దన్ తోపాటు ఇంకా కేంద్ర కమిటీలో ఉన్నారు. ఛత్తీస్ ఘడ్, మహారాష్ట్ర, బీహార్, మధ్య ప్రదేశ్‌లో ఇంకా మావోయిస్టులు సాయుధ పోరాటం చేస్తున్నారు.' అని జంపన్న తన అభిప్రాయాల్ని పంచుకున్నారు.

# వాళ్లు పోలీసులైనా, సిబ్బందైనా ఉపేక్షించవద్దు

- పోలీస్ అధికారులకు డీజీపీ హెచ్చరిక
- మెదక్ జిల్లా ఎస్సై అరెస్టుపై ఏసీబీకి ప్రశంసలు




**హైదరాబాద్, నవంబర్ 19 (జనంసాక్షి) :** మెదక్ జిల్లాలోని టేక్మల్ సబ్-ఇన్‌స్పెక్టర్‌ను అవినీతి ఆరోపణలపై పకడ్బందీగా అరెస్టు చేసిన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)ను డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) బి. శివధర్ రెడ్డి బుధవారం అభినందించారు. ఆయన ఏసీబీ డీజీ చారు సిన్హాతో పాటు, ఏసీబీలోని ఇతర అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ అవినీతిపరులైన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించవద్దని ఏసీబీకి సూచించారు. లంచం తీసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న టేక్మల్ పోలీస్ స్టేషన్ సబ్-ఇన్‌స్పెక్టర్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన అనంతరం స్థానిక ప్రజలు సంబరాలు చేసుకున్న సంఘటనపై పోలీసు అధికారులు, సిబ్బంది తమ పనితీరుపై స్వీయ సమీక్ష చేసుకోవాలని డిజిపి సూచించారు. లంచం తీసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారి అరెస్టుపై స్థానిక ప్రజలు పటాకులు కాల్చి బహిరంగంగా సంబురాలు జరుపుకొనే సంఘటన ప్రజల నుండి ఒక బలమైన సందేశాన్ని పంపుతుందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అభిప్రాయపడ్డారు. ఆ సంఘటన పోలీసుల పట్ల ప్రజల విశ్వాసాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందన్నారు. ప్రజలు అవినీతిని ఏ మాత్రం ఉపేక్షించరని, పోలీసుల నుండి వారు శాంతిభద్రతలను, చక్కని పోలీసింగ్ ను కోరుకుంటారని, ప్రజలను పీడించేవారి పట్ల నిర్దయగా ఉంటారని ఈ సంఘటన రుజువు చేసిందని ఆయన అన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ఎవరైనా అవినీతికి పాల్పడితే వారి పైన పర్యవేక్షణ చేసే అధికారుల లోపమేనని భావిస్తానని, వారి మీద కూడ చర్యలు తీసుకుంటామని డిజిపి హెచ్చరించారు. పోలీసు అధికారులు, సిబ్బంది నీతి, నిజాయితీలో పని చేయాలన్నారు.

# భూమి విషయంలో ఎస్ఐ జోక్యం

- ట్యాంక్ ఎక్కి మహిళ నిరసన



**మహబూబాబాద్, నవంబర్ 19 (జనంసాక్షి) :** తమ భూమి తమకు చెందకుండా ఎస్సై అడ్డుపడుతున్నాడంటూ, దీని వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఓ మహిళ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపింది. తమ భూమి విషయంలో ఎస్ఐ జోక్యంపై చర్యలు తీసుకోవాలని కోరింది. అయితే పోలీసులు సర్ది చెప్పి ఆమెను దింపారు. మహిళ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ డివిజన్ కేంద్రానికి చెందిన మంగళంపల్లి ప్రసాద్‌కు ఇద్దరు సోదరులు. తమ తండ్రి వారసత్వంగా వచ్చిన 22 గుంటల వ్యవసాయ భూమిని ముగ్గురికి కాకుండా.. ఇద్దరికీ మాత్రమే పంపిణీ చేశాడు. దీంతో ప్రసాద్.. గత నెలలో తొర్రూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీన్ని పట్టించుకోకుండా ఎస్సై ఉపేందర్.. ప్రసాద్, ఆయన భార్య ఏకాంతను ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. వారికి రావాల్సిన ఏడు గుంటల భూమిని దక్కకుండా చేస్తున్నాడని ఏకాంత.. తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న వాటర్ ట్యాంక్‌పైకి ఎక్కి నిరసన తెలిపింది. సమాచారం అందుకున్న పోలీసులు.. సంఘటన స్థలానికి చేరుకుని ఆమెకు సర్ది చెప్పి.. కిందికి దింపేందుకు ప్రయత్నాలు చేసారు.

# మహిళల హక్కుల బలోపేతానికి కృషి

- రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి సీతక్క



**హైదరాబాద్, నవంబర్ 19 (జనంసాక్షి) :** రాష్ట్రంలో మహిళల అభివృద్ధి, ఆత్మవిశ్వాసం, హక్కుల బలోపేతం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర పంచాయితీ రాజ్, మహిశలా శిశు, సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ అన్నారు. మహిళల సమస్యలు అనే అంశంపై రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ నేడు బేగంపేటలోని ప్రజా భవన్లో నిర్వహించిన ఒక రోజు రౌండ్ టేబుల్ సమావేశానికి మంత్రి సీతక్క హాజరయ్యారు. పలువురు మహిళా ఐఏఎస్ అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్న ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, మహిళలు ఎదుర్కొంటున్న వివక్షతను రూపుమాపే విధంగా నిపుణులు, మేధావులు, అధికారుల సలహాలు తీసుకుంటామని అన్నారు. మహిళల సంక్షేమం, భద్రత విషయంలో ఎన్నో చట్టాలు ఉన్నా.. సమాజ పోకడల వల్ల కొన్నిసార్లు ఆచరణకు నోచుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు తమ హక్కులు తెలుసుకోలేని పరిస్థితి కొన్నిసార్లు ఎదురవుతోందని అంటూ, ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో మహిళలకు విద్యా, ఉపాధి ఉద్యోగ, భద్రత విషయాల్లో ఎలాంటి ఫెసిలిటీస్ ఇవ్వాలి అన్న అంశాలపై చర్చించి నివేదిక రూపొందించాలని సూచించారు. మహిళా విధానము ఎలా ఉంటే బాగుంటుంది అనే అంశంపై రౌండ్ టేబుల్ కన్ఫరెన్స్ ద్వారా అభిప్రాయాలు తెలుసుకొని, ఇక్కడ వచ్చే సలహాలు, సూచన ప్రాతిపదికగా మరోసారి త్వరలో భారీ సదస్సును నిర్వహిస్తామని సీతక్క వెల్లడించారు. చిన్నారులు, పిల్లలు, మహిళలు ఉపాధి విద్య అంశాల్లో ప్రభుత్వం ఇంకా ఏమి చేయాల్సి ఉందో తెలుసుకుంటామని చెప్పారు. ఎన్నో ఆటంకాలను చేదించి దేశ ప్రధానిగా ఈ దేశ అభివృద్ధిలో ముద్ర వేసిన ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మహిళలు ఆత్మగౌరవంతో ఎదగాలనీ ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళల ఆర్థిక సాధికారత కోసం తమ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. మహిళా సాధికారత కోసం ప్రభుత్వాలు చట్టాలు, విధానాలు తీసుకొచ్చుకునే విధంగా.. మీరిచ్చే సూచనలు సలహాలు ఉపయోగపడు తుందని, ఈ రౌండ్ టేబుల్ సమావేశం ఒక చర్చ మాత్రమే కాదు..భవిష్యత్తు మహిళా విధానానికి పునాది వేసే చారిత్రక ఘట్టమని స్పష్టం చేశారు. సీనియర్ ఐఏఎస్ అధికారులు శైలజా రామయ్యర్, అనిత రామచంద్రన్, దివ్య , దాసరి హరిచందన లతో పాటు వివిధ రంగాల్లో ప్రముఖ మహిళా ప్రతినిధులు ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.



# బెంగళూరుతో పట్టపగలే దోపిడీ

- ఏటీఎంకు తరలిస్తున్న డబ్బుతో పరార్

**బెంగళూరు, నవంబర్ 19 (జనంసాక్షి) :** పట్టపగలే నడిరోడ్డుపై భారీ దొంగతనం జరిగింది. పన్ను అధికారులమంటూ వచ్చిన దుండగులు ఏడు కోట్ల రూపాయలతో పరారీ అయ్యారు. కర్ణాటక రాజధాని బెంగళూరు లో ఈ ఘటన చోటుచేసుకుంది. మీడియా కథనాల ప్రకారం.. బెంగళూరులోని జేపీ నగర్‌లో ఉన్న ఒక ప్రైవేటు బ్యాంక్ బ్రాంచ్ నుంచి క్యాష్ వ్యాన్‌లో ఏటీఎంకు నగదు తరలిస్తున్నారు. ఆ వ్యాన్ అశోకా పిల్లర్ ప్రాంతంలో ఉండగా.. అకస్మాత్తుగా ఒక కారు అడ్డుగా వచ్చింది. అందులో వ్యక్తులు నగదు ఉన్న వాహనం వద్దకు వచ్చి.. పన్ను విభాగ అధికారులమని, పత్రాలు చూపించాలని హడావుడి చేశారు. వ్యాన్ సిబ్బంది స్పందించేలోపే.. వారిని, డబ్బును కారులోకి బలవంతంగా ఎక్కించారు. కొంతదూరం కారుపోనిచ్చి, ఆ సిబ్బందిని బలవంతంగా దింపేశారు. తర్వాత ఆ డబ్బుతో పరారయ్యారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టాయి. సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తున్నాయి. కరడుగట్టిన దోపిడీ ముఠాలు దీనివెనక ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు.

# పుట్టపర్తిలో ప్రధాని మోడీకి ఘనస్వాగతం

- స్వాగతించిన సిఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్
- సత్యసాయితో అనుబంధాన్ని గుర్తు చేసుకున్న మోడీ



**పుట్టపర్తి, నవంబర్19 (జనంసాక్షి) :** ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం మరోసారి ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వచ్చారు.. పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు.. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సత్యసాయి మహా సమాధిని దర్శించుకుని నివాళు లర్పించారు.. అయితే, తన పర్యటనకు ముందు.. తన పుట్టపర్తి టూర్‌పై ఎక్స్‌లో పోస్ట్ చేశారు ప్రధాని నరేంద్ర మోడీ.. తనకు సత్యసాయితో ఉన్న అనుబంధాన్ని.. ఆయన సేవలను కొనియాడుతూ.. గతంలో తాను సత్యసాయిని కలిసిన ఫొటోలను షేర్ చేశారు.. శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనడానికి ఆంధప్రదేశ్‌లోని నా సోదర సోదరీమణులలో ఒకరిగా ఉండటానికి ఎదురుచూస్తున్నాను. సమాజ సేవ, ఆధ్యాత్మిక మేల్కొలుపు కోసం ఆయన జీవితం, చేసిన ప్రయత్నాలు తరతరాలకు మార్గదర్శకంగా ఉంటాయి. ఆయనతో సంభాషించడానికి మరియు ఆయన నుండి నేర్చుకోవడానికి కొన్ని సంవత్సరాలు నాకు వివిధ అవకాశాలు లభించాయని అంటూ ఎక్స్‌లో పేర్కొన్నారు ప్రధాని మోడీ.. ఇక, మా సంభాషణల నుండి కొన్ని దృశ్యాలు ఇక్కడ ఉన్నాయి అంటూ.. సత్యసాయి బాబాను గతంలో కలిసిన కొన్ని చిత్రాలను ఎక్స్‌లో పంచుకున్నారు..

# ఉమామహేశ్వర రిజర్వాయర్ వద్దేవద్దు


- భూముల జోలికి వస్తే ఖబర్దార్
- హెచ్చరించిన బల్మూర్ రైతులు



**నాగర్ కర్నూల్, నవంబర్ 19 (జనంసాక్షి) :** కాంగ్రెస్ నాయకులు కమిషన్లకు కక్కుర్తిపడి ఉమామహేశ్వర రిజర్వాయర్ ను నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నారని బల్మూరు రైతులు ఆరోపించారు. భూముల జోలికి వస్తే ఖబర్దారని రైతులు హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పంట బోనస్ ఇవ్వడానికి మొఖం లేదు కానీ రిజర్వాయర్ కడతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా బల్మూరు మండలంలో ఉమామహేశ్వర రిజర్వాయర్ కోసం ప్రభుత్వం బలవంతంగా భూసేకరణ చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి గుడి నుంచి తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. ఎన్నికల సమయంలో ఆలయం ఎదుట హామీలిచ్చి రిజర్వాయర్‌ను కట్టమని చెప్పినా నాయకులే నేడు రైతులకు అవసరం లేని రిజర్వాయర్ నిర్మించేందుకు బలవంతంగా భూమలు లాక్కొవాలని చూస్తే సహించబోమని అన్నారు. కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులు, ఇంజినీర్లను బతికించడానికి ప్రాజెక్టును కడుతున్నారని విమర్శించారు. ప్రాజెక్టు జోలికి రావొద్దని కోరారు. ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని, రిజర్వాయర్ కోసం విలువైన మా భూములు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ప్రజాస్వామిక దేశంలో రాజరీక పాలన సాగదని హెచ్చరించారు.

# నిజామాబాద్ టౌన్‌ప్లానింగ్‌లో ఏసీబీ సోదాలు

- పలు ఫిర్యాదులు రావడంతో రంగంలోకి ఎసిబి



**నిజామాబాద్, నవంబర్ 19 (జనంసాక్షి) :** నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్ భవనంలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఉదయం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని వివిధ విభాగాలలో తమ పనుల నిమిత్తం జనాలతో హడావిడిగా ఉన్న సమయంలో ఒక్కసారిగా ఏసీబీ అధికారులు వచ్చి నేరుగా టౌన్ ప్లానింగ్ కార్యాలయంలోకి వెళ్లారు. దీంతో ఏం జరిగిందోనని అధికారులు, సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. టౌన్ ప్లానింగ్ విభాగంపై పలు ఆరోపణలు రావడంతో ఏసీబీ దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. టౌన్ ప్లానింగ్ విభాగంలో పలువురు సిబ్బంది పై పలు ఫిర్యాదులు రావడంతో అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహించినట్లు సమాచారం. కాగా, టౌన్ ప్లానింగ్ కార్యాలయంలో ఏసీబీ బృందం ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. పూర్తి సమాచారం తనిఖీల అనంతరం వెల్లడిస్తామని ఏసీబీ అధికారి పేర్కొన్నారు.

# అన్ క్లైయిమ్డ్ డిపాజిట్లకు ఇక మోక్షం

- బ్యాంకులో వివరాలు సమర్పించి పొందవచ్చు




**ముంబై, నవంబర్ 19 (జనంసాక్షి) :** బ్యాంకులు, లేదా నాన్ బ్యాంకింగ్ సంస్థల్లో మదుపు చేసి మర్చిపోయిన, లేదా మిగులు సొత్తు మీకు దక్కే ఛాన్స్ ఇప్పుడు వచ్చింది. కేంద్రం ఇటీవల ఈ సొమ్ములు తీసుకునేందుకు చాలా సులువైన వెసులుబాటు కల్పిస్తోంది. ఈ సొత్తుకు మీరు హక్కుదారులు, లేదా వారసులైన ఎడల నిరూపయోగంగా బ్యాంకుల్లో ఉండిపోయిన సదరు సొమ్ములు చాలా సులభంగా మీ చేతికి వస్తాయి. బ్యాంకుల్లో మిగిలిన చిన్న మొత్తాలు, డిపాజిట్లు, ఇలా ఎన్నో వివరాల గురించి చాలా మందికి తెలియక పోవడంతో అవి అలాగే ఉండిపోయాయి. భారత రిజర్వ్ బ్యాంక్ ప్రకారం, బ్యాంకు ఖాతాల్లో 10 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం అలా మిగిలిన డబ్బులు 'అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లు'గా పరిగణించబడతాయి. ఇవి సేవింగ్స్, కరెంట్ అకౌంట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లు, లోన్ బ్యాలెన్స్‌లు, చెక్‌లు, ట్రాన్స్‌ఫర్లు, ప్రీపెయిడ్ కార్డుల్లో మిగిలిన మొత్తాలు లేదా విదేశీ కరెన్సీ డిపాజిట్లు కూడా ఉండవచ్చు. ఇటువంటి మొత్తాలు బ్యాంకులు నెలవారీగా సమీక్షించి, డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్‌కి బదిలీ చేస్తాయి. ఈ సొమ్ములే ఇప్పుడు అర్హులైన వారికి అందజేసేందుకు మోదీ సర్కారు చర్యలు చేపట్టింది. దీనికి సంబంధించి గత నెలలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా ఒక ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. ఈ పక్రియ చాలా సులభం, ఇంకా వేగవంతం కూడా. మీ బ్యాంకు ఖాతా వివరాలను చూసుకోండి. బ్యాంకు వెబ్‌సైట్ లేదా యాప్‌లో లాగిన్ అయి, పాత ఖాతాలు లేదా మెచ్యూరిటీ పూర్తయిన ఈఆలను తనిఖీ చేయండి. ఖీఃఎ వెబ్‌సైట్‌లో ఆఇం సెక్షన్‌లో కూడా మీరు చెక్ చేయవచ్చు. లేని పక్షంలో బ్యాంకు బ్రాంచ్‌లో సహాయం తీసుకోచ్చని ఆర్‌బిఐ సూచించింది.

# సింగరేణి భవన్ వద్ద కవిత ఆందోళన

- అదుపులోకి తీసుకున్న పోలీసులు



**హైదరాబాద్, నవం బర్ 19 (జనంసాక్షి) :** నాంపల్లిలోని సింగరేణి భవన్ వద్ద ఆందోళనకు దిగిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగాల్ని పునరుద్ధరించాలని కోరుతూ తెలంగాణ జాగృతి, హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో సింగరేణి భవన్ ముట్టడికి యత్నించారు. సింగరేణి సమస్యలను పరిష్కరించలేని అసమర్ధ ప్రభుత్వమని దుయ్యబట్టారు. కార్మికుల కోసం మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈక్రమంలో.. కవితతో పాటు హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, అధ్యక్షుడు తిప్పారపు సారయ్య సహా పలువురు నాయకులను నాంపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. సింగరేణి భవన్‌ను కవిత ముట్టడిస్తుందన్న సమాచారంతో పోలీసుల భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా.. పోలీసుల కళ్లుగప్పి ఆమె ఆటోలో సింగరేణి భవన్‌కు చేరుకుని ముట్టడికి ప్రయత్నించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370